బుధవారం 3-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 41

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి...
ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమిండియాకు అగ్రస్థానం. - 12లో



అదిగో నవలోకం
తనలాంటి వారికి పెళ్లిళ్లు చేస్తున్న దివ్యాంగురాలు కృష్ణప్రియపై స్టోరీ. - 11లో



బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తాం
కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్‌దళ్, పీఎఫ్‌ఐ వంటి సంస్థలను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. .
- వివరాలు 6లో



హనుమపై అంత ద్వేషమా?
కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ప్రధాని మోదీ మండిపడ్డారు.
- వివరాలు 6లో



గూగుల్‌ను వీడిన 'ఏఐ గాడ్‌ఫాదర్'
గాడ్ ఫాదర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా పేరుగాంచిన జెఫ్రీ హింటన్ (75) గూగుల్‌కు రాజీనామా చేశారు.
- వివరాలు 6లో

ముగియనున్న 'అడ్వాన్స్‌డ్' గడువు
ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 4న ముగియనుంది.
- వివరాలు 14లో

న్యూస్‌రీల్

ఎంసెట్‌కు అదనంగా 29 కేంద్రాలు



తెలంగాణ ఎంసెట్‌కు ఈసారి 50 వేల దరఖాస్తులు పెరగడంతో అదనంగా 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి మంగళవారం తెలిపారు. ఏపీలోనూ పరీక్ష కేంద్రాల పెంపు ఉంటుందని చెప్పారు.
- వివరాలు 14లో

స్టాఫ్‌నర్స్ పోస్టులకూ ఆన్‌లైన్ పరీక్ష



వైద్యారోగ్య శాఖలో వివిధ విభాగాల్లోని స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం సగం మందికి, సాయంత్రం సగం మందికి పరీక్ష నిర్వహించనుంది. వైద్య ఆరోగ్యశాఖ పరీక్ష పేపర్‌ను తయారు చేయగా, హైదరాబాద్ జేఎన్‌టీయూ పరీక్షలు నిర్వహిస్తుంది. ఒకట్రెండు నెలల్లో పరీక్ష జరిగే అవకాశం ఉందని సమాచారం.
- వివరాలు 14లో

ప్రియాంక సభకు టీపీసీసీ కసరత్తు



ఈ నెల 8న కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ హైదరాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను టీపీసీసీ నేతలు మంగళవారం ఖరారు చేశారు. దీని ప్రకారం ఎల్బీనగర్ నుంచి సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ నిరుద్యోగ నిరసన మార్చ్‌కు ఆమె పాదయాత్రగా చేరుకోనున్నారు.
- వివరాలు 3లో

ఎల్‌కేజీకి లక్షన్నర!

- కోవిడ్ తర్వాత చాలాచోట్ల రెట్టింపు..
- సగం ఫీజు ముందే కట్టాలని డిమాండ్
- కార్యాచరణకు నోచుకోని నియంత్రణ చర్యలు

14లో



తడిసినా కొంటాం

ఒక్క గింజ కూడా పోకుండా త్వరగా సేకరిస్తాం.. మామూలు ధాన్యం ధరనే తడిసిన ధాన్యానికీ చెల్లిస్తాం

రైతులకు సీఎం భరోసా

- రైతాంగం ఆందోళనకు గురికావద్దు
- ఇకపై మార్చిలోగానే కోతలు.. అందుకు వీలుగా ముందస్తు నాట్లు వేసుకోవాలి
- తడిసిన ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఒక్క గింజ కూడా పోకుండా వీలైనంత త్వరగా సేకరిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భరోసా ఇచ్చారు. మామూలు ధాన్యం ధరనే తడిసిన ధాన్యానికీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రైతన్నల ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుంటోందని, ఆపత్కాలంలో వారి దుఃఖాన్ని, కష్టాన్ని పంచుకునేందుకు మరోసారి సిద్ధమైందని చెప్పారు. రైతుల కష్టాల్లో భాగస్వామ్యం కావడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, అన్నదాతలు ఏమాత్రం ఆందోళన చెందవద్దని కోరారు. యాసంగి ధాన్యంతో పాటు అకాల వర్షాల్లో తడిసిన ధాన్యం సేకరణపై మంగళవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణ జరుగుతోందని, అయితే అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ధాన్యం సేకరణ త్వరలోనే పూర్తి చేస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా
మిగతా 2వ పేజీలో ▶

గీత కార్మికులకు 5 లక్షల బీమా

ప్రమాదం జరిగిన వారం రోజుల్లో అందేలా చేయాలని సీఎం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతు బీమా తీరుగానే కల్లుగీత కార్మికుల కోసం 'గీత కార్మికుల బీమా'ను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. కల్లు గీస్తూ ప్రమాదంలో మృతి చెందిన గీత కార్మికుని కుటుంబానికి రూ. 5 లక్షల బీమ సాయం నేరుగా, వారి ఖాతాలో జమా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గీత కార్మికులకు బీమా అమలుపై డా.బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో
మిగతా 2వ పేజీలో ▶

● అమ్మేదెట్లా?



పెద్దపల్లి జిల్లా సుగ్లాంపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో వర్షాలకు మొలకెత్తిన ధాన్యం పిలకలను చూపిస్తున్న రైతు అంజయ్య

అన్నదాత ఆందోళన

నిండా ముంచిన అకాల వర్షం

మిగిలిన ధాన్యం అమ్ముకునేందుకు ఇక్కట్లు

పలుచోట్ల నిరసన కార్యక్రమాలు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు.. మిగిలిన ధాన్యాన్ని అమ్ముకునే క్రమంలో ఇబ్బందులకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వారిని ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. పలు జిల్లాల్లో రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. మరోవైపు వదలకుండా కురుస్తున్న వర్షాలు మరింత పంట
మిగతా 2వ పేజీలో ▶

మరో 4 రోజులు వర్షాలే
హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి 2లో

మూడు సిలిండర్లు మాకెందుకివ్వరు?

ప్రధాని మోదీపై కేటీఆర్ ధ్వజం

- మీరు దేశానికి ప్రధానమంత్రా? లేక ఒక్క కర్ణాటకకేనా?
- ఉచితాలపై అప్పుడు తెలంగాణను నిందించారుగా..
- ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఎలా పెడతారు?
- సిరిసిల్ల జిల్లాలో పంటలు పరిశీలించిన మంత్రి


రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో రైతును ఓదారుస్తున్న కేటీఆర్

సిరిసిల్ల: ఉచితాలు వద్దని, రేవ్డీ కల్చర్ అంటూ.. తెలంగాణ ప్రభుత్వాన్ని నిందించిన దేశ ప్రధాని నరేంద్రమోదీ.. ఏటా మూడు సిలిండర్లు, నిత్యం అర లీటరు పాలు ఉచితంగా ఇస్తామంటూ కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడాన్ని రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు తప్పుపట్టారు. మోదీ దేశానికి ప్రధానమంత్రా? లేక ఒక్క కర్ణాటకకేనా అని ప్రశ్నించారు. సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1,200కు పెంచిన బీజేపీ సర్కార్.. తెలంగాణ రాష్ట్రంలో మూడు
మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో ఫ్లిప్‌కార్ట్ మరో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ 13లో

గెలిపిస్తే.. రూ.500కే సిలిండర్ ఇస్తాం

యాదాద్రి జిల్లా పీపుల్స్ మార్చ్‌లో భట్టి హామీలు

ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ


యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల హెల్త్‌కార్డు, ఉచిత విద్య అందిస్తామన్నారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట, సైదాపురం, యాదగిరిగుట్ట పట్టణంలోని కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో
మిగతా 2వ పేజీలో ▶

● కర్ణాటక



మార్పు దిశగా..!

ప్రధాన పార్టీలకు 'హైదరాబాద్-కర్ణాటక' సవాలు

- పార్టీలు, ఎజెండాలు కాకుండా అభ్యర్థుల గుణగణాలకే ప్రాధాన్యం
- కలబురిగి, బీదర్ జిల్లాల్లో ప్రధాన పార్టీల హోరాహోరీ
- దిగ్గజ నేతలు బరిలో ఉండటంతో ఫలితాలపై ఉత్కంఠ

కలబురిగి నుంచి కల్వల మల్లికార్జున్‌రెడ్డి

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేళ 'హైదరాబాద్-కర్ణాటక' ప్రధాన రాజకీయ పక్షాలకు సవాల్ విసురుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లను సమానస్థాయిలో ఆదరించిన బీదర్, కలబురిగి ఓటర్లు బీదర్ దక్షిణ నియోజకవర్గంలో జేడీఎస్‌కు పట్టం కట్టారు. ఈ రెండు జిల్లాల పరిధిలో ఈసారి బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ నుంచి దిగ్గజ నేతలు, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కుటుంబాలకు చెందిన నాయకులు బరిలోకి దిగారు. వీరిలో కొందరికి ప్రభుత్వ వ్యతిరేకత, మరికొందరికి స్థానిక వ్యతిరేకత తోడవుతుండటంతో ఫలితాలు తారుమారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మెజారిటీ స్థానాల్లో పార్టీలు, ఎజెండాలు, హామీలు పక్కన పెట్టి అభ్యర్థుల గుణగణాలకే ఓటర్లు ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. గత ఐదేళ్లలో రెండు పార్టీలు, ముగ్గురు ముఖ్యమంత్రులు మారడంతో 'సుస్థిర ప్రభుత్వం' భావన ఓటర్లలో ప్రధానంగా కనిపిస్తోంది. ఈ నెల 10న జరిగే పోలింగ్‌లో 'మార్పు'కు పట్టం కట్టేందుకు బీదర్, కలబురిగి ఓటర్లు సిద్ధమవుతున్నట్లు 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

మూడు పార్టీల పాలన బేరీజు

40 శాతం కమీషన్ ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లగా, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం, పార్టీ ఎమ్మెల్యేలు ప్రజలకు దూరంగా ఉండటం, హిజాబ్, ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం, అవినీతి, రిజర్వేషన్లు వంటి అంశాలు బీజేపీపై ప్రభావం చూపుతున్నాయి. ప్రధాని మోదీ ఇమేజీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ బీజేపీ ఓటర్లకు దగ్గరయ్యేందుకు యత్నిస్తోంది. పాత నేతలకే టికెట్లు ఇవ్వడం కూడా బీజేపీకి
మిగతా 3వ పేజీలో ▶

థాయ్‌లో పేకాట.. నగరం నుంచి ఫైనాన్స్

థాయ్‌లాండ్‌లోని పేకాట స్థావరంలో ప్రత్యక్ష ప్రసార ఉపకరణాలు

హైదరాబాద్‌లో ఉన్న ఫైనాన్షియర్ల కోసమేనని అనుమానం



- 4 రోజుల్లో రూ. 50 కోట్ల లావాదేవీలు
- చీకోటి సహా అందరికీ థాయ్ కోర్టు బెయిల్.. త్వరలో స్వదేశానికి..

సాక్షి, హైదరాబాద్: చీకోటి ప్రవీణ్ సహా 84 మంది భారతీయుల అరెస్టుకు కారణమైన థాయ్‌లాండ్‌లోని అక్రమ క్యాసినోలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై అక్కడి పోలీసులు స్పష్టత ఇచ్చారు. గత నెల 27 నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు రూ.50 కోట్ల టర్నోవర్ జరిగినట్లు తేల్చారు. ఈ మేరకు చోన్బూరీ ప్రావిన్స్ పోలీసు చీఫ్ కంపోన్ లీలప్రపపోన్ ఓ ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం... ఏడు అంతస్తుల్లో విస్తరించిన ఆసియా హోటల్లో మొత్తం 300 గదులు ఉన్నాయి. గత నెల 27న కొన్ని రూముల్లోకి దిగిన 84 మంది ఆ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో వెలసిన అక్రమ జూదగృహంలో పేకాట, స్నూకర్ ఆడుతున్నారు. గేమింగ్ చిప్స్‌తో లావాదేవీలు జరుగుతుండగా ఆ వివరాలను 40 గేమింగ్ క్రెడిట్ పుస్తకాల్లో నమోదు చేస్తున్నారు. నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల లావాదేవీలు వాటిలో నమోదైనట్లు చోన్బూరీ పోలీసులు గుర్తించారు.

హైదరాబాద్‌లో స్ట్రీమ్ అయ్యేలా..: అక్రమంగా నడుస్తున్న ఈ పేకాట శిబిరంపై అక్కడి పోలీసులకు అదే
మిగతా 3వ పేజీలో ▶

మేమొస్తే రూ. 2 వేలిస్తాం

- పారిశుధ్య సిబ్బందికి ఉద్యోగ భద్రత కూడా కల్పిస్తాం: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్
- ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా నిర్వహించడం చేతగాని ప్రభుత్వం అవసరమా అని ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే శానిటేషన్ సిబ్బంది వేతనం రూ.2 వేలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రతతో ఠంఛన్‌గా జీతాలు, పర్వదినాల్లో బోనస్ చెల్లిస్తామని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? అని, రూ.వెయ్యి జీతం పెంపుతో వాళ్లకు ఒరిగేదేముందని, వారికి ఉద్యోగ భద్రత ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. కరోనా కాలంలో ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితమైతే... పారిశుధ్య కార్మికులు మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారని, తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా



మిగతా 2వ పేజీలో ▶

● మహారాష్ట్ర

పవార్ అస్త్రసన్యాసం

ఎన్సీపీ చీఫ్‌గా తప్పుకుంటున్నట్టు ప్రకటన

పార్టీలో కలకలం.. వద్దంటూ ఆందోళనలు ● రెండ్రోజుల్లో పునరాలోచన: అజిత్



"1960లో మొదలైన నా రాజకీయ జీవితం 63 ఏళ్లుగా కొనసాగుతూ వస్తోంది. ఇక తప్పుకోవాల్సిన సమయం వచ్చింది. యువత, విద్యార్థులు, దళితులు, గిరిజనులు తదితరులకు సేవ చేయాలనుకుంటున్నా. రాజ్యసభ సభ్యునిగా నాకు మిగిలిన మూడేళ్ల పదవీకాలంలో మహారాష్ట్రకు, దేశానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెడతా. పార్టీలో ఇక ఎలాంటి పదవీ స్వీకరించబోను.
- శరద్ పవార్

6లో

ఇదంజగత్




నిమ్స్ నూతన భవన నమూనా

నిమ్స్‌లో 2 వేల పడకల భవనం

- త్వరలో సీఎం చేతుల మీదుగా భూమిపూజ.. అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- నెలాఖరులోగా గాంధీ సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌ను పూర్తిచేయాలి
- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: నిమ్స్ ఆసుపత్రి విస్తరణలో భాగంగా నిర్మించ తలపెట్టిన 2,000 పడకల నూతన భవనానికి త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. దీనికోసం సత్వరమే ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న జనాభా అవసరాల నేపథ్యంలో హైదరాబాద్ నలువైపులా ఒక్కోటి వెయ్యి పడకలు కలిగి ఉండే టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణంతోపాటు, నిమ్స్ విస్తరణకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. మొత్తం మూడు బ్లాకుల్లో
మిగతా 3వ పేజీలో ▶

48 ఎకరాల భూములపై కన్నేసి.. 24 ఎకరాలు మింగేసి..

ఇనాం.. భోజనం!

వక్ఫ్ భూములపై వాలుతున్న 'గద్దలు'

నారాయణపేట జిల్లాలో వెలుగు చూసిన భూబాగోతం

- అక్రమార్కులకు ఓ అధికారి, ప్రజాప్రతినిధి అండ
- కోర్టు కేసులున్నా పట్టాదారు పాసుబుక్కులు మంజూరు
- ఎమ్మార్వోకు సంబంధం లేకుండానే తతంగం!
- భూముల రిజిస్ట్రేషన్ వెనుక రూ.5 కోట్ల డీల్!
- ముందస్తు ఒప్పందాలతో భూములు చవగ్గా హాంఫట్


అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ముక్తిపాడ్ పరిధిలోని ఇనాం భూమి ఇదే

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: భూ సమస్యలకు సంబంధించి ఎలాంటి అవకతవకలు, జాప్యానికి తావు లేకుండా.. పారదర్శకంగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. అయితే అధికారుల అండతో దీనికీ తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు.. వివాదాల్లో ఉన్న వక్ఫ్ భూముల్ని మింగేస్తున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముక్తిపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకున్న భూ బాగోతం ఇందుకు ఓ ఉదాహరణగా నిలుస్తోంది. కోర్టులో కేసులుండి వివాదాస్పదంగా మారిన వక్ఫ్ బోర్డుకు చెందిన ఇనాం (కిద్మత్) భూములపై ఎప్పటినుంచో నజర్ వేసిన కొందరు 'పెద్దలు' చాకచక్యంగా వాటిని కొట్టేశారు. టెనెంట్ దారులు (సాగుదారులు), ఇనాందారుల మధ్య రాజీ కుదర్చడంతో పాటు నకిలీ దస్తావేజులు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించి కోట్లాది రూపాయలు దండుకున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ బోర్డు పరిధిలో కిద్మత్ ఇనాం కింద ఇచ్చిన భూముల క్రయవిక్రయాలకు హక్కులు ఉండవు. ఎవరైతే ఇనాం పొందుతారో వారితో పాటు తర్వాతి తరాలు సాగు చేసుకునేందుకు మాత్రమే హక్కులు ఉంటాయి. కానీ.. కొంతకాలం క్రితం బదిలీపై వెళ్లిన ఓ జిల్లా స్థాయి అధికారి, ఓ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కుమ్మక్కై చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్
మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

మరో 4 రోజులు వర్షాలే

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆగ్నేయ మధ్యప్రదేశ్ నుంచి మరట్వాడ, ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ద్రోణి కొనసాగుతోంది. దీనికితోడు దక్షిణ ఛత్తీస్‌ఘడ్ పరిసర ప్రాంతాల్లో ఒక ఆవర్తనము కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. దీంతో రానున్న మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే రాగల నాలుగు రోజులు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల (40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో)తో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, గత 24 గంటల్లో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో అత్యధికంగా 8 సెంటీమీటర్లు, పెబ్బేరులో 7 సెంటీమీటర్లు, వీపనగండ్లలో 6 సెంటీమీటర్లు, కామారెడ్డి, నవీపేట్, గాంధారి, బోధన్‌లలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

కొయ్యని పంట నేలపాలు.. కోసిన పంట నీళ్లపాలు

వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: కొయ్యని పంట నేలపాలు.. కోసిన పంట నీళ్ల పాలైందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, మొక్కజొన్న పంటలు, మామిడి తోటలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత రెండు నెలల్లో పడిన వానలకు దాదాపు 9.60 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినా రైతులకు ఇంకా పరిహారం అందలేదన్నారు. అప్పు తీర్చడానికి కూడా అరకొర రాబడి సరిపోదని రైతులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. మార్చిలో 2.34 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, అప్పుడు సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని, సాయంత్రం ఇంటికి పోయేలోపు డబ్బులు విడుదల అవుతాయని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరి, కేసీఆర్ ఇంకా ఇంటికి పోలేదా అని ఎద్దేవా చేశారు. ఈ తొమ్మిదేళ్లలో రూ.14 వేల కోట్లు నష్టపోతే.. కేసీఆర్ ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి రైతులకు ఎకరాకు కనీసం రూ.20 వేల పరిహారం చెల్లించాలని, వెంటనే అన్ని ఐకేపీ సెంటర్లు తెరిచి వడ్లు కొనేలా చూడాలన్నారు. రైతులు నష్టపోయిన పంటను ప్రగతిభవన్‌కు ట్రక్కులో పంపేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నించగా పార్టీ కార్యాలయం గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పీఏసీ సభ్యులు పిట్ట రామిరెడ్డి, నీలం రమేశ్, ఆలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలి

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ డిమాండ్

చర్ల: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేల చొప్పున పరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు లేఖను విడుదల చేశారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని, వారు తీవ్రంగా ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నష్టాన్ని అంచనా వేయడం, రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

వందకు వంద శాతం నష్టం!

- గత వందేళ్లలో ఎన్నడూ లేనివిధంగా అకాల వర్షాలు, వడగండ్లు
- బాయిల్డ్ రైస్ మిల్లులకు తడిసిన ధాన్యం
- ఇప్పటివరకు రూ.1,706 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
- 'సాక్షి'తో మంత్రి గంగుల కమలాకర్



మంత్రి కమలాకర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు రోహిత్‌రావు, పద్మాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి ప్రకోపానికి గురైన అన్నదాతకు ఈసారి భారీ నష్టం జరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో గతంలో కూడా అకాల వర్షాలు పడ్డాయని, అలాంటప్పుడు 20 శాతం మేర నష్టం జరిగేదని.. కానీ వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కురిసిన అకాల వర్షాలు, వడగండ్లకు కొన్నిచోట్ల వందకు వంద శాతం పంట దెబ్బతిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందని 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.

వేగంగా సేకరణ ప్రక్రియ

'పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు పంట నష్టాన్ని నమోదు చేసుకుంటున్నారు. ఇక ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఆలస్యానికి తావు లేకుండా, వేగవంతంగా సేకరించే ప్రక్రియ జరుగుతుంది..' అని గంగుల తెలిపారు.

తడిసిన ధాన్యం బాయిల్డ్ రైస్ కోసం..

'తడిసిన ధాన్యంలో తేమ శాతం 20 వరకు వస్తే దానిని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించాం. నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి, జగిత్యాల జిల్లాల్లో తడిసిన ధాన్యాన్ని బాయిలీడ్ రైస్‌గా మార్చడానికి ఆదేశాలు జారీ చేసి, ఆయా మిల్లులకు కేటాయింపులు జరిపాం. ఇప్పటివరకు మొత్తం 1.28 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యానికి అత్యవసర బాయిల్డ్ ఉత్తర్వులు ఇచ్చాం. పరిస్థితికి అనుగుణంగా పరిమాణం పెంచుతాం. రాష్ట్రంలో ఎక్కడ తడిసిన ధాన్యం ఉన్నా బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాల్సిందిగా జిల్లాల కలెక్టర్లను ఆదేశించాం..' అని చెప్పారు.

కొనుగోలు కేంద్రంలో ఉద్రిక్తత

కరీంనగర్ మండలం దుర్శేడ్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల నడుమ తోపులాట చోటుచేసుకోగా పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు మంత్రి గంగుల మంగళవారం దుర్శేడ్ కొనుగోలు కేంద్రానికి వచ్చారు. అయితే తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మెన్నేని రోహిత్‌రావు, పద్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రిని కలిశారు. కేంద్రాల్లో టార్పాలిన్లు లేవని, ఒక్కో పరదాకు రైతులు రోజుకు రూ.30 కిరాయి చెల్లిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రికి, కాంగ్రెస్ నేతలకు మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. ఇరుపక్షాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ తోపులాటకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది.

తడిసినా కొంటాం



సమీక్ష సమావేశంలో మంత్రులు, అధికారులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం మాట్లాడారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి..

మరో మూడు, నాలుగురోజులు వానలు కొనసాగనున్నాయని, అప్పటిదాకా వరి కోతలను వాయిదా వేసుకోవాలని కేసీఆర్ రైతులకు సూచించారు. పంట కోతలకు వెళ్లకుండా సంయమనం పాటించాలని, ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలని కోరారు. 'రైతుల కోసం చిత్తశుద్ధి, దృఢ సంకల్పంతో కార్యాచరణ అమలు చేస్తున్నది ఈ దేశంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమే. ఊహించని అకాల వర్షాలు ఎడతెరిపి లేకుండా కొనసాగుతుండడం బాధాకరం. ప్రకృతి వైపరీత్యానికి ఎవరం ఏమీ చేయలేం. కానీ మనకేం సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండలేదు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలను అందిస్తూ ఇప్పటికే ఆదుకుంటోంది. రాష్ట్ర ఖజానాకు ఎంత భారమైనా వెనుకంజ వేయకుండా రైతన్నలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది..' అని సీఎం స్పష్టం చేశారు.

ఇక మార్చిలోనే వరి కోతలు..

గతానికి భిన్నంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలను గుణపాఠంగా తీసుకుని భవిష్యత్తులో యాసంగి వరి కోతలు మార్చిలోపే జరిపేందుకు ఎలాంటి విధానాలను అవలంబించాలో శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని వ్యవసాయ శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దిశగా రాష్ట్ర రైతాంగాన్ని చైతన్యం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఏటా మార్చిలోగా వరి కోతలు పూర్తయ్యేలా ముందస్తుగానే పంట నాటుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. మార్చి తర్వాత అకాల వర్షాలకు అవకాశాలున్నందున ఆ లోపే కోతలు పూర్తి చేసుకోవడం మంచిదన్నారు. ఏప్రిల్, మే వచ్చేదాకా పంట నూర్పకుంటే ఎండలు పెరిగి ధాన్యంలో నూక శాతం కూడా పెరిగిపోతుందని పేర్కొన్నారు. ఎరువుల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో తలెత్తే మార్పులపై ఎప్పటికప్పుడు రైతాంగానికి అర్థమయ్యే రీతిలో కరపత్రా లు, పోస్టర్లు, వాణిజ్య ప్రకటనలు తదితర ప్రచా ర మార్గాల ద్వారా అవగాహన, చైతన్యం కల్పించాల ని సూచించారు. ఏఈఓలు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు తగు సూ చనలందించాలని ఆదేశించారు. రైతు వేదికల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఈ దిశగా పనితీరును పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సీఎం ఆదేశించారు.

అన్నదాత ఆందోళన



నిజామాబాద్ జిల్లా గుడారం గ్రామంలో వర్షంలో మునిగిపోయి మొలకలెత్తిన వడ్లు



నిజామాబాద్ జిల్లా అడవి మామిడి పల్లి వద్ద తడిసిన ధాన్యంతో రాస్తారోకో చేస్తున్న రైతులు

▶ మొదటి పేజీ తరువాయి

నష్టానికి గురి చేస్తున్నాయి.

రాస్తారోకోలు..: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా అడవి మామిడిపల్లి రైతులు తడిసిన ధాన్యం బస్తాలతో 63 నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం గంటకు పైగా రాస్తారోకో చేశారు. తహసీల్దార్ శంకర్ కొనుగోళ్లకు హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించుకున్నారు. మరోవైపు.. ధాన్యంలో నాణ్యత లేదని 40 కిలోల బస్తాకు 4 కిలోల తరుగును ఇవ్వాలని డిమాండ్ చేసిన రైస్‌మిల్లు యజమాని, లారీ నుంచి ధాన్యం దించుకోక పోవడంతో.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో రైతులు హైవే 765 (డి)పై గంటన్నరపాటు ఆందోళనకు దిగారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు ధాన్యం మిల్లులోనే నిలిచిపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ జోక్యంతో నిర్వాహకులు లారీని ఖాళీ చేయించారు. కాగా, నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా 4,158 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరి, నువ్వులు, మామిడి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కామారెడ్డి జిల్లాలో మరో 3,403 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మళ్లీ తడిసిపోయింది. సూర్యాపేట జిల్లా శూన్యపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారంటూ ఆందోళనకు దిగారు.

రైతు ఆత్మహత్యాయత్నం



ధాన్యం తూకం వేయడం లేదని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామానికి చెందిన మానుపాటి సమ్మయ్య ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా తోటి రైతులు అడ్డుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. సమ్మయ్య 15 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చాడు. నిర్వాహకులు టోకెన్ కూడా ఇచ్చారు. కానీ సోమవారం వరకు తూకం వేయలేదు. మంగళవారం తన టోకెన్‌కు వెనుక ఉన్నవారికి గన్నీ సంచులు ఇచ్చి తూకం వేస్తుండటంతో సమ్మయ్య నిర్వాహకులను ప్రశ్నించాడు. వారు పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి యత్నించాడు.

మూడు సిలిండర్లు మాకెందుకివ్వరు?

▶ మొదటి పేజీ తరువాయి

సిలిండర్లు ఉచితంగా ఎందుకు ఇవ్వరని, మిగతా రాష్ట్రాల్లోనూ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. పాలపైనా జీఎస్టీ వేసిన కేంద్ర ప్రభుత్వం హామీలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, సిరిసిల్ల, గంభీరావుపేట మండలాల్లో వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటలను, తడిసిన ధాన్యాన్ని మంత్రి కేటీఆర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

90 శాతం వరకు వరి నష్టం

రాష్ట్రంలో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఎక్కువగా యాసంగి సీజన్‌లో వరిని సాగు చేశారని, అయితే అనూహ్యంగా వచ్చిన వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిన్నాయని కేటీఆర్ చెప్పారు. వరి పంట 30 శాతం నుంచి 90 శాతం మేరకు నష్టం జరిగిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 19 వేల ఎకరాల్లో 17 వేల మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఇంకా క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ జరుగుతోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ఐదు జిల్లాల్లో పర్యటించారని, ఎకరానికి రూ.10 వేల చొప్పు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తుచేశారు. ఇలా వుండగా.. రైతాంగానికి రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంటు, నీరు ఇచ్చే తెలంగాణ వ్యవసాయ విధానం కావాలని దేశమంతా కోరుకుంటోందని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 7.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.



ముస్తాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేటీఆర్


మహిళల భద్రతకు 'అభయ' యాప్

మహిళల భద్రతకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు రూపొందించిన 'అభయ'యాప్‌ను మంత్రి కేటీఆర్ సిరిసిల్ల మినీ స్టేడియంలో ఆవిష్కరించారు. జిల్లా పోలీస్ క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి.. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షణలో రాష్ట్రంలోనే తొలిసారి రూపొందించిన 'అభయ'యాప్‌ను ఆవిష్కరించారు. ఆటోల్లో ప్రయాణిస్తున్నప్పుడు మహిళల రక్షణ కోసం ఈ క్యూఆర్ కోడ్ పనిచేస్తుందని, ట్రాక్ మై లొకేషన్ పోలీసులకు షేర్ అవుతుందన్నారు. ఈ యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా సచివాయంలోకి ఎంపీ రేవంత్‌రెడ్డిని ఎందుకు అనుమతించడం లేదని విలేకరులు ప్రశ్నించగా.. 'అది సచివులు ఉండే చోటు, సచివులకే ప్రవేశం ఉంటుంది..'అంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

వరి వేయకుంటే రూ.7 వేలు

'సాక్షి'తో హరియాణ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్

- ఎకరాకు మేమిచ్చే ప్రోత్సాహకం.. అధికంగా నీరు అవసరమయ్యే ఇతర పంటలకూ...
- పడిపోతున్న భూగర్భనీటి మట్టాలు తగ్గించేందుకు హరియాణ సర్కారు నిర్ణయం
- ఉచితాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తామని వెల్లడి
- తెలంగాణలో బీజేపీ 'ఖట్టర్ మోడల్'కు ప్రాధాన్యతనివ్వొచ్చని అభిప్రాయం



చండీగఢ్ నుంచి 'సాక్షి'ప్రత్యేక ప్రతినిధి: హరియాణ రాష్ట్రంలో వరి పంట వేయకపోతే ఎకరాకు (ఇన్ని ఎకరాలు అనే పరిమితి లేకుండా) రూ.7 వేల చొప్పున ప్రోత్సాహకం అందజేయడం ద్వారా 1.74 లక్షల ఎకరాల్లో వరికి బదులు ఇతర పంటలకు మళ్లించగలిగామని ఆ రాష్ట్ర సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. వరితో పాటు నీరు అధికంగా అవసరమయ్యే ఇతర ధాన్యం పంటలు వేయకుండా ఏ పంట వేసినా లేదా పడావుగా (ఏమీ వేయకుండా) వదిలేసినా ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు. 2020లో చేపట్టిన 'మేరా పానీ మేరా విరాసత్'పథకంలో భాగంగా భావితరాలకు నీటిని అందించాలనే ఉద్దేశంతో దీనిని అమలు చేస్తున్నట్టు తెలియజేశారు. హరియాణలో గుడ్‌గవర్నెన్స్ అమలు చేస్తున్న విషయం వివరించేందుకు మీడియా ప్రతినిధులను అక్కడి ప్రభుత్వం ఆహ్వానించిన నేపథ్యంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

హరియాణ పాటు చుట్టుపక్కల రాష్ట్రాలన్నింటికీ యమున నదే ఆధారం కావడంతో వరి పంటకు నీరు భారీగా అవసరమై భూగర్భనీటి మట్టాలు పడిపోతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు వివిధ పథకాల కింద కల్పించే ఉచితాలను, ఇది ఫ్రీ, అది ఫ్రీ అంటూ ఎన్నికల్లో ఇచ్చే హామీలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తామని, స్వాభిమాన వ్యక్తులెవరూ వీటిని కోరుకోరని చెప్పారు. 2014 నుంచి హరియాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న మనోహర్‌లాల్‌తో సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: 'గుజరాత్ మోడల్'అంటూ కొందరు బీజేపీ నేతలు ప్రచారం చేశారు కదా ? తెలంగాణలో 'హరియాణ మోడల్'అమలు చేయమని చెబుతారా?

సీఎం: ఈ మోడల్ ఆ మోడల్ అనే ప్రచారం ఎక్కువగా మీడియా సృష్టే అని చెప్పాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అక్కడి అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రజలకు ఏమి చేస్తారో ఎన్నికల హామీ ఇవ్వడంతో పాటు 'హరియాణ మోడల్'అమలు అంశానికి కూడా ప్రాధాన్యత ఇవ్వొచ్చు. ఒక రాష్ట్రంలో మంచి పథకాలు, మెరుగైన విధానాలుంటే వాటిని మరోచోట అమలు చేయొచ్చని ప్రధాని మోదీ కూడా సూచించారు.

సాక్షి: మీ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలు ఏవీ?

సీఎం: హరియాణ ఒక్క రాష్ట్రంలోనే 'మేరీ ఫసల్ మేరీ బ్యోరా'(ఎమ్మెఫ్‌ఎంబీ)కింద రైతులు రిజిష్టర్ చేసుకుంటే ఎంఎస్‌పీ ధర చెల్లింపుతో పాటు ఇతర రూపాల్లో ప్రయోజనాలు అందిస్తున్నాం. దీనిని ఈ–ఖరీద్ పోర్టల్‌కు లింక్ చేసి ఎంఎస్‌పీ ధరను డైరెక్ట్‌గా రైతు అకౌంట్లో వేస్తున్నాం. ఇప్పటిదాకా రూ.45వేల కోట్లు వారికి బదలీచేశాం. ముఖ్యమంత్రి అంత్యోదయ పరివార్ ఉత్థాన్ యోజనలో భాగంగా పేదవర్గాలను గుర్తించి వారికి బీపీఎల్‌కార్డులు, రేషన్ అందజేయడంతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పిస్తున్నాం.

అన్నిటికీ.. డయల్ 112

హరియాణ పంచకుల నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: అన్నిరకాల అత్యవసర సేవలకు ఒకే నంబర్.. అదే 112. ఏదైనా నేరం లేదా హింసాత్మక ఘటన, రోడ్డు ప్రమాదం, అగ్ని ప్రమాదం, అమ్మాయిలకు పోకిరీల వేధింపులు, శారీరక వైకల్యం లేదా ఇతర సమస్యలున్న వారు, ప్రమాదాలు ఇతరత్రా వైద్యపరంగా అత్యవసర సేవలకు అంబులెన్స్.. ఇలా అన్నింటికీ ఒక్కటే ఎమర్జెన్సీ నంబర్. 'డయల్ 112–జస్ట్ ఏ కాల్ అవే...వీ ఆర్ రెడీ..' పేరిట హరియాణ రాష్ట్రంలో దీనిని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు రక్షణ, అన్నివర్గాల వారికి భద్రత కల్పించేలా, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమీకృత పద్ధతుల్లో ఎమర్జెన్సీ సర్వీసులు అందించేందుకు వీలుగా ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని పబ్లిక్ పాలసీ రీసెర్చి సెంటర్ (పీపీఆర్‌సీ) ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టుల బృందం మూడురోజులపాటు హరియాణలోని సోనిపత్, కర్నాల్, పంచకుల, చండీగఢ్‌లలో క్షేత్రస్థాయిలో అమలవుతున్న వివిధ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్‌ను పరిశీలించింది, పంచకులలోని 'స్టేట్ ఎమర్జెన్సీ రెస్పాన్ సెంటర్ 'లో నిర్వహిస్తున్న కార్యకలాపాలను తెలుసుకుంది.

మేమొస్తే రూ. 2 వేలిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న శానిటేషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు తెలంగాణకు అధికంగా రావడానికి ప్రధాన కారణం పారిశుధ్య కార్మికులేనని గుర్తు చేశారు. ఈ కార్మికుల్లో అత్యధిక శాతం దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలవారేనని, అత్యంత పేదరికంలో ఉన్న వీరికి రాష్ట్ర ప్రభుత్వం వేతనం రూ.వెయ్యి పెంచడం ఏమాత్రం సరికాదని అభిప్రాయపడ్డారు. 'పారిశుధ్య కార్మికులెవరూ బాధపడొద్దు. 6 నెలలు ఓపిక పట్టండి. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం. అదనంగా మరో 2 వేల రూపాయల వేతనం పెంచుతాం. దసరా, ఉగాది పర్వదినాల సమయంలో ప్రత్యేకంగా బోనస్ అందిస్తాం. జనాభాకు అనుగుణంగా కొత్తగా పారిశుధ్య కార్మికులను నియమిస్తాం'అని సంజయ్ హామీనిచ్చారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణా అంతేనా?

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం తెలుగు మీడియం విద్యార్థులకు ఎకనామిక్స్ ప్రశ్నపత్రాన్ని ఇంగ్లిష్ మీడియంలో అందజేయడం విడ్డూరమని బండి సంజయ్ విమర్శించారు. ఓపెన్ సొసైటీ ద్వారా పరీక్షలు నిర్వహించే విద్యార్థులంతా కూలీనాలీ చేసుకునే వారేననీ వారందరికీ తెలుగులో ఇవ్వాల్సిన ప్రశ్నపత్రాలను ఇంగ్లిష్‌లో ఇవ్వడమే కాకుండా చేసిన తప్పును సరిదిద్దుకోకుండా పరీక్షా సమయం ముగిసే వరకు వారిని కూర్చోబెట్టడం అన్యాయమని నిందించారు. ఇప్పటికే టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీతో 30 లక్షల మంది నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు కూడా నిర్వహించడం చేతగాకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

గెలిపిస్తే.. రూ.500కే సిలిండర్ ఇస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రగతిభవన్, సెక్రటేరియట్ నిర్మాణాలు తప్ప సీఎం కేసీఆర్ ఏ ఒక్క అభివృద్ధి పనీ చేయలేదన్నారు. ఎంఏ, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులు ఉద్యోగాలు లేక ఇంటి వద్దనే కూలీపనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిధులన్నీ ఎటు పోతున్నాయో, లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ఎవరికి పంచుతున్నారో చెప్పాలని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక, అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి పరిస్థితి రానివ్వమని హామీ ఇచ్చారు. ప్రతి ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తామని, నిరుద్యోగ భృతి రూ.3,000 చెల్లిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, వి.హనుమంతరావు పాల్గొన్నారు.



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

పాదయాత్ర చేస్తునే జూమ్ మీటింగ్‌లో భట్టి

ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే నిరుద్యోగ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతున్న నేపథ్యంలో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాల్గొన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర చేస్తూ.. ప్రజల సమస్యలు వింటూనే.. మరోవైపు పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఇతర పార్టీ నేతలతో జూమ్ మీటింగ్‌లో చర్చించారు.

పది రోజుల్లో మేడిగడ్డ ముంపు రైతులకు పరిహారం

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్రలను కలుపుతూ గోదావరిపై తెలంగాణ ప్రభుత్వం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డలో లక్ష్మీబ్యారేజీ నిర్మించిన విషయం తెలిసిందే. బ్యారేజీ నిర్మాణంతో బ్యాక్‌వాటర్ వల్ల యేటా తమ భూములు ముంపునకు గురవుతున్నాయని మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా పరిధిలోని 12 గ్రామాల రైతులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సిరొంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో అక్కడి ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను సిరొంచ ప్రాంత రైతులు మంగళవారం కలిశారు. నాగ్‌పూర్‌లో అసెంబ్లీ సమావేశాల సమయంలో తమకు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు 128 హెక్టార్ల భూమి నోటిఫై చేసినా, ఇటు మహారాష్ట్ర అటు తెలంగాణ ప్రభుత్వాలు ఇప్పటికీ అందజేయలేదని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఫడ్నవీస్ పది రోజుల్లో పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పరిహారం అందజేసే వరకు చూడకుండా మహారాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తామని చెప్పినట్లు రైతులు వెల్లడించారు.



మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను గడ్చిరోలిలో కలిసిన మేడిగడ్డ ముంపు రైతులు

గీత కార్మికులకు 5 లక్షల బీమా

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రమాదవశాత్తూ గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతుండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నా, బాధితులకు చేరడంలో ఆలస్యమవుతోందని, రైతుబీమా తరహాలోనే కల్లుగీతను వృత్తిగా కొనసాగిస్తున్న గౌడన్నల కుటుంబాలకు వారం రోజుల్లోనే బీమా నగదు అందేలా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హర్షం..

గీత వృత్తిదారులకు రూ. 5లక్షలతో 'గీత కార్మికుల బీమా'నిర్ణయంపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియాను రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు నెక్లెస్‌రోడ్‌లో నీరా కేఫ్‌ను ప్రారంభించనున్నామని, గీత వృత్తిదారులు మాత్రమే నీరా ఉత్పత్తి, అమ్మకాలు జరిపేలా రాష్ట్రంలో నీరా పాలసీని రూపొందించామని శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు.

క్లుప్తంగా...

ఆ మరుగుజ్జును నమ్మొద్దు

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



తాండూరు టౌన్: ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిపై ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ 'మహేందర్‌రెడ్డి ఓ మరుగుజ్జు.. మిమ్మల్ని మోసగించేందుకు మళ్లీ వస్తున్నాడు. నమ్మొద్దు'.. అని కోరారు. తాండూరు తనదే అంటున్న మహేందర్‌రెడ్డి.. వాస్తవానికి నాన్ లోకల్ అని స్పష్టం చేశారు. పాతికేళ్లపాటు తాండూరును పాలించిన ఓ మరుగుజ్జు మాజీ మంత్రి ఏం చేశాడని మళ్లీ మీ ముందుకు వస్తున్నాడని నిలదీశారు. 'ఇక్కడే పుట్టా.. ఇక్కడే చస్తా..చచ్చాక తాండూరులోనే బొంద పెట్టండి.. అని రోహిత్‌రెడ్డి భావోద్వేగంతో అన్నారు.

బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తాం అనడం కాంగ్రెస్ కుట్ర

అఖిల భారత బజరంగ్‌దళ్ కన్వీనర్ నీరజ్ దునేరియా

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని చెప్పడం కాంగ్రెస్ కుట్రని అఖిల భారత బజరంగ్‌దళ్ కన్వీనర్ నీరజ్ దునేరియా మండిపడ్డారు. కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)లాంటి ఉగ్రవాద నేపథ్యం ఉన్న నిషేధిత సంస్థలతో భారతమాత సేవలో తరిస్తున్న బజరంగ్‌దళ్‌ను పోల్చడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ముగ్గురు ఐపీఎస్‌లకు ఐజీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: ముగ్గురు డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి లభించింది. 2005 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు అవినాశ్ మహంతి, పి.విశ్వప్రసాద్, ఎం.రమేశ్‌లకు డీఐజీ నుంచి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ముగ్గురు అధికారులను ప్రస్తుతం వారు పనిచేస్తున్న ఉద్యోగాల్లోనే కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవినాశ్ మహంతి సైబరాబాద్ అడిషనల్ సీపీ (అడ్మిన్), విశ్వప్రసాద్ హైదరాబాద్ నగర పోలీస్ విభాగంలో అడిషనల్ సీపీ ఎస్‌బీ, రమేశ్ డీజీపీ కార్యాలయంలో పీ అండ్ ఎల్ డీఐజీగా పనిచేస్తున్నారు.

పీఅండ్ఎల్ ఐజీగా రమేశ్ బాధ్యతల స్వీకరణ



డీజీపీ కార్యాలయంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ ఐజీగా రమేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పొందిన రమేశ్‌ను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు.

రాష్ట్ర విభజన కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజనపై దాఖలైన వివిధ పిటిషన్లపై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. తెలంగాణ వికాస కేంద్రం, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం మంగళవారం జాబితాలో చేర్చింది. మంగళవారం ఇతర పిటిషన్ల విచారణ కారణంగా రాష్ట్ర విభజన కేసు బెంచ్ ముందుకు రాకుండానే కోర్టు సమయం ముగిసింది. బెంచ్ మీదకు రాని కేసులను ధర్మాసనం పరిశీలిస్తూ.. 'ఇది రాష్ట్ర విభజన కేసు కదా.. చాలా కాలం క్రితం జరిగిన పరిణామాలను మార్చాలని మీరు భావిస్తున్నారు (నవ్వుతూ).. వేసవి సెలవుల అనంతరం విచారణ చేపడతాం. ఆగస్టు 22కు వాయిదా వేస్తున్నాం'.. అని పేర్కొన్నారు.

కేసీఆర్‌ది సైంధవుడి పాత్ర: బూర నర్సయ్య

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులకు అడ్డు పడుతూ కేసీఆర్ సైంధవుడి పాత్ర పోషిస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. తెలంగాణ దేశంలో భాగమైనా.. కేంద్ర పథకాలేవీ రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. నర్సయ్య మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన గిరివికాస్ నిధులను 30% కూడా గిరిజన ప్రాంతాల్లో ఖర్చు పెట్టలేదని తెలిపారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరయితే పెట్టారు కానీ.. ప్రతిపక్షాలు లోపలికి రాకుండా అడ్డుపడుతున్నారని, ఆ మహనీయుడి పేరు వాడుకోవడం ఎందుకని ఎద్దేవా చేశారు. తెలంగాణ కేసీఆర్ జాగీర్ అయినట్టు వ్యవహరిస్తున్నారని, ఆ భ్రమల్లోంచి బీఆర్ఎస్ నేతలు బయటకు రావాలని సూచించారు. జీఎస్టీపై మహారాష్ట్రలో రూ. 33,196 కోట్లు, గుజరాత్‌లో రూ. 11 ,700, హరియాణలో రూ. 10,035 కోట్లు ఆదాయం వస్తుంటే ధనిక రాష్ట్రం తెలంగాణలో రూ.5,600 కోట్లు మాత్రమే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందేదన్నారు.

మార్పు దిశగా..!

▶ మొదటి పేజీ తరువాయి


ప్రతికూలంగా పరిణమించే సంకేతాలున్నాయి. సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనతో పోల్చి చూడటం కూడా బీజేపీకి కొంత ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. కాంగ్రెస్ కూడా పాత నేతలకే టికెట్లు ఇచ్చి ప్రభుత్వ వ్యతిరేకత, స్థానికంగా బీజేపీ అభ్యర్థుల ప్రతికూలతలను అనుకూలంగా మలచుకునే వ్యూహంతో పనిచేస్తోంది. కాంగ్రెస్‌లో సిద్దరామయ్య, డీకే శివకుమార్ వర్గాల కుమ్ములాటలతో సుస్థిర ప్రభుత్వం సాధ్యం కాదనే అనుమానాలు ఓటర్లలో ఉన్నాయి. బీజేపీ ప్రతికూల ఓటును జేడీఎస్ చీల్చుకునే అవకాశం ఉండటం కూడా కాంగ్రెస్‌కు మైనస్‌గా మారే సూచనలున్నాయి. కరోనా సమయంలో సామాజిక సేవలో నిమగ్నమైన జేడీఎస్ అభ్యర్థుల పట్ల కొన్ని చోట్ల సానుకూలత కనిపిస్తోంది. జేడీఎస్ సొంత బలంతో అధికారంలోకి వస్తుందనే నమ్మకం లేని ఓటర్లు స్థానికంగా బలమైన అభ్యర్థి వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

మఠాధిపతుల ప్రభావం తగ్గుముఖం

బీదర్, కలబురిగి జిల్లాల్లోని 15 నియోజకవర్గాల్లో అలంద్, గుల్బర్గా ఉత్తర నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని చోట్లా లింగాయత్ సామాజిక వర్గ ఓటర్లే ఎక్కువ. గతంలో మాదిరిగా ఈ సామాజికవర్గంలో బీజేపీ వైపు ఏకపక్షంగా మొగ్గు కనిపించడం లేదు.యడియూరప్పను పదవి నుంచి తప్పించడంపై లింగాయత్ సామాజిక వర్గంలో కొంతమేర అసంతృప్తి ఉంది. గతంలో ఓటర్లను ప్రభావితం చేసిన పీఠాధిపతులు, మఠాధిపతులు ప్రస్తుత ఎన్నికల్లో ఏ పార్టీకీ బహిరంగ మద్దతు ప్రకటించకుండా గుంభనంగా ఉన్నారు. గుల్బర్గా ఉత్తర, దక్షిణ, రూరల్, బీదర్ దక్షిణ, ఉత్తర, హుమ్నాబాద్, అలంద్‌లో ముస్లిం ఓటర్లు ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉండటంతో కాంగ్రెస్, జేడీఎస్‌లలో మైనారిటీ ఓటు బ్యాంకుపై ధీమా కనిపిస్తోంది.

నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి

కర్ణాటకలోనే వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన కలబురిగి, బీదర్ జిల్లాల నుంచి విద్యార్థులు బెంగళూరు, పుణే, హైదరాబాద్ వంటి నగరాలకు వలస పోతున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం, విద్యాసంస్థలు, సిమెంట్ కర్మాగారాల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉండటంపై అసంతృప్తి కనిపిస్తోంది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కొంత మెరుగ్గా ఉన్నా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, డంప్ యార్డులు ప్రధాన సమస్యగా ఉన్నాయి. ఏడో వేతన సవరణ జరగకపోవడంతోపాటు ప్రభుత్వ పనితీరుపై ఉద్యోగ వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. ఎస్సీ రిజర్వేషన్ కేటగిరీలో వర్గీకరణ, ముస్లింల రిజర్వేషన్ల తొలగింపు వంటి అంశాలు కూడా ఎన్నికల ప్రచార ఎజెండాగా ఉన్నాయి. బీదర్ దక్షిణ, బీదర్ ఉత్తర, ఔరాద్, చించోలి, సేడమ్ నియోజకవర్గాలపై తెలంగాణ ప్రభావం కొంతమేర కనిపిస్తోంది. తెలంగాణ మోడల్‌ను అమలు చేస్తామంటూ జేడీఎస్ తెలంగాణ ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలతో సరిహద్దు నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తోంది.



నిమ్స్‌లో 2 వేల పడకల భవనం

▶ మొదటి పేజీ తరువాయి

ఓపీ, ఐపీ, ఎమర్జెన్సీ సేవలు అందించేలా నిర్మాణానికి అనుమతులు తీసుకోవాలన్నారు. మంగళవారం సచివాలయంలో వైద్య ఉన్నతాధికారులతో నిర్వహించిన తొలి సమీక్షలో హరీశ్‌రావు మాట్లాడారు. 8 అంతస్తుల్లో నిర్మించే నూతన భవనం అందుబాటులోకి వస్తే, పడకల సంఖ్య 3,500కు చేరుతుందన్నారు. అంతేగాక, సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ నిర్మాణం పూర్తయితే మరో 200 పడకలు అందుబాటులోకి వస్తాయని, దీంతో ఒక్క నిమ్స్‌లోనే మొత్తం 3,700 పడకలు ఉంటాయన్నారు. గాంధీ ఆసుపత్రిలో నిర్మిస్తున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని హరీశ్‌రావు ఆదేశించారు. ఇదే దేశంలో తొలి సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ అవుతుందని చెప్పారు.

సంతాన సాఫల్య కేంద్రం పనుల వేగం పెంచండి

గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటుచేస్తున్న సంతాన సాఫల్య, అవయవ మార్పిడి కేంద్రాల పనులు వేగవంతం చేయాలని హరీశ్‌రావు అధికారులను



ఆదేశించారు. నిమ్స్ ఆసుపత్రిలో ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేస్తున్నట్లుగా, గాంధీలోనూ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను నిర్దేశించారు. బ్రెయిన్‌డెడ్ డిక్లరేషన్లు జరిపి, అవసరమైన వారికి అవయవాలు అందించి పునర్జన్మ పొందేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్లు సరఫరా చేయకున్నా, రాష్ట్ర ప్రభుత్వం సమీకరించి పీహెచ్‌సీ, బస్తీ దవాఖానా, సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కోవిడ్ సహా అన్ని రకాల వ్యాక్సినేషన్‌లో తెలంగాణ మొదటిస్థానంలో ఉండేలా కృషి చేయాలని సంబంధిత విభాగానికి ఆదేశించారు.

ఆదర్శప్రాయంగా ఉండాలి: ఆసుపత్రికి అందరికంటే ముందుగా వచ్చి, అందరి తర్వాత వెళ్లే డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు ఆదర్శప్రాయులని హరీశ్ కొనియాడారు. ప్రతి రోజూ 2 గంటలపాటు ఆసుపత్రుల్లో రౌండ్లు వేస్తూ, అన్ని విభాగాలు సందర్శిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మంచి సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రంగంలో దేశంలోనే తెలంగాణను మొదటిస్థానంలో నిలిపేందుకు సీఎం కేసీఆర్ రూ.12 వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య శ్రీ సీఈవో విశాలాచ్చి, డీఎంఈ రమేష్ రెడ్డి, డీహెచ్ శ్రీనివాసరావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ గంగాధర్, నిమ్స్ ఇంచార్జి డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక సభకు టీపీసీసీ కసరత్తు

- 8న జరిగే నిరుద్యోగ నిరసనలో పాల్గొననున్న ప్రియాంకాగాంధీ
- జూమ్ సమావేశంలో చర్చించిన టీపీసీసీ నేతలు



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 8న సరూర్‌నగర్ స్టేడియంలో టీపీసీసీ నిర్వహించే నిరుద్యోగ నిరసన మార్చ్‌కు ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ వాద్రా వస్తున్న నేపథ్యంలో షెడ్యూల్‌పై నేతలు చర్చించారు. కర్ణాటక ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని తిరుగు ప్రయాణంలో ప్రియాంక 8వ తేదీ సాయంత్రం హైదరాబాద్ రానున్నారు. ఇప్పటికే మూడు జిల్లాకేంద్రాలలో నిరుద్యోగ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసి, ఊపు మీదున్న టీపీసీసీ నేతలు ఈ కార్యక్రమానికి భారీగా నిరుద్యోగులను సమీకరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం జూమ్‌లో టీపీసీసీ పీఏసీ సమావేశం జరిగింది. ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, వర్కింగ్ ప్రెసిడెంట్స్ మహేశ్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీధర్‌బాబు, రోహిత్ చౌదరి, సంపత్ కుమార్, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, బలరాం నాయక్ తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రియాంక పర్యటనకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. షెడ్యూల్ ప్రకారం ప్రియాంక హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత ఎల్బీ నగర్ చౌరస్తాలోని శ్రీకాంతాచారి విగ్రహం వద్దకు చేరుకుని నివాళి అర్పిస్తారు. అనంతరం సరూర్‌నగర్ స్టేడియం వరకు పాదయాత్రగా వెళ్లి అక్కడ జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు. నిరసన సభ విజయవంతం కోసం ప్రత్యేకంగా కమిటీలు వేయాలని నిర్ణయించినట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. నిరుద్యోగులతోపాటు రైతులకు అండగా ఉండేందుకే ప్రియాంక గాంధీ రాష్ట్రానికి వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారానికి రేవంత్

మల్లికార్జున ఖర్గేతో కలిసి బీదర్, భాల్కి, బసవ కల్యాణ్, హుమ్నాబాద్ సభల్లో పాల్గొన్న రేవంత్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో భాగంగా మూడు రోజుల ప్రచారం కోసం టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఉదయం హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. తెలుగువారు అధికంగా ఉండే పాత హైదరాబాద్ స్టేట్ పరిధిలోని నాలుగు జిల్లాల పరిధిలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరపున ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మంగళవారం బీదర్, భాల్కి, బసవ కల్యాణ్, హుమ్నాబాద్‌లో జరిగిన బహిరంగసభల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ కార్యదర్శి ఎమ్మెల్యే శ్రీధర్ బాబుతో కలిసి పాల్గొన్నారు. బుధ, గురువారాల్లో రాయచూర్, గుల్బర్గా, యాద్గిర్ జిల్లాలలోని అలంద్, చించోలి, సేడం– ముధోల్, కలబుర్గి, షోరాపూర్, షాహాపూర్, యాద్గిర్, గురుమిట్కల్ నియోజకవర్గాల్లో జరిగే సభల్లో పాల్గొంటారు.

..ఇనాం.. భోజనం!

▶ మొదటి పేజీ తరువాయి

కోసం రూ.5 కోట్లతో ఒప్పందం చేసుకున్నారని, తహసీల్దార్‌కు సమాచారం లేకుండానే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది.

వారసులతో ఒప్పందం కుదుర్చుకుని..

ముక్తిపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో 19, 20, 50, 51 సర్వే నంబర్లలో 48 ఎకరాల భూమి ఉంది. దీన్ని మూడు తరాలుగా చెన్నారం గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు సాగు చేసుకుంటూ టెనెంట్‌దారులుగా ఉన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఇది కిద్మత్ కింద ఇనాం భూమిగా.. హుస్సేనీ ఆలం ఇనాందారుగా ఉన్నారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆలం ఆ భూముల పట్టాదారుగా ఆన్‌లైన్‌లో నమోదైంది. విషయం తెలిసిన టెనెంట్ దారులు తాము అనేక ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని, తమ పేరు మీద పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత సదరు ఇనాందారుకు చెందిన వారసులు (మూడో తరం) కూడా తమకే హక్కు కల్పించాలంటూ కోర్టు మెట్లు ఎక్కారు. ఇలా ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతుండగా ఈ భూములపై కన్నేసిన పెద్దలు.. ఇనాందారుడి వారసులతో ముందస్తు ఒప్పందం చేసుకున్నారు. మీ పేరిట పట్టాదారు పాసుబుక్కులు తెచ్చే బాధ్యత తమదని..ఆ తర్వాత ఆ భూమిని తమకే అమ్మాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఇనాందారుడి వారసులను కుటుంబసభ్యులుగా చేర్చి ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో సంబంధిత 48 ఎకరాల కిద్మత్ ఇనాం భూమిని అధికారుల అండదండలతోవారి పేరిట మార్చి పట్టాదారు పాసు పుస్తకాలు అందజేశారు.

ఇలా వెలుగులోకి..

ఇనాందారుల పేరిట మొత్తం 48 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరైన విషయం తెలుసుకున్న టెనెంట్ దారులు మూకుమ్మడిగా కోస్గిలోని తహసీల్‌దారు కార్యాలయానికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తన ప్రమేయం లేకుండానే పాసు బుక్కులు వచ్చాయని.. తనకు కనీస సమాచారం లేదని తహసీల్దార్ లిఖిత పూర్వకంగా ధ్రువీకరణ ఇచ్చారు. అసలు విషయం బట్టబయలు కావడంతో పాసుబుక్కులు రద్దు చేస్తున్నామని జిల్లా అధికారులు ప్రకటించి తాత్కాలికంగా గొడవను సద్దుమణిగించారు. కానీ అక్రమార్కులు ఇంతటితో ఆగలేదు. భూముల్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలని పథకం వేశారు.

ఆ రియల్టర్లు ప్రజాప్రతినిధి బినామీలేనట..

ఒప్పందం ప్రకారం ఇనాందారులకు సంబంధించిన 24 ఎకరాల భూములను హైదరాబాద్‌కు చెందిన రియల్టర్ల పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే వీరందరూ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెందిన బినామీలేనని తెలిసింది. కాగా సదరు ప్రజాప్రతినిధి ముందస్తు ఒప్పందం ప్రకారం వారసులకు తూతూ మంత్రంగా ముట్టజెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత ఇటీవలే 11 ఎకరాలను కోస్గి పట్టణానికి చెందిన ఇద్దరు బడావ్యాపార వేత్తలకు ఏకంగా రూ.6.5 కోట్లకు విక్రయించి తిరిగి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూబాగోతంపై వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌ను సంప్రదించగా.. 'నేను ఇటీవలే బదిలీపై వచ్చా. పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి వక్ఫ్ బోర్డు సీఈఓకు నివేదిక అందజేస్తా'అని సమాధానమిచ్చారు.

ఓ అధికారి కీలకపాత్ర!

నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఓ అధికారి ఈ భూ బాగోతంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి సమాచారం చేరవేసి తతంగం నడిపించినట్లు సమాచారం. కోర్టు కేసులకు సంబంధించి ఇరువర్గాల అడ్వకేట్లు సహా ఇటు టెనెంట్‌దారులు, అటు వారసుల మధ్య రాజీ కుదిర్చాడు. ఇరువర్గాలు 48 ఎకరాల భూములను సమానంగా పంచుకుని.. హైదరాబాద్ చెందిన ఓ రియల్టర్ల గ్రూప్‌నకు అమ్మేలా ఒప్పందం చేయించాడు. ఉన్నతాధికారి సహకారంతో ఇరువర్గాలకు (టెనెంట్, ఇనాందారులకు) సమానంగా 24 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించాడు. గుట్టుచప్పుడు కాకుండా సాగిన రిజిస్ట్రేషన్ వెనుక రూ.5 కోట్ల డీల్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

థాయ్‌లో పేకాట.. నగరం నుంచి ఫైనాన్స్

▶ మొదటి పేజీ తరువాయి

హోటల్‌లో బస చేసిన ఓ గోవా వాసి ద్వారా సమాచారం అందింది. హోటల్‌పై దాడి చేసిన పోలీసులు అందులో నాలుగు పేకాట టేబుళ్లు, మూడు పోకర్ టేబుళ్లు ఉన్నట్లు గుర్తించారు. 16 మంది మహిళలు సహా 84 మంది భారతీయులు, థాయ్‌లాండ్‌కు చెందిన నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలను పట్టుకున్నారు. వీరిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డి సహా అనేక మంది తెలుగు వాళ్లు ఉన్నారు. వీరందరికీ థాయ్‌లాండ్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తుగా 4,500 బాట్స్ (దాదాపు రూ.11వేలు) చెల్లించాలని ఆదేశించింది. ఈ తతంగమంతా పూర్తి చేసుకుని, పాస్‌పోర్టులు పొందిన తర్వాత భారతీయులంతా తిరిగి రానున్నారు. ఆ పేకాట శిబిరంలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు వాటిని ఇంటర్‌నెట్‌తో అనుసంధానించారు. ఆ లైవ్ ఫీడ్ హైదరాబాద్‌లో స్ట్రీమ్ అయ్యేలా ఏర్పాటుచేసినట్లు చోన్బూరీ పోలీసులు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి అక్రమ ఈవెంట్లు భారీ పెట్టుబడితో ముడిపడి ఉంటాయి. ఈ నేపథ్యంలోనే నిర్వాహకులు నగదు కోసం ఫైనాన్షియర్లను ఆశ్రయిస్తుంటారు. అలాంటి ఫైనాన్షియర్ కోసమే ఈ క్యాసినో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

సీత, దేవ్ నుంచి ఆహ్వానం: చీకోటి

థాయ్‌లాండ్ వ్యవహారంపై ప్రవీణ్ మంగళవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు దేవ్, సీతల నుంచి పోకర్ టోర్నమెంట్ ఉందని ఆహ్వానం అందితేనే థాయ్‌లాండ్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడ గ్యాంబ్లింగ్ నిషేధం అన్న విషయం తనకు తెలియదని, ఆ అక్రమ క్యాసినో నిర్వాహకుడిని తాను కాదన్నారు. తన నిర్దోషిత్వాన్ని థాయ్ పోలీసుల ఎదుట నిరూపించుకున్నట్లు చెప్పారు. సదరు హాల్లోకి తాను అడుగు పెట్టిన పది నిమిషాలకే పోలీసులు దాడి చేశారన్నారు.

సర్పంచ్ కట్టించిన శ్మశానవాటికలో ఆయనదే తొలి దహన సంస్కారం

పరకాల: ఓ సర్పంచ్ కొత్తగా కట్టించిన శ్మశాన వాటిక.. ఆయన దహన సంస్కారాలతోనే ప్రారంభమయ్యింది. ఈ దురదృష్టకర ఘటన హనుమకొండ జిల్లా పరకాల మండలం హైబోతుపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... హైబోతుపల్లి గ్రామ సర్పంచ్ కంచ కుమార స్వామి (25) కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపంతో సర్పంచ్ గత నెల 29న పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం చనిపోయాడు. కాగా, ఆ గ్రామాన్ని ఇటీవలే గ్రామపంచాయతీగా ప్రకటించారు. సర్పంచ్ కంచ కుమార స్వామి ఆధ్వర్యంలో గ్రామంలో శ్మశాన వాటిక (వైకుంఠధామం) నిర్మించారు. కానీ ప్రారంభించలేదు. ఈ క్రమంలో సర్పంచ్ కుమార స్వామి ఆత్మహత్య చేసుకోవడంతో.. కుటుంబ సభ్యులు ఆయన మృతదేహానికి అదే శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ కట్టించిన శ్మశాన వాటికలో ఆయనదే తొలి దహన సంస్కారం కావడంతో గ్రామస్తులంతా కంటనీరు పెట్టుకున్నారు.



సర్పంచ్ అంత్యక్రియలు చేసిన హైబోతుపల్లి శ్మశానవాటిక ఇదే



సర్పంచ్ కుమారస్వామి(ఫైల్)

సీపీఆర్ చేసి... మహిళకు ప్రాణం పోసి

ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

కందనూలు: ఓ పోలీసు అప్రమత్తత ఓ మహిళ నిండు ప్రాణాలను కాపాడింది. మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని 100కు డయల్ చేయగా.. అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆమెకు సీపీఆర్ చేసి బతికించారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే 20 నిమిషాలుగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతోంది. అయితే కొన ఊపిరితో ఉన్నట్లు కానిస్టేబుల్ మల్లేష్ గమనించారు. వెంటనే స్థానికుల సాయంతో మహిళను కిందికి దింపి సీపీఆర్ చేస్తూ ఊపిరి అందించడంతో స్పృహలోకి వచ్చింది. వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లేష్‌ను స్థానికులు అభినందించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఆపరేషన్ చేసి.. దారం వదిలేసి!

వైద్యులు నిర్లక్ష్యం చేశారంటూ బాధితురాలి కుటుంబం ఆందోళన

మణుగూరుటౌన్: కడుపునొప్పితో ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వస్తే వైద్యులు ఆపరేషన్ చేసి దారాన్ని కడుపులోనే వదిలేశారని ఆరోపిస్తూ బాధిత మహిళ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో చోటుచేసుకుంది. మణుగూరు అశోక్‌నగర్‌కు చెందిన జ్యోతి గర్భసంచికి నీటిబుడగలు రావడంతో గత నెలలో స్థానిక స్ప్రింగ్ ఆస్పత్రిలో చేరింది. అయితే వైద్యులు శస్త్రచికిత్స చేసిన తర్వాత కొద్దిరోజులకే మళ్లీ తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. వారంక్రితం కడుపు ఉబ్బుతూ మరింత ఇబ్బందిగా మారడంతో కుటుంబసభ్యులు ఆమెను తిరిగి అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్ష చేసిన వైద్యురాలు గ్యాస్ట్రిక్ సమస్య ఉందంటూ మందులు ఇచ్చింది. అయినా సమస్య తగ్గకపోగా, మలమూత్రాల విసర్జన ఆగిపోయింది. దీంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి బాధితురాలిని తరలించగా అక్కడి వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే జ్యోతికి గతంలో ఆపరేషన్ చేసినప్పుడు దారాన్ని కడుపులోనే వదిలేశారని, దీంతో పేగులు ముడతపడి ఈ సమస్య ఎదురైందని భద్రాచలం ఆస్పత్రి డాక్టర్లు చెప్పారని ఆమె బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం మణుగూరులోని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించి పంపించారు. ఈ ఘటనపై సంబంధిత ఆస్పత్రి వైద్యురాలు సంఘమిత్రను వివరణ కోరగా, తాను ఎలాంటి పొరపాటు చేయలేదని, వారు ఎక్కడ పిర్యాదు చేసినా తన నిజాయితీని నిరూపించుకుంటానని తెలిపారు.



భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి

మున్సిపల్ భవనంలో ఊడిపడ్డ స్లాబ్ పెచ్చులు

శిథిలావస్థకు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కార్యాలయ భవనం



గుట్ట మున్సిపాలిటీ కార్యాలయంలో పరిస్థితి ఇది..



మున్సిపల్ మేనేజర్ కార్యాలయంలో కిందపడిన పెచ్చులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాల ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు మంగళవారం అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, ఆపరేటర్ గది, మేనేజర్ గదుల్లో పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న మేనేజర్ నరేష్‌రెడ్డి అప్రమత్తమై పక్కకు జరగడంతో ప్రమాదం తప్పింది. ఇదే భవనంలో సుమారు 61 సంవత్సరాలుగా పాలన కొనసాగిస్తున్నారు. ఇటీవలే నూతన మున్సిపల్ భవనం నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించారు. మూడు నెలల క్రితమే పనులు ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు కార్యాలయాన్ని మరో చోటకు మార్చాలని సూచించారు. సరైన భవనం లేకపోవడంతో ఖాళీ చేయలేదు.

ఓఆర్ఆర్ లీజ్ టెండర్లలో అక్రమార్కులు ప్రభుత్వ పెద్దలే

- కేటీఆర్, కవిత సన్నిహితులకే ఈ లీజు
- ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపణ
- ఆ టెండర్లను రద్దు చేయాలి



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) 30 ఏళ్ల లీజ్ టెండర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే అక్రమాలకు పాల్పడ్డారని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్ రావు ఆరోపించారు. కేటీఆర్, కవిత సన్నిహితులకే ఈ లీజు దక్కిందని నిందించారు. ఐఆర్ఎల్ కంపెనీ రూ.7,272 కోట్లకు టెండర్ వేస్తే రూ.7,380 కోట్లకు దక్కించుకుందని ప్రభుత్వం ఎలా ప్రకటిస్తుందని ప్రశ్నించారు. వేసిన బిడ్ కంటే ఆ కంపెనీ ఎందుకు ఎక్కువ ఇస్తోందని ప్రశ్నించారు. ఎక్కువ టెండర్ వేసిన కంపెనీకి లీజును కట్టబెట్టిన ప్రభుత్వం 16 రోజుల పాటు బిడ్‌ను బహిర్గతం, చేయకపోవడం వెనక ఆంతర్యమేమిటని నిలదీశారు. ఈ బిడ్‌ను ఓపెన్ చేశాక బేరసారాలతో ఐఆర్ఎల్‌కు అప్పగించారా అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ ఓఆర్ఆర్ కాంట్రాక్టు బిడ్‌ను వాస్తవానికి ఈ ఏప్రిల్ 11న తెరిచారని, కానీ ఏప్రిల్ 27న ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మీడియాకు ప్రకటన విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బిడ్ ఓపెన్ చేసిన 16 రోజుల తర్వాత ఈ విషయాన్ని ఎందుకు బయటపెట్టారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ పై బేస్‌ప్రైజ్ ను నిర్ణయించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీసం హెచ్ 1, హెచ్ 2, హెచ్ 2, హెచ్ 4 కంపెనీలను పిలిచి బేస్‌ప్రైజ్ కు తక్కువగా బిడ్‌కోడ్ చేసినందున టెండర్‌ను క్యాన్సిల్ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే బాగుండేదన్నారు.

ఫోన్ కాల్ వివరాలు బయట పెట్టాలి

అరవింద్ కుమార్ ఫోన్ కాల్ వివరాలు బయట పెట్టాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. 16 రోజుల్లో ఆయనతో పాటు మంత్రి గాని ఇంకా ఎవరైనా విదేశాలకు వెళ్లారా.. అని ప్రశ్నించారు. ఆ వివరాలు బయటపెట్టకపోతే తామే ఆడియో లు వీడియోలు బయట పెడతామని హెచ్చరించారు. ఐఆర్ఎల్‌పై ఇప్పటికే సీబీఐ విచారణ జరుగుతున్నందున ఈ టెండర్ ను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో తామే కోర్టుకు , వివిధ విచారణ ఏజెన్సీలకి పిర్యాదు చేస్తామన్నారు. కాగా, ఎమ్మెల్యేలకే సెక్రటేరియట్ లో ఎంట్రీ లేక పోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్లారిటీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



చుక్కా చుక్కా కలిసి నీటి కుండ నిండుతుంది. అదేవిధంగా, వివేకి కొంచెం కొంచెంగా తనలో మంచితనాన్ని నింపుకొంటాడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 3 మే 2023

మేనిఫెస్టోల మహా యుద్ధం

సమయం దగ్గర పడుతున్నకొద్దీ సమరం తీవ్రమవుతోంది. మే 10న జరగనున్న పోలింగ్‌కు మరో వారం రోజులే ఉన్న వేళ ప్రధాన పార్టీలైన అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య కర్ణాటకలో మాటల తూటాలు పేలుతున్నాయి. మేనిఫెస్టోలతో మహా యుద్ధమే జరుగుతోంది. బీజేపీ 'డబుల్ ఇంజన్ సర్కార్' జపం చేస్తూ ఉంటే, కాంగ్రెస్ మాత్రం రాష్ట్రంలో మళ్ళీ బీజేపీ గద్దెనెక్కితే అది 'డబుల్ డిజాస్టర్' అని ఎద్దేవా చేస్తోంది. మళ్ళీ కింగ్‌మేకర్ తానేనని జేడీ–ఎస్ భావిస్తోంది. గత 30 ఏళ్ళలో ఇంత పోటాపోటీగా కర్ణాటక ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. బీజేపీ, కాంగ్రెస్‌లు పైచేయి సాధించడమే లక్ష్యంగా ప్రకటించిన మేనిఫెస్టోలే అందుకు సాక్ష్యం.

ప్రతిపక్షాల కుల సమీకరణాలను అభివృద్ధి, సంక్షేమ అజెండాలతో ఢీ కొట్టి, దక్షిణాదిలో తాము అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ శ్రమిస్తోంది. అభ్యర్థుల జాబితా ప్రకటన అనంతరం నిరసన ఎదుర్కొన్న ఆ పార్టీ తన ప్రాథమిక బలాలే ఆసరాగా పరిస్థితిని చక్కదిద్దే పనిలో పడింది. అందుకే, ఇటు సంక్షేమం, అటు హిందూత్వ డిమాండ్ల మేళవింపుగా మేనిఫెస్టోను అందించింది. ప్రజలకు ఉచితంగా ఇచ్చే సంక్షేమ పథకాలను 'తాయిలాలు' అంటూ రాష్ట్రాలను నిత్యం విమర్శించే జాతీయ పార్టీ కర్ణాటకలో మాత్రం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి (బీపీఎల్) అంటూనే సంక్షేమ హామీలు గుప్పించింది. 3 హిందూ పండుగలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, అందుబాటు ధరల్లో ఆహార క్యాంటీన్లు, రోజూ అరలీటరు పాలు, వృద్ధులకు ఉచిత ఆరోగ్య చెకప్‌లు వాగ్దానం చేసింది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) లాంటి తన సైద్ధాంతిక అంశాలనూ జోడించింది.

కాంగ్రెస్ నిరుద్యోగం, మహిళా సాధికారతపై దృష్టి పెడుతూనే, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంటి గృహలక్ష్మికి నెలనెలా రూ. 2 వేలు, బీపీఎల్ కుటుంబాలకు నెలకు 10 కిలోల ధాన్యాలు, నిరుద్యోగులకు నెలవారీ డబ్బులు, స్త్రీలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లాంటివి వాగ్దానం చేసింది. రెండు పార్టీలూ మేనిఫెస్టోల సమరంలోకి దిగాయి. కూడు, గూడు, గుడ్డ లాంటి ప్రాథమిక సంక్షేమం అందించకుండా కేవలం రోడ్ల విస్తరణ లాంటి అభివృద్ధిపైనే దృష్టి పెట్టడం వల్ల ప్రజల స్థితిగతుల్లో పెనుమార్పులు ఉండవు. కాబట్టి సంక్షేమ వాగ్దానాలు తప్పేమీ కాదు. కాకుంటే, పోలింగ్‌కు 9 రోజుల ముందు ప్రకటించిన ఇవి కంటితుడుపు కాకూడదు. ఎన్నికల వాగ్దానపత్రాలను అమలుచేసే చిత్తశుద్ధి ఎన్ని పార్టీలకు ఉన్నాయన్నది ప్రశ్న. నిజానికి, మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక పార్టీలు అమలు చేశాయా అన్నదానిపై ఎన్నికల సంఘపు ఆడిటింగ్ అభిలషణీయం.

కర్ణాటక, కేరళల్లో బలంగా వేళ్ళూనుకున్న తీవ్రవాద సంస్థ 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా' (పీఎఫ్ఐ)పై 'ఉపా' చట్టం కింద గత సెప్టెంబర్‌లో కేంద్రం విధించిన నిషేధాన్ని కొనసాగిస్తామని బీజేపీ హామీ ఇస్తోంది. అందుకు ప్రతిగా కాంగ్రెస్ విద్వేషాన్ని ప్రోత్సహించే పీఎఫ్ఐ సహా బజరంగ్ దళ్ లాంటి అన్నిటినీ నిషేధిస్తామని ప్రకటించింది. ఈ వివాదాస్పద ప్రకటన కథలో కొత్త మలుపు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు సాక్ష్యమంటూ కమలనాథులంతా ధ్వజమెత్తే అవకాశం దొరికింది. ఇది సాక్షాత్తూ బజరంగ్‌ను (హనుమంతుణ్ణి) అవమానించడమే అనే కథనంతో హిందూత్వ అంశాన్ని బీజేపీ పైకి తెచ్చింది. కరడుగట్టిన కాషాయ దళమే అయినా, కర్ణాటకలో కొన్నిసార్లు మైనారిటీలపై దాడులకు దిగినా – బజరంగ్ దళ్‌ను, దేశ వ్యతిరేక పీఎఫ్ఐతో ఒకే గాటన కట్టవచ్చా? కానీ, తప్పొప్పులు మరిచిన మాటల పోటీలో ఎవరిని మాత్రం తప్పు పట్టగలం!

చిత్రమేమిటంటే కర్ణాటకలో కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్న మోదీ మాత్రం మేనిఫెస్టోలో తమ పార్టీ సైతం సంక్షేమ పథకాలు ప్రకటించిన సంగతి విస్మరించి, కాంగ్రెస్ మేనిఫెస్టోపై ఉక్రోషం వెళ్ళగక్కడం! కాంగ్రెస్‌వన్నీ అవాస్తవిక హామీలనీ, వాటిని నెరవేరిస్తే రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతుందనీ ఆయన కొత్త పల్లవి అందుకున్నారు. కాంగ్రెస్ తన హామీలను నెరవేరిస్తే, ఇప్పటి దాకా బీజేపీ సర్కార్ చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు ఆగిపోతాయంటూ వింతవాదన తెరపైకి తెచ్చారు. ఇది సామాన్యులు హర్షిస్తారా అన్నది ప్రశ్న. ఇప్పటికే కొంత ప్రజాభిప్రాయం, ప్రధాన సర్వేలు అధికార బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నాయి. కానీ, కర్ణాటకలో ముందుండి ప్రచారాన్ని నడిపిస్తున్న అమిత్ షా మాత్రం తమకు మెజారిటీ దాటి 15 సీట్లయినా వస్తాయంటున్నారు. అయితే అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో అధికారం నిలబెట్టుకోవడం గత రెండు దశాబ్దాల్లో కర్ణాటకలో జరగని కథ.

మొత్తానికి, ప్రధానపార్టీలు రెండూ తమ లక్ష్యం ఎవరనే స్పష్టతతో మేనిఫెస్టోలు తెచ్చాయి. వాటితోపాటు తమ వాదనలు తాము చేస్తున్నాయి. అయితే, ముస్లిమ్ రిజర్వేషన్ల రద్దు సహా విభజన రాజకీయాలతో కొత్త ఓటర్లను బీజేపీ ఆకట్టుకోవడం సాధ్యమేనా? అలాగే, బీజేపీది 40 శాతం కమిషన్ల అవినీతి సర్కార్ అనే వాదన ఒక్కటే పట్టుకుంటే కాంగ్రెస్ గద్దెనెక్కగలదా? 224 అసెంబ్లీ స్థానాల కర్ణాటక 2004 నుంచి ఇప్పటికి 11 మంది సీఎంలను చూసింది. కొన్నేళ్ళుగా మతోద్రిక్తతలు పెంచడం ద్వారా ఓటు బ్యాంక్ స్థిరీకరణ యత్నాలూ సాగాయి. 2018 తర్వాత ఆ అంశంపై ఓట్లు సంతృప్తస్థాయికి చేరాయనీ, కొత్తగా వచ్చేవేమీ లేవనీ బీజేపీకి అర్థమైంది. మరి ఆఖరులో అంది వచ్చిన బజరంగ్‌దళ్ వివాదం కలిసొస్తుందా? ఓట్లశాతంలో కొద్ది తేడాతో తలరాత మారే వేళ నిశ్శబ్ద ఓటర్ల మన్‌కీ బాత్ కీలకం. కాకపోతే, తరచూ ఎమ్మెల్యేల బేరసారాలు చూస్తున్న కన్నడసీమ ఈసారి హంగ్ తీర్పునివ్వదనీ, ఏదో ఒక పార్టీకే మెజారిటీ ఇస్తుందన్న సర్వే నిపుణుల హామీయే సాంత్వన.

జనాభా పెరుగుదల కలిసొచ్చేనా?

విశ్లేషణ



మనోజ్ జోషి

చైనాను అధిగమించి, ఇండియా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలిచింది. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో యువశక్తితో కూడిన భారత్ కొంత ఈర్ష్య పుట్టించేదే. ఇదంతా కూడా యువజనానికి సరైన వేతనాలున్న ఉద్యోగాలు, ఉత్పత్తి అవకాశాలు ఉన్నాయని అనుకున్నప్పుడే. సమస్య మొత్తం ఇక్కడే ఉంది. ఉద్యోగాల్లో వ్యవసాయ రంగ భాగస్వామ్యం ఏకంగా 43 శాతం. చైనాలో ఇది 25 శాతమే. యువజనం ఉత్పాదకత పెరగాలంటే వారు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు రావాల్సి ఉంటుంది. భారత్ వ్యవసాయ సంబంధిత ఉద్యోగాలను 15 శాతం వరకూ తగ్గించాలనుకుంటే రాగల 25 ఏళ్లలో కనీసం 9.3 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది! ఈ క్రమంలో మనం చైనాను అధిగమించామని ఐక్యరాజ్యసమితి జనాభా డ్యాష్ బోర్డ్ అంచనా వేసింది. 2011 తరువాత దేశంలో జనాభా లెక్కల నిర్వహణ జరగలేదు కాబట్టి ఐరాస అంచనాలపై మనం ఆధారపడాల్సి వచ్చింది. కోవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. అధికారిక జన గణన ఎప్పుడు జరుగుతుందో ఇప్పటివరకూ ఎలాంటి సూచనా లేదు.

జనాభా పెరిగిపోతోందంటే ఒకప్పుడు ఎంతో ఆందోళన వ్యక్తమయ్యేది. కానీ ప్రపంచంలోని చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో యువశక్తితో కూడిన భారత్‌ను కొంత ఈర్ష్యతో చూసే సందర్భం! ఐరాస లెక్కల ప్రకారం, దేశ జనాభా సగటు వయసు 28 ఏళ్లు. జనాభాలో సగం కంటే ఎక్కువ మంది వయసు ముప్ఫై ఏళ్ల లోపే. ఉద్యోగం లేదా పని చేసే వయసు 15 – 64 ఏళ్లనుకుంటే అలాంటివాళ్లు 92.5 కోట్ల మంది ఉన్నారు. వీళ్లు ఉత్పత్తి, వినియోగం, ఆదా కూడా బాగా చేయగలరు. అదే సమయంలో వయోవృద్ధుల సంక్షేమానికి పెట్టాల్సిన ఖర్చు తక్కువ.

ఇక్కడ మనమో విషయం గుర్తుంచుకోవాలి. పైన చెప్పుకున్న అంచనాలన్నీ ఇతర అంశాలతో ముడిపడి ఉన్నవే. దేశంలోని యువజనానికి సరైన వేతనాలున్న ఉద్యోగాలు, ఉత్పత్తి అవకాశాలు ఉన్నాయన్నది వీటిల్లో ఒకటి. ఉద్యోగాల ద్వారా వారికి తినేందుకు తగినంత ఆహారం, వినోదాలు అందుతున్నాయనీ, ఆరోగ్యం బాగుందనీ, పనికొచ్చే విద్యతో లాభాలు చేకూరాయనీ అనుకోవాలి. సమస్య మొత్తం ఇక్కడే ఉంది. ఉద్యోగాల్లో వ్యవసాయ రంగ భాగస్వామ్యం ఏకంగా 43 శాతం. చైనాలో ఇది 25 శాతమే. అమెరికాలో రెండు శాతం కంటే తక్కువ మంది ఉద్యోగాల కోసం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. ఒకవేళ భారత్ వ్యవసాయ సంబంధిత ఉద్యోగాలను 15 శాతం వరకూ తగ్గించాలనుకుంటే రాగల 25 ఏళ్లలో కనీసం 9.3 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది.

ఉద్యోగాల కల్పన జరగాలి

యువజనం ఉత్పాదకత పెరగాలంటే వారు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు రావాల్సి ఉంటుంది. నగరీకరణ ఫలితంగా నగరాల మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితిని గమనిస్తే తయారీ రంగం బలహీనతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. మేకిన్ ఇండియా, ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) వంటి పథకాలతో అధిగమించే ప్రయత్నం జరిగినా సాధించింది కొంతే. భారత ఆర్థిక వ్యవస్థ మొత్తమ్మీద తయారీ రంగం వాటా 14 శాతం మాత్రమే. చైనాలో ఇది దాదాపు 30 శాతం.

ఉద్యోగాల విషయానికి వస్తే గత ఏడాది జూలైలో పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానమిస్తూ, 2014- 22 మధ్య కాలంలో ప్రభుత్వానికి 22.05 కోట్ల దరఖాస్తులు వచ్చాయనీ, వీటిల్లో నియామక ఉత్తర్వులు అందుకున్నది కేవలం 7.22 లక్షలు లేదా 0.3 శాతం మాత్రమేననీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని యువతకు ఉద్యోగాలు లేకపోవడమే కాదు... నిరాశా నిస్పృహలతో వాటి కోసం ఎదురు చూసే సహనాన్నీ కోల్పోయినట్లు కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం, దేశ యువ జనాభాలో 30.7 శాతం అటు చదువుకోడం లేదు... ఇటు ఉద్యోగమూ చేయడం లేదు. అలా గని ఏదైనా శిక్షణ పొందుతున్నారా అంటే అదీ లేదు!



గత ఏడాది అక్టోబరులో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం... దేశంలో మునుపటి కంటే ఎక్కువ మంది పిల్లలు బడుల్లోకి చేరుతున్నారు. వదిలిపోయేవారు తక్కువయ్యారు. బోధన నాణ్యత, ఉపాధ్యాయుల సంఖ్యలు గత దశాబ్ద కాలంలో పెరిగాయి. అయితే ప్రాథమిక విద్యా రంగం చాలా సవాళ్లను ఎదుర్కొంటోందనీ, గ్రామీణ ప్రాంతాల్లో సాక్షరతను వృద్ధి చేయడం, అంకెలకు సంబంధించిన నైపుణ్యాన్ని పెంచడం వీటిల్లో కొన్ని మాత్రమేననీ తెలిపింది.

ప్రాథమిక విద్యాభ్యాసం సమస్యలు ఒకవైపు అలా ఉండగా... ఉన్నత విద్య పరిస్థితి ఏమంత బాగోలేదు. కొత్త కాలేజీలు బోలెడన్ని పుట్టుకొస్తున్నా, విద్యారంగం పరిశ్రమ స్థాయికి చేరుకున్నా చాలా మంది పట్టభద్రుల నైపుణ్యాల స్థాయి తక్కువగా, కొన్ని సందర్భాల్లో అస్సలు లేకుండా పోయినట్లు బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన ఒక నివేదిక తెలిపింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి బాటకు ఇవి స్పీడ్ బ్రేకర్లే.

దేశం ఎదుర్కొంటున్న ఇంకో ముఖ్యమైన సవాలు పనిచేసే వారిలో మహిళల సంఖ్యను పెంచడం. అంతర్జాతీయ కార్మిక సంస్థ లెక్కల ప్రకారం దేశంలో పని చేస్తున్న లేదా పనికోసం ఎదురు చూస్తున్న (లేబర్‌ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ లేదా ఎల్ఎఫ్‌పీఆర్) వారు 52 శాతం. మహిళలు అతితక్కువగా (22 శాతం) ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూండటం ఇందుకు కారణం. ఎక్కువమంది భాగస్వాములయ్యే అమెరికాలో ఇది 73, చైనాలో ఇది 76 శాతం. వాస్తవానికి ఈ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండవచ్చుననీ, ఎల్ఎఫ్‌పీఆర్ 40 శాతానికి తగ్గిపోయిందనీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ చెబుతోంది. మహిళల విషయానికి వస్తే అది కేవలం 19 శాతమేనని తేల్చింది. ఇది సౌదీ అరేబియా (31) కంటే తక్కువ కావడం గమనార్హం.

సమస్యల జాబితా ఇక్కడితో ఆగిపోలేదు. ఆరోగ్యంపై దేశం పెడుతున్న ఖర్చు ప్రపంచంలోనే అత్యల్పం. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (2019- 21) చెబుతున్న దాని ప్రకారం, దేశంలో ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న వారిలో 35 శాతం మంది తమ సామర్థ్యానికి తగ్గట్టుగా ఎదగడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం దేశంలో ప్రతి పదివేల మంది పౌరులకు కేవలం ఐదు ఆసుపత్రి బెడ్లు ఉన్నాయి. చైనాలో ఈ సంఖ్య 43. అలాగే 15–49 మధ్య వయస్కులైన మహిళల్లో సగం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.

ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రయత్నిస్తోందన్న దానికి నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే వ్యవస్థలు కొంతవరకూ నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అయితే ప్రజా సేవల విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరముంది. ఆరోగ్యం, విద్య వంటి రంగాలకు నిధుల కేటాయింపులు తక్కువగా ఉండటం మానవ వనరులపై దుష్ప్రభావం చూపుతుంది. ఇది కాస్తా ఉత్పాదకత తగ్గేందుకు, కార్మికులు, ఉద్యోగాలు చేసే వారిలో నైపుణ్యాల లేమికి దారి తీస్తుంది. జపాన్, చైనా వంటి దేశాలు తమ జనాభాల కారణంగా ఎదిగేందుకు ఇవే కారణమన్నవి ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. భారత్ కూడా వీటి ఆధారంగానే వృద్ధి పథంలో అగ్రస్థానానికి చేరాలని ఆశిస్తోంది. అయితే జనాభా తీరుతెన్నుల వల్ల వచ్చే లాభాలు వాటంతటవే రావు. సుస్థిర ఆర్థికాభివృద్ధి కావాలంటే వినూత్నమైన విధానాలు, సమర్థమైన అమలు అత్యవసరమవుతాయి.

చైనా విషయాన్నే తీసుకుంటే... కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేయడమే కాకుండా, తయారీ రంగంలో సూపర్ పవర్‌గా ఎదుగుతోంది. అయితే ప్రస్తుతం చైనా జనాభా తగ్గుముఖం పడుతోంది. దీంతో ఆ దేశం ఎదుర్కొనే సవాళ్లూ కూడా మారిపోతాయి. ఈ సవాళ్లలో ప్రధానమైంది తగ్గిపోతున్న కార్మిక శక్తి ఉత్పాదకతను వేగంగా పెంచాల్సిన అవసరం ఉండటం. చైనాకు కొన్ని లాభాలూ ఉన్నాయి. జనాభా తక్కువగా ఉండటం వల్ల పర్యావరణంపై దుష్ప్రభావం తక్కువగా ఉంటుంది. నిరుద్యోగిత తగ్గి వేతనాలు పెరిగేందుకు దోహదపడవచ్చు.

డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పాలుపోని స్థితి



సౌత్ ఇండియా రిపబ్లిక్ అనే ఆలోచన అసౌకర్యానికి గురిచేసే కఠిన వాస్తవం. తెలుగువాళ్లు దాన్ని 'అరవ' ఆధిపత్యంగా భావించి సహించలేరు. ఢిల్లీ రాజ్యం చీదరే. కానీ తమిళ ద్రావిడ రాజ్యం అంత కంటే రోత!

– సాయి స్వరూప, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆడవాళ్లే కనగలరు



ప్రపంచ జనాభా: 803,06,10,062. ఇందులో ఆడవాళ్లకు పుట్టినవాళ్లు: 803,06,10,062. మగవాళ్లకు పుట్టినవాళ్లు: 0. కావాలంటే మీరు దీన్ని 'ఫ్యాక్ట్ చెక్' చేసుకోవచ్చు.

– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు

హిందూ యూదులు



'హిందూ జియోనిజం' అనే మాటను పాకిస్తాన్‌లో నేను 90ల్లో 'లష్కర్ ఎ తొయిబా'లో చేరినప్పుడు విన్నాను. హిందువులను 'జియోనిస్టులు' (యూదు జాతీయత మద్దతుదారులు) అంటూ ఒక తీవ్రమైన ద్వేషపూరిత వాతావరణాన్ని కల్పించి టీనేజర్ల బ్రెయిన్‌వాష్ చేస్తారు. హిందూ జియోనిస్టులు అనే మాటను ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా లష్కర్ ఎ తొయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ ఉపయోగించారు.

– నూర్ దాహ్రీ, రచయిత

చెప్పకోకూడదు



నా ఆఫీసులోని ముగ్గురు లాయర్లు ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్ పాసయ్యారు. నా నుంచి ఏ ప్రయత్నం లేనివాటికి కూడా నేను క్రెడిట్ తీసుకునే ఉద్దేశంతో ఇది చెబుతున్నాను.

– విక్రమ్ హెగ్డే, సుప్రీంకోర్టు న్యాయవాది

ఎందుకీ విపరీతం?



బస్సుల్లో, రైళ్లల్లో అత్యంత పెద్ద శబ్దంతో మ్యూజిక్ వినడం, వీడియోలు చూడటం చేసే మనుషుల మానసిక పరిస్థితి బాగానే ఉన్నట్టా?

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

ఇన్‌బాక్స్

పత్రికా స్వేచ్ఛతోనే వికాసం

దక్షిణాఫ్రికా నుంచి నడిపిన 'ఇండియన్ ఒపీనియన్' తొలి సంచిక సంపాదకీయంలో 'జర్నలిజం ఏకైక లక్ష్యం సేవ మాత్రమే' అని తాను గ్రహించానని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాల తర్వాత ఆ ఖండం నుంచే 'ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం' పుట్టుకొచ్చింది. ఇది ఏడాదికొక్కసారి మీడియా వ్యవస్థను సమీక్షించుకునేలా చేస్తుంది. పత్రికా స్వేచ్ఛ విశ్వమానవ వికాసానికి ఎంతో దోహదకారని ఎలుగెత్తి చాటుతుంది.

మానవాభివృద్ధి, భద్రత, భాగస్వామ్యం, జవాబుదారీతనం, సుపరిపాలనను ప్రోత్సహించడానికి మీడియా మహత్తర సాధనంగా మారింది. వీటన్నింటి ద్వారా పేదరిక నిర్మూలనకు దారులు పడ్డాయి. ప్యారిస్‌కి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ పొలిటికల్ స్టడీస్ పత్రికాస్వేచ్ఛ– అభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని నిర్ధారించడానికి అధ్యయనాలు నిర్వహించింది. పర్యావరణం మొదలుకొని విద్య, ఆరోగ్యం, ఆహారం, ఆర్థిక రక్షణలు, సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి వంటి అన్ని విషయాల్లో పత్రికాస్వేచ్ఛ కీలక భూమిక పోషిస్తున్నట్టు గణాంకాలతో సహా వెల్లడించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పత్రికాస్వేచ్ఛను గట్టిగా సమర్థించారు. అమెరికాలో తొలిరాజ్యాంగ సవరణ... భావ వ్యక్తీకరణ హక్కుకు మరింత బలం చేకూర్చే విధంగా జరిగింది. దీనికి పూర్తి విరుద్ధంగా మొదటి భారత రాజ్యాంగ సవరణ వాక్ స్వాతంత్ర్య హక్కులను అరికట్టే విధంగా జరిగింది. కాలక్రమంలో సర్వోన్నత న్యాయస్థానం రొమేష్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్, బ్రిజ్ భూషణ్, మరొకరు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఢిల్లీ వంటి కేసులకు సంబంధించి కొన్ని మైలురాయి తీర్పులను వెలువరించింది. వీటి ద్వారా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛల్లో పత్రికాస్వేచ్ఛ ముఖ్యభాగమని పేర్కొంది. తదనంతరం ఈ కేసుల ఆధారంగా భారతదేశంలో ఎన్నో పత్రికలకు, పాత్రికేయులకు న్యాయస్థానాల్లో విజయాలు దక్కాయి. ప్రభుత్వాల నుంచి రక్షణలు లభించాయి. అలాగే ఎన్నో కీలక ఘట్టాల్లో, అత్యవసర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్ని, వాటి గౌరవాల్ని పరిరక్షించిన శక్తి పత్రికలకే సాధ్యమని ఎన్నో ఘటనలు నిరూపించాయి.



– జి. యోగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు
(నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం)

చైనా నిరుద్యోగ పర్వం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచం నేడు ఆర్థిక మాంద్యంలో ఉంది. ఉద్యోగ కల్పనలో ఇండియా, చైనా, కెనడా లాంటి దేశాలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. పాలక విధానాలు కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నాయి. పేదల స్థితినీ, నిరుద్యోగాన్నీ, సామాన్యుల కొనుగోలు శక్తినీ పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో చైనా యువత నేడు ఉద్యోగాల వేటలో తీవ్ర పోటీని ఎదుర్కొంటోందని షాంఘై సహాయ ఆచార్యురాలు జియా మియావో అన్నారు. ఆమె ప్రకారం... ఉపాధి పరంగా చైనా యువత నిరాశలో మునిగి ఉంది. పరిశ్రమల మూసివేతలు, ఉద్యోగుల తొలగింపులు కరోనాతో దెబ్బతిన్న ఆర్థికవ్యవస్థ... ఇలా అనేక సమస్యలతో చైనా సతమతమవుతోంది. చైనా తేజోరహిత సంస్కృతిని అలవర్చుకుంది. 16–20 ఏళ్ల యువత నిరుద్యోగం 20 శాతానికి పెరిగిందనీ, (2021లో ఇది 16.2 శాతం) నగరాలలో ఈ వయసు ఉద్యోగులు 5.4 శాతమనీ, నగర వాసుల సగటు నెలసరి ఆదాయం రూ. 48 వేలనీ... 2022 ఆగస్టు అధికారిక సర్వే తెలిపింది. ఫిబ్రవరి 2023లో 16–24 ఏళ్ల నిరుద్యోగులు 18.1 శాతం. కొన్ని కంపెనీలు 996 (ఉదయం 9 నుండి రాత్రి 9 వరకు వారానికి 6 రోజులు) శ్రమసంస్కృతిని అమలుచేస్తున్నాయి. ఉద్యోగ వయోపరిమితిని 35 ఏళ్లు చేయాలనీ, పెరుగుతున్న వృద్ధ జనాభాకు అనుగుణంగా పదవీ విరమణ వయస్సును పెంచాలనీ చైనా నిర్ణయించింది. దీంతో చైనాలో 35 ఏళ్ల యువత జాబ్ ఫెయిర్‌లో సంక్షోభంలో పడింది.



అనేక సంస్థలు యువ ఉద్యోగులను ఇష్టపడతాయి. యువకుల తక్కువ ఆరోగ్య నిర్వహణ ఖర్చులు, అపరిమిత శక్తిసామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని కంపెనీలు వారిని ఉద్యోగాలలో నియమించుకోడం సమంజసమే. అయితే ఈ ఎంపిక అనుభవ శ్రామిక శక్తి వృథాకు దారితీస్తుంది. వాణిజ్య సంస్థల వయసు పక్షపాతం, పెద్ద వయసు వారి ఉద్యోగ దరఖాస్తుల తిరస్కరణలను వెంటనే నిలిపి వేయాలి. అంతేకాక కార్యాలయంలో వయసు ఆధార వివక్షను నిషేధించడానికి శాసన పరమైన చర్యలను ప్రవేశపెట్టాలి. ప్రస్తుతం చైనా కార్మిక చట్టంలో అలాంటి నిబంధన లేకపోవడం వల్ల పెద్ద వయసు కార్మికుల పట్ల కంపెనీల పక్షపాతం ఏర్పడింది.

1929–30లో ప్రపంచంలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్యం నుంచి బయట పడటానికి బ్రిటిష్ ఆర్థిక వేత్త 'జాన్ కీ' సూచించిన సూచన లను అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ 'న్యూ డీల్' పేరుతో అమలు జరిపి సానుకూల ఫలితాలను సాధించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో సహా అనేక దేశాలు ఈ తరహా పథకాలను అమలు చేస్తున్నాయి. అయితే అవి అభివృద్ధికి దారితీయని, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే పథకాలు.

కమ్యూనిజాన్ని సడలించి 'తనదైన నమూనా' సోషలిజాన్ని చైనా పాటిస్తోంది. పెరిగిన కళాశాల విద్యతో ఉద్యోగార్థులు పెరిగారనీ, అందుకే నిరుద్యోగం పెరిగిందని ప్రస్తుత నిరుద్యోగితకు చైనా సంజాయిషీ చెబుతోంది. ఇది సరికాదు. చైనా సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలో ప్రధాన ప్రత్యామ్నాయ శక్తి. అది అమెరికా శిబిరానికి విమర్శల అస్త్రాలను అందించరాదు. అందుకే స్వదేశీ సమస్యల పరిష్కారంలోనూ ఆదర్శంగా నిలవాలి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి ı 94902 04545

చలం ఆఖరి ఉత్తరం!?


సందర్భం



జయసూర్య

''దీపం ఇచ్చే కాంతి, ఆవు ఇచ్చే పాలను బట్టి వాటి విలువలు ఉన్నట్టే – సంతోష పెట్టడం, సేవించడం, పిల్లల్ని కనటం సామర్థ్యాన్ని బట్టి మహిళ విలువ, గుర్తింపు పొందుతోంది.'' ఇది సుమారు వందేళ్ల క్రితం 'చలం', ఇంగ్లిష్‌లో 'మ్యాన్ అండ్ ఉమన్' పేరిట ప్రచురించిన మేనిఫెస్టో సారాంశం.

గుడిపాటి వెంకటా చలం జన్మించి 129 ఏళ్లు, మరణించి 44 సంవత్సరాలైంది. ''స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి విజ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి'' అంటూ బూజు పట్టిన పాతివ్రత్య నియమాలు, సంసారిక నీతి నియమాల దుష్టత్వంపై జీవితం, సాహిత్యం ఒకటిగా చలం పోరాటం చేశారు. నిరంతరం సంఘర్షణ, అశాంతి, నిందారోపణలు, కువిమర్శలు ఎదుర్కొంటూ ఎన్నో నవలలు, కథలు, నాటికలు, వ్యాసాలు, కవితలు, లేఖలు రాశారు.



1899 మే 19న జన్మించి, 1979 మే 4న తుదిశ్వాస వదిలే వరకు ఉన్న జీవితంలో... 58 ఏళ్లు తెలుగు నాట, 27 ఏళ్లు అరుణాచల రమణాశ్రమంలో జీవితానందపు లోలోతుల వెలుగులను అన్వేషిస్తూ తనను తాను అర్పించుకున్నారు. 1927లో చలం రాసిన మొదటి నవల మైదానం. దాదాపు ఆరు దశాబ్దాలు నిరీశ్వరవాదిగా, అరుణాచల ఆశ్రమవాసిగా, కవిగా, తాత్వికుడిగా, సత్యాన్వేషిగా ఈశ్వరుణ్ణి కూడా ప్రశ్నించారు. అరుణాచలం వెళ్లిపోయాక, ఆంధ్రదేశం చలాన్ని పలాయన వాదిగా నిందించింది. అక్కడ నుండి కూడా తన చిరంతన ఆత్మాన్వేషణ అనిర్వచనీయ భక్త్యానుభవాల్ని రచనలుగా, అసంఖ్యాకంగా అభిమానులకు ఉత్తరాలుగా అందచేశారు.

చలం సాహిత్య ప్రభావం యువతరంపై గాఢంగా పడడంతో అసంఖ్యాకంగా ఉత్తరాలు ఆయనను ప్రశ్నిస్తూ వచ్చేవి. అపరిచితులకు కూడా ప్రత్యుత్తరాలు రాసి సంతోషపెట్టే సున్నిత హృదయం ఆయనది. ఆయన దస్తూరీ, ఆత్మీయంగా ఉండే పలకరింపు, పసి హృదయ స్వచ్ఛత, ఆలోచనల శైలి ఉత్తరాలలో స్పష్టమవుతున్నాయి. 1927 నుంచి 30 ఏళ్లు... చింతా దీక్షితులకు రాసిన ఉత్తరాలలో ప్రేమ, హాస్యం, నిర్మలత్వం, వేదన వంటి ఎన్నో అంశాలు కనిపిస్తాయి.

ఆయనను స్వయంగా చూడకపోయినా... 1969– 1979 మధ్య ఈ వ్యాస రచయితకు ఆయన అయిదు జవాబులు దయతో రాసి ధన్యుణ్ణి చేశారు. ఈశ్వర కరుణ, ఈశ్వరాదరణ, ఈశ్వరాశీర్వాదాలు ప్రేమగా పలకరింప చేసేవారు. అపరిణత భావోద్వేగంగా, తెలిసీ తెలియని జ్ఞానంతో, చిలిపి ఎకచకియంగా, భగవాన్ నుంచి ఆయన అవలోకించిన దివ్యానుభూతిని ప్రశ్నిస్తూ నాకూ పంపమని నేను రాయడం నాడు ఎంత అవివేకం? అప్పటికే జీవన చరమాంకంలో ప్రవేశించిన చలం... నా అజ్ఞానాన్ని సహించి, ఎంతో సహనంతో నన్ను క్షమించి జవాబు రాయడం ఎంతటి ఔదార్యం! అప్పటికే శారీరకంగా వార్ధక్యంలో ఉన్న ఆయన రాసే అక్షరాలు వంకర్లు తిరిగి వణుకుతున్నాయి. ఆ స్థితిలో రాయడానికి ఎంత ఓపిక కావాలి? ''భగవాన్ నుంచి నేను అవలోకించిన దివ్యానుభూతి నాకే చాలకుండా ఉంది. మీకెక్కడ పంపగలను?'' అని రాస్తూ లేఖకుణ్ణి గురించి ఏం ఊహించారో ఏమో... 'అప్పుడే కాదు' అని కూడా రాశారు. బహుశా అది ఆయన స్వదస్తూరితో రాసిన ఆఖరి ఉత్తరం కావచ్చు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(రేపు చలం వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.10.38 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** హస్త రా.8.01 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** తె.4.21 నుండి 6.01 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.22 వరకు, **అమృతఘడియలు:** ప.1.34 నుండి 3.20 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.15.

విష్వక్సేనారాధన నిర్వహిస్తున్న ఆచార్యులు



యాదాద్రిలో శ్రీనృసింహ జయంత్యుత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో మంగళవారం శ్రీనృసింహస్వామి వారి జయంత్యుత్సవాలను ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ప్రారంభించారు. ఆలయంలో స్వస్తి వచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. తిరువేంకటపతిగా శ్రీనృసింహస్వామిని అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో సైతం శ్రీనృసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభించారు. జయంత్యుత్సవాలకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత హాజరయ్యారు. ఆలయ మాడ వీధిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

విభేదాలను పరిష్కరించడమూ మధ్యవర్తిత్వమే

సీనియర్ న్యాయవాది, మీడియేటర్ జేపీ సింగ్ వెల్లడి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేపీ సింగ్. చిత్రంలో సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్ రావు


సాక్షి, హైదరాబాద్: వివాదాలను పరిష్కరించడమే కాదు..విభేదాలను సమసిపోయేలా చేయడం కూడా మధ్యవర్తిత్వమేనని సీనియర్ న్యాయవాది, మీడియేటర్ జేపీ సింగ్ వెల్లడించారు. కొన్నిసార్లు పిల్లలు కూడా తల్లిదండ్రుల సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతారని ఇది కూడా మధ్యవర్తిత్వం లాంటిదేనని, అలా మనం ఎంతోమంది మధ్యవర్తులను చూస్తుంటామని ఆయన తెలిపారు. నగర శివారులోని చేగూర్‌లోని కన్హా శాంతివనంలో రెండ్రోజుల నుంచి మధ్యవర్తిత్వంపై మెళకువలకు సంబంధించి జరుగుతున్న హైకోర్టు జడ్జీలకు శిక్షణ కార్యక్రమానికి మంగళవారం జేపీ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విభేదాలు చెట్టు వేర్లు లాంటివి ఐతే...వివాదాలు కొమ్మల్లాంటివన్నారు. విభేదాలను మొగ్గదశ లోనే పరిష్కరిస్తే..వివాదాలు ఉండవని చెప్పారు. న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం రామచంద్రమిషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేశ్ డి.పటేల్ పాల్గొని ధ్యానంపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయసేవల సభ్యకార్యదర్శి, జడ్జి గోవర్ధన్‌రెడ్డి, జడ్జి రాధిక పాల్గొన్నారు.

ట్రోలింగ్ సామాజిక జబ్బు!

వ్యక్తిగత ప్రతిష్ట దిగజార్చేలా ప్రవర్తిస్తూ కొందరి నెటిజన్ల పైశాచిక ఆనందం

- ఇతరులను దెబ్బ తీసేందుకు స్పాన్సర్డ్ ట్రోలింగ్ ఎంచుకుంటున్న కొందరు
- 5 రకాలుగా ట్రోలింగ్: సైబర్ భద్రత నిపుణులు

ట్రోలింగ్‌తో సెలెబ్రిటీలకు తప్పని మనో వేదన



సాక్షి, హైదరాబాద్: సెలెబ్రిటీలకే కాదు. క్రమంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సామాన్యులకు సైతం ట్రోలింగ్ తప్పడం లేదు. ఎదుటి వారి ప్రతిష్టను సోషల్ మీడియాలో దెబ్బతీస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు కొందరు శాడిస్టులు. మరికొందరేమో పిచ్చి, 'పచ్చి..'వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో తాము ఫేమస్ అయ్యేందుకు దిగజారుతున్నారు. వ్యూస్, లైక్, కామెంట్లు , షేర్లతో సొమ్ము చేసుకునేందుకు ఇంకొందరు సోషల్ మీడియా ట్రోలింగ్‌కు పాల్పడుతున్న దుర్మార్గపు ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎదుటి వారికి ఎలాంటి సంబంధం లేని విషయాలను వారికి అంటగట్టి ప్రతిష్టను దెబ్బ తీసేందుకు ఏకంగా కొందరు డబ్బు ఖర్చు చేసి మరీ ఇతరులతో ట్రోలింగ్‌లకు పాల్పడుతున్నారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఎదుటివారు ప్రయోగించే 'ట్రోలింగ్'అస్త్రాన్ని ఎలా తిప్పికొట్టాలి..ఎలా ట్రోలింగ్‌ను ఎదుర్కోవాలన్న అంశాలపై అవగాహన ఉండాలంటున్నారు సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు డా.పాటిబండ్ల ప్రసాద్.

ట్రోలింగ్ అంటే..

ఆన్‌లైన్‌లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం లేదా కలవరపెట్టడాన్ని మనం స్థూలంగా ట్రోలింగ్ అనవచ్చు. ఒక వ్యక్తిని, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వారికి ఎలాంటి సంబంధం లేనటువంటి అంశాలను సైతం అంటగడుతూ వారి సామాజిక హోదాను దెబ్బతీయడం, తద్వారా వారిని తీవ్ర ఆందోళనలో నెట్టడమే ట్రోలింగ్‌చేసే వారి ప్రధాన లక్ష్యంగా చెప్పవచ్చు.

ఎక్కువగా రాజకీయ నాయకులు, సినీ, క్రీడా తారలే బాధితులు..

ట్రోలింగ్‌కు పాల్పడాలనుకునే వారు టార్గెట్ చేసుకునేది ఎక్కువగా రాజకీయ నాయకులు, సినీ, క్రీడా తారలే ఎక్కువ ఉంటున్నారు. ప్రజల్లో ఆదరణ ఉన్న వారిపైనే అందరిలో ఆసక్తి ఉంటుంది. అందుకే అలాంటి వారిని ఎక్కువగా టార్గెట్ చేసుకున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ట్రోలింగ్ రకాలు...

ఫ్లేమ్ ట్రోలింగ్ నిందారోపితమైన ఆరోపణలు, ద్వేషాన్ని, ఇతరులను కించపర్చే అంశాలపై ట్రోలింగ్. ఉదాహరణకు మతపరమైన విద్వేష పూరిత భావజాలం పెంచేలా ట్రోలింగ్.

ఆఫ్-టాపిక్ ట్రోలింగ్ అసందర్భమైన వ్యక్తులను, ప్రదేశాలను, స్థలాలను వివాదాల్లోకి లాగేలా చేసే ట్రోలింగ్. ఉదాహరణకు..పాత తరం రాజకీయ నాయకులను ప్రస్తుత రాజకీయాల్లోకి లాగడం..ప్రాంతాలు, మతపరమైన పాత వివాదాలు లేవనెత్తేలా ట్రోలింగ్.

కన్సర్న్ ట్రోలింగ్ ఏదైన ఒక అంశాన్ని బాగా సపోర్ట్ చేస్తున్నట్టు లేదా ఆ విషయంపట్ల ఆందోళన చెందుతున్నట్టుగా నటిస్తూ వ్యాఖ్యలు.. ట్రోలింగ్ చేయడం.. ఉదాహరణకు.. మతపరమైన అంశాలపై మద్దతు పెంచడం, రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందేలా ట్రోలింగ్..

సోక్ పప్పెట్ ట్రోలింగ్... పెద్ద సంఖ్యలో ఫేక్ అకౌంట్లను సృష్టించి వాటి ద్వారా ఎవరైనా ఒక వ్యక్తికి మద్దతు ఇచ్చేలా లేదా కించపర్చేలా ట్రోలింగ్ చేస్తూ ప్రజల్లో ఒక రకమైన అభిప్రాయాన్ని క్రియేట్ చేయడం..
ఉదాహరణకు..రాజకీయ నాయకుల గురించి, రాజకీయాల గురించి, మతపరమైన అంశాల గురించి డబ్బులు తీసుకుని ట్రోలింగ్ చేయడం.

ట్రోలింగ్ దుష్ప్రభావాలు..

భావోద్వేగాలు రెచ్చగొట్టి బాధించడం: మానసిక క్షోభకు ట్రోలింగ్ దారితీస్తుంది. ఆందోళన, నిరాశ, ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతుంది.

నమ్మకాన్ని పోగొట్టడం: ట్రోలింగ్ అనేది ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. నిజమైన, అర్థవంతమైన సంభాషణల్లోనూ పాల్గొనకుండా స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది.

చిల్లింగ్ ఎఫెక్ట్: ట్రోలింగ్ లేదా వేధింపులు భయాన్ని పెంచుతాయి. ట్రోలింగ్‌కు గురయ్యే వ్యక్తి ఆన్‌లైన్‌లో తన అభిప్రాయాలు స్వేచ్ఛ చెప్పడానికి భయపడే పరిస్థితికి వస్తాడు.

తప్పుడు సమాచారం: ట్రోల్‌లు తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయవచ్చు. ఇది ట్రోలింగ్‌కు గురయ్యే వ్యక్తుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది.

స్పందించకపోవడమే అసలు మందు..



డా. ప్రసాద్, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ట్రోలింగ్ పాల్పడే వారి లక్ష్యం ఒక్కటే మనల్ని అన్ని రకాలుగా వేధించడం. అందుకే ట్రోలింగ్‌లో చేసే వారి కామెంట్లు పట్టించుకోకపోవడం అనేది ఉత్తమం. వీలైనంత వరకు సోషల్ మీడియాలో మన వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు. అది ట్రోలింగ్‌కు వాడే ప్రమాదం ఉంది. అలానే ట్రోలింగ్ శ్రుతి మించితే మాత్రం ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఇలా ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వారికి ఫిర్యాదు చేసి, ఆ కంటెంట్ డిలీట్ చేయించవచ్చు. అదేవిధంగా ట్రోల్ చేసే వారిని బ్లాక్ చేయడం, మ్యూట్ వంటి ఆప్షన్లు వాడాలి.

ఇలా ఎదుర్కోవచ్చు...

ట్రోల్‌ను తప్పక రిపోర్ట్ చేయాలి.. మనపై ట్రోలింగ్ చేస్తూ మనల్ని కించపర్చే వ్యాఖ్యలు ఉంటే వెంటనే ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వారికి ఫిర్యాదు చేసి ఆ కామెంట్లు డిలీట్ చేయించవచ్చు.

ఈ టూల్స్ వాడొచ్చు.. సోషల్ మీడియా ఖాతాల్లో ఆయా ప్లాట్‌ఫామ్‌లు కొన్ని టూల్స్ ట్రోలింగ్‌ను ఎదుర్కొనేలా ఇస్తున్నాయి. ట్రోలింగ్ చేసే వారిని బ్లాక్ చేయడం, మ్యూటింగ్ యూజర్స్ ఆప్షన్ పెట్టడం, ఫిల్టరింగ్ అబ్యూసివ్ లాంగ్వేజ్ ఆప్షన్ పెట్టుకోవడం వంటివి వాడుకోవాలి.

నెహ్రూ జూ పార్క్ ప్రవేశ రుసుము పెంపు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని నెహ్రూ జూపార్క్ ప్రవేశ రుసుము మామూలు రోజుల్లో పెద్దలకు రూ.60 ఉండగా దానిని రూ.70కు, సెలవురోజుల్లో రూ.75 ఉండగా దానిని రూ.80కు, పిల్లలకు మామూలు రోజుల్లో రూ.40 ఉండగా దానిని రూ.45కు, సెలవురోజుల్లో రూ.50 ఉండగా దానిని రూ.55కు పెంచారు. జూ పార్క్ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దానిని అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దడంతోపాటు రాష్ట్రంలోని ఇతర పార్కులను కూడా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అరణ్యభవన్‌లో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జపాట్ (జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాకతీయ జూ పార్క్ (హన్మకొండ), పిల్లలమర్రి మినీ జూ పార్క్ (మహబూబ్‌నగర్), లోయర్ మానేరు డీర్ పార్ (కరీంనగర్), కిన్నెరసాని డీర్ పార్క్(పాల్వంచ)లో జంతు సంరక్షణ, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సౌకర్యాల కల్పనపై చర్చించారు.

సొంతూళ్లో ఉంటా.. రివాల్వర్ ఇవ్వండి

తూప్రాన్ సీఐకి గద్దర్ వినతి

తూప్రాన్: 'ఇక పుట్టిన ఊరిలోనే ఉంటా.. మిగతా జీవితం ఇక్కడే కొనసాగిస్తా.. నాకు భద్రత కల్పించండి.. రివాల్వర్ ఇవ్వండి' అని ప్రజాగాయకుడు గద్దర్ పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన తూప్రాన్‌లో సీఐ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. 76 ఏళ్ల ఈ వయసులో పుట్టిన ఊరిలోనే ఉండాలని, సంకల్పించుకున్నట్టు పేర్కొన్నారు. తనకు 2 ప్లస్ 2 భద్రత కల్పించాలని, రక్షణ కోసం రివాల్వర్ ఇవ్వాలని పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీ అధ్యాపకుల బదిలీలు

సాక్షి, హైదరాబాద్:ప్రభుత్వమెడికల్ కాలేజీల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలకు వైద్యారోగ్య శాఖ మంగళవారంరాత్రి మార్గదర్శకాలు విడుదల చేసింది. **మార్గదర్శకాలు:** ప్రస్తుతం పనిచేస్తున్న చోట కనీసం రెండేళ్ల సర్వీస్ పూర్తయినవారు దరఖాస్తుకు అర్హులు. • 17 కొత్త మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను బదిలీల ద్వారా భర్తీ చేస్తారు. •దరఖాస్తులు ఖాళీల కన్నా ఎక్కువగా ఉంటే.. నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఖాళీల్లో భర్తీ చేస్తారు. • కౌన్సెలింగ్‌లో ఉస్మానియా, గాంధీ, కాకతీయ(వరంగల్), నిజామాబాద్ మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను ప్రదర్శించరు. • ఒక పోస్టుకు ఒకరికన్నా ఎక్కువమంది దరఖాస్తు చేస్తే స్పౌజ్, అంగవైకల్యం, బుద్ధి మాంద్యులైన పిల్లలు, కారుణ్య, తీవ్ర అనారోగ్య సమస్యల ఆధారంగా ప్రాధాన్యం నిర్ణయిస్తారు.

వివాహితపై సామూహిక అత్యాచారం

- ఐదుగురు యువకులతోపాటు మరో మహిళపై కేసు నమోదు
- ఐదుగురు రిమాండ్, పరారీలో మహిళ
- వరంగల్ జిల్లాలో ఘటన



వరంగల్: పని కోసం రోడ్డుపై వెళ్తున్న ఓ వివాహితను కారులో ఎక్కించుకుని ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారం చేసిన ఘటన వరంగల్ జిల్లాలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత అదే గ్రామానికి చెందిన మరో మహిళతో పని నిమిత్తం ఏప్రిల్ నెల 20వ తేదీ ఉదయం ఆరెపల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా... ములుగు జిల్లా జంగాలపల్లికి చెందిన ఎస్.రవి అనేవ్యక్తి ఎ.రమేశ్ అనే వ్యక్తితో కలసి కారులో (తెల్లరంగు బ్రెజా) వచ్చి మహిళలిద్దర్నీ ఎక్కించుకుని ములుగు వైపు బయల్దేరారు. ఓ మహిళ మార్గమధ్యంలోనే దిగిపోగా, కొంతదూరం వెళ్లాక ములుగు జిల్లాకు చెందిన డి.నాగరాజు, హన్మకొండకు చెందిన బి.లక్ష్మణ్, వర్ధన్నపేటకు చెందిన బి.సుధాకర్ అనే యువకులు కారులో ఎక్కారు. ఈ ఐదుగురు కలసి కారులో ఉన్న మహిళను బెదిరిస్తూ మేడారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ ముగ్గురు యువకులు అత్యాచారం చేయగా మిగిలిన ఇద్దరు యువకులు సహకరించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆ మహిళను బెదిరించి ములుగు తీసుకొచ్చి అక్కడ బస్సు ఎక్కించి వెళ్లిపోయారు. సదరు బాధితురాలు ములుగు రోడ్డు వద్ద బస్సుదిగి తన భర్తకు ఫోన్ చేసింది. ఎక్కడికి వెళ్లావని నిలదీయడంతో ఆమె భయపడి కరీంనగర్ జిల్లాలోని పుట్టింటికి వెళ్లిపోయింది.

గత నెల 25న ఫిర్యాదు చేసిన భర్త: బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 25న ఏనుమాముల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పుట్టింటి దగ్గర ఉన్నట్లు భార్య చెప్పడంతో అక్కడకు వెళ్లిన భర్తకు సామూహిక అత్యాచారం సంగతి తెలిసింది. దీంతో బాధితురాలు, ఆమె భర్త ఏప్రిల్ 29న కలసి ఫిర్యాదు చేయగా పోలీసులు ఐదుగురు యువకులతో పాటు సామూహిక అత్యాచారానికి సహకరించిన మరో మహిళపై కూడా గ్యాంగ్‌రేప్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అనంతరం ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించారు.

గిరిజన మహిళ కిడ్నాప్, హత్య

ఖమ్మంలో దారుణ ఘటన

- దాడి చేసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలివెళ్లిన దుండగులు
- చికిత్స పొందుతూ బాధితురాలి మృతి
- ఐదు రోజుల తర్వాత వెలుగులోకి..

ఖమ్మంక్రైం: ఓ గిరిజన మహిళను కిడ్నాప్ చేసి దాడి చేయడంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన గిరిజన మహిళ (45) తన అత్త మానసిక స్థితి సరిగ్గా లేక అనారోగ్యానికి గురవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించేందుకు గత నెల 27న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మం వచ్చారు. ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌కు చూపించాక తిరిగి ఊరు వెళ్లేందుకు ఆ సమయంలో రైళ్లు ఉండవని తెలిసి కొత్త బస్టాండ్‌కు ఆటోలో బయలుదేరారు. బైపాస్ రోడ్డులో వెళ్తుండగా అత్త మూత్ర విసర్జన కోసం ఆటో ఆపించి పక్కకు వెళ్లింది. ఇదే అదనుగా ఒంటరిగా ఉన్న గిరిజన మహిళను తీసుకుని ఆటో డ్రైవర్ పరారయ్యాడు. దీంతో 70ఏళ్ల వృద్ధురాలు రోదిస్తూ స్థానికుల సాయంతో సొంతూరుకు చేరుకుంది. గత నెల 28న ఉదయం 10 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు అపస్మారక స్థితిలో ఉన్న గిరిజన మహిళను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి క్యాజువాలిటీ వద్ద వదిలేశారు. దీంతో సిబ్బంది గుర్తు తెలియని మహిళగా పేరు నమోదు చేసుకుని చికిత్స చేసినా ఆమె మధ్యాహ్నం 3గంటలకు మృతిచెందింది. దీంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. కాగా, ఆ మహిళను కిడ్నాప్ చేసిన ఆగంతకుడు తలపై బలమైన వస్తువుతో మోదినట్లు అనుమానిస్తున్నారు. అపస్మారక స్థితికి చేరుకున్నాక భయంతో ఆస్పత్రిలో వదిలేశాడని భావిస్తున్నారు.

ట్రైనీ ఐపీఎస్ చొరవతో..

ఈనెల 27న అదృశ్యమైన గిరిజన మహిళ కోసం 28న ఖమ్మం వచ్చిన బంధువులు ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, హవేలీ పోలీస్‌స్టేషన్లకు వెళ్లగా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. చివరకు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రామ్మూర్తినాయక్ సహకారంతో మంగళవారం టూటౌన్ స్టేషన్‌కు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న ట్రెయినీ ఐపీఎస్ అవినాశ్‌కుమార్ స్టేషన్‌కు వచ్చిన మృతదేహాల ఫొటోలను చూపించడంతో వారు తమ బంధువైన గిరిజన మహిళను గుర్తించారు. దీంతో కేసు తీవ్రతను గుర్తించిన అవినాశ్ సూచనలతో పోలీసులు రంగంలోకి దిగారు. కాగా, ఆ మహిళను ఆస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలిసింది. దీంతో సమీప మెడికల్ షాపు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తూ ఖమ్మం రైల్వేస్టేషన్, ప్రైవేట్ ఆస్పత్రి అడ్డాల్లోని ఆటోడ్రైవర్లను విచారిస్తున్నారు. మృతురాలికి ఓ కుమార్తె ఉంది. భర్త ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కిడ్నాప్,, హత్యకు సంబంధించిన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రాష్ట్రాల సరిహద్దులో 'మావో'ల భేటీ?

వెంకటాపురం ఏజెన్సీలో హై అలర్ట్

- పోలీసు ఉన్నతాధికారుల ఆరా...
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల సరిహద్దుపై నిఘా
- సరిహద్దు అడవుల్లో డ్రోన్‌ల ఎగురవేత





డ్రోన్‌తో తీసిన అటవీప్రాంతం. (ఇన్‌సెట్)లో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎగిరిన డ్రోన్

సాక్షి ప్రతినిధి, వరంగల్: మావోయిస్టు అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఆధ్వర్యంలో మావోయిస్టులు మూడు రాష్ట్రాల సరిహద్దులో భేటీ అయ్యారా? ములుగు, కొత్తగూడెం జిల్లాలకు సరిహద్దుగా ఉన్న వీరాపూర్ సమీపంలో మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్న ఏరియా కమిటీల సమావేశం నిర్వహించారా? అంటే.. అవుననే అంటున్నాయి పోలీసు ఇంటెలిజెన్స్ వర్గాలు. సమావేశాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసు ఉన్నతాధికారులు మావోయిస్టు నేత దామోదర్ ఆదేశాల మేరకు నిర్వహించారా..? లేక దామోదర్ సమక్షంలోనే సమావేశాలు జరిగాయా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

ఆ పోలీస్ స్టేషన్‌లో ఖాకీబాస్‌ల సమావేశం?

మూడు రాష్ట్రాల సరిహద్దులో మళ్లీ మావోయిస్టుల కదలికలు మొదలైన నేపథ్యంలో తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు ములుగు జిల్లా అటవీ ప్రాంతాలపై దృష్టి సారించారు. ఇంటెలిజెన్స్, ఇన్వెస్టిగేషన్ అధికారి ప్రభాకర్ రావు, అడిషనల్ డీజీ, ఇంటెలిజెన్స్ ఐజీలు నాగిరెడ్డి, రవివర్మలు, నార్త్‌జోన్ ఐజీ చంద్రశేఖర్‌లతోపాటు సీఆర్పీఎఫ్ చీఫ్, ఇతర పోలీస్ ఉన్నత అధికారులతో వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ క్రమంలో అక్కడ భారీగా సీఆర్పీఎఫ్ బలగాలు మోహరించాయి. వెంకటాపురం, పాలెం ప్రాజెక్టు, పెనుగోలు, కొత్తపల్లి, బీజాపూర్ ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల నిఘాను పర్యవేక్షించిన అధికారులు డ్రోన్‌లను ఎగురవేసి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిసింది. మావోయిస్టులు తెలంగాణలోకి చొరబడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం 3 రాష్ట్రాల సరిహద్దులో పర్యటించినట్లు తెలిసింది.

మూడు రాష్ట్రాల సరిహద్దులో హై అలర్ట్..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల సరిహద్దులో పోలీసులు మళ్లీ హై అలర్ట్ ప్రకటించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత 50 కిలోల శక్తివంతమైన మందుపాతర పేల్చి 10 మంది డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గ్రూప్) జవాన్లు, డ్రైవరును చంపిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా లో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పుల్లో ఓ దళకమాండర్, ఇద్దరు సభ్యులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు మూడు రాష్ట్రాల సరిహద్దు అటవీప్రాంతాన్ని మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నారు. తెలంగాణ సరిహద్దులోని ఏజెన్సీలోకి మావోలు చొరబడే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు.

క్లుప్తంగా

గూగుల్‌ను వీడిన ఏఐ గాడ్‌ఫాదర్



వాషింగ్టన్: గాడ్ ఫాదర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా పేరొందిన జెఫ్రీ హింటన్(75) టెక్ దిగ్గజం గూగుల్‌కు రాజీనామా చేశారు. తాజాగా ఆయన బీబీసీతో మాట్లాడారు. కృత్రిమ మేధతో కలిగే ముప్పుపై ఇకపై స్వేచ్ఛగా మాట్లాడుతానన్నారు. ''ప్రస్తుతానికి కృత్రిమ మేధ మనుషుల కంటే తెలివైందేమీ కాదు. కానీ, త్వరలోనే వారిని మించిపోవచ్చునన్నారు. అదే పెద్ద ప్రమాదం'' అని హెచ్చరించారు. ''సాధారణ పరిజ్ఞానం విషయంలో అవిప్పటికే మనుషులను దాటేశాయి. తార్కిక జ్ఞానం విషయంలోనూ త్వరలోనే మెరుగవుతాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తత అవసరం. ఉద్యోగాల తొలగింపునకు కారణమవుతుంది. ఏది నిజమో తెలుసుకోలేని ప్రపంచాన్ని సృష్టించే సామర్థ్యం ఏఐకి ఉంది'అని హింటన్ హెచ్చరించారు. ఫేక్ ఫొటోలు, నకిలీ సమాచారం వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఈ సాంకేతికత దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కూడా చాలా కష్టమని చెప్పారు. గూగుల్ ఏఐ పరిశోధనల్లో హింటన్ ఏళ్లుగా పాలుపంచుకుంటున్నారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు దక్కని ఊరట

అహ్మదాబాద్: పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించలేదు. మోదీ ఇంటి పేరుపై వ్యాఖ్యల కేసులో సూరత్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కూడా రద్దయింది. ఈ తీర్పుపై మధ్యంతర స్టే ఇవ్వాలన్న రాహుల్ పిటిషన్‌పై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ ప్రాచ్ఛక్ విచారణ జరిపారు. ఈ కేసును అత్యవసరమైందిగా భావించి మంగళవారమే తీర్పు వెలువరించాలని రాహుల్ తరఫున వాదించిన అభిషేక్ మను సింఘ్వి కోరారు. ఈ దశలో మధ్యంతర స్టే మంజూరు చేయలేమని జడ్జి స్పష్టం చేశారు. జూన్ 3న వేసవి సెలవులు ముగిశాకే తుది ఉత్తర్వులిస్తామని స్పష్టం చేశారు.

పాక్ చొరబాటుదారుల కాల్చివేత..డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: సరిహద్దులు దాటి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఇద్దరిని కాల్చివేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. రాజస్తాన్‌లోని బార్మేర్ వద్ద పాక్ సరిహద్దుల వెంట సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వారినుంచి మూడు ప్యాకెట్లలో హెరాయిన్ దొరికిందని బీఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు. తెలిపింది. వారిద్దరినీ డ్రగ్స్ స్మగ్లర్లుగా భావిస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ అడ్డాపై కాంగ్రెస్ కన్ను



ఏడు జిల్లాలు, 50 అసెంబ్లీ స్థానాలున్న ముంబై కర్ణాటక ప్రాంతం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజేతను తేల్చడంలో కీలకంగా ఉంటోంది. బీజేపీకి ప్రధాన ఓటుబ్యాంకైన లింగాయత్‌లు అధికంగా ఉండటంతో ఇక్కడ ఆ పార్టీ ఎంతో బలంగా ఉంది. ఈసారి సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. జేడీ(ఎస్) ఉనికి ఇక్కడ కూడా నామమాత్రమే..



ముంబై కర్ణాటకలో హోరాహోరి పోరు

ఈ లింగాయత్ ప్రాబల్య ప్రాంతంలో యడియూరప్పదే హవా


సాక్షి, బెంగళూరు: బ్రిటిషర్లతో పోరాడిన స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి కిత్తూరు చెన్నమ్మ పేరిట 2021లో ముంబై కర్ణాటక పేరును కిత్తూరు కర్ణాటకగా మార్చారు. ఇక్కడ ఉత్తర కన్నడ మినహాయించి మిగతా ఆరు జిల్లాల్లోనూ లింగాయత్‌లదే ప్రాబల్యం. దశాబ్దాలుగా వారు బీజేపీకి దన్నుగా నిలుస్తున్నారు.

ఆధిక్యం అటూ ఇటూ

- ముంబై కర్ణాటక తొలినాళ్లల్లో కాంగ్రెస్ కంచుకోట. 1990 ఎన్నికల్లో లింగాయత్ వర్గానికి చెందిన నాటి సీఎం వీరేంద్ర పాటిల్ పక్షవాతం బారిన పడటంతో ప్రధాని రాజీవ్ గాంధీ ఆయన్ను తొలగించారు. దాంతో కాంగ్రెస్‌పై లింగాయత్‌లు భగ్గుమన్నారు. తర్వాత బీజేపీ లింగాయత్ నేత బీఎస్ యడియూరప్ప వెనక నడిచారు.
- క్రమంగా ఈ ప్రాంతం బీజేపీ కంచుకోటగా మారింది. అలా సాగిన బీజేపీ హవాకు యడియూరప్ప తిరుగుబావుట ఎగరేసి సొంత కుంపటి పెట్టుకోవడంతో 2013లో అడ్డుకట్ట పడింది. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 30 సీట్లు గెలిచింది.
- 2014 లోక్‌సభ ఎన్నికల అనంతరం యడియూరప్ప తిరిగి బీజేపీ గూటికి చేరడంతో ముంబై కర్ణాటక మళ్లీ బీజేపీ పట్టులోకి వెళ్లింది. దాంతో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 30, కాంగ్రెస్ 17 సీట్లు గెలిచాయి.
- యడియూరప్ప ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకున్న నేపథ్యంలో అంతటి లింగాయత్ నేతను బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేస్తోంది.
- అధికార బీజేపీ కూడా సరిగ్గా ఎన్నికలకు నెల ముందు లింగాయత్‌ల ఓటుబ్యాంకును కాపాడుకునేందుకు వారి రిజర్వేషన్లను 2 నుంచి 4 శాతానికి పెంచింది. ఇది బాగా కలిసొస్తుందని ఆశిస్తోంది.
- ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బెళగావి, ధారవాడల్లో భారీ సభలు, మెగా రోడ్ షోలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ బెళగావిలో యువ క్రాంతి, యువ సమావేశాలు నిర్వహించారు.

బెళగావిలో కీలక పోరు

- బెంగళూరు నగరం (28 సీట్లు) తర్వాత అత్యధిక అసెంబ్లీ సీట్లు (18)న్న బెళగావి జిల్లా ముంబై కర్ణాటక ప్రాంతంలోనే ఉంది. ఈ జిల్లా రాజకీయంగానూ చాలా కీలకం. 2018 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 10, కాంగ్రెస్ 8 సీట్లు గెలుచుకున్నాయి.
- ఉమేశ్ కత్తి, సవదత్తి మామని వంటి కీలక నేతల హఠాన్మరణంతో బీజేపీ ఇక్కడ కాస్త బలహీనపడింది. దీనికి తోడు మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ సవది వంటి సీనియర్లు పార్టీని వీడటంతో మరింత డీలా పడింది. శెట్టర్ హుబ్లీ సెంట్రల్ నుంచి కాంగ్రెస్ తరఫున బీజేపీకి సవాలు విసురుతున్నారు.
- రెండు పార్టీల్లోనూ గట్టి రాజకీయ కుటుంబాలున్నాయి. జిల్లాలో చాలామంది ప్రజాప్రతినిధులు చక్కెర సహకార సంఘాలున్నాయి. నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ బెళగావి నుంచే ప్రజాధ్వని యాత్ర పేరిట ఎన్నికల బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది.
- సీఎం బసవరాజ్ బొమ్మై ప్రాతినిధ్యం వహిస్తున్న శిగ్గావ్ స్థానం ముంబై కర్ణాటక కిందకే వస్తుంది. 2018 నుంచీ ఇక్కడ పలు జిల్లాల్లో కాంగ్రెస్ పుంజుకుంటోంది. ఆ పార్టీకి చెందిన విపక్ష నేత సిద్దరామయ్య బాగలకోట జిల్లా బాదామి నుంచి గెలుపొందారు.
- విజయపుర జిల్లాలో బీజేపీ సీనియర్ నేత బసవనగౌడ పాటిల్ నోటి దురుసు పార్టీకి తలనొప్పిగా మారింది. గతంలో యడియూరప్పపై బహిరంగంగా విమర్శలతో పార్టీకి నష్టం చేసిన చరిత్ర ఆయనది. ఈసారి సీఎం అభ్యర్థి తానేనంటూ హల్‌చల్ చేస్తున్నారు.
- ఇక 7 సీట్లున్న ధారవాడ జిల్లా కూడా బీజేపీకి కీలకమే. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



పవార్ అస్త్రసన్యాసం

ఎన్సీపీ అధ్యక్షునిగా తప్పుకుంటున్నట్టు ప్రకటన | **పార్టీలో కలకలం, కార్యకర్తల ఆందోళనలు** | **నిర్ణయంపై రెండు రోజుల్లో పునరాలోచన: అజిత్**



టైం అయిపోయింది..!
మంగళవారం రాజీనామా ప్రకటన అనంతరం పవార్

ముంబై: దేశ రాజకీయాల్లో కురువృద్ధుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ (82) ఉన్నట్టుండి బాంబు పేల్చారు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు మంగళవారం ప్రకటించారు. తన ఆత్మకథ తాజా వెర్షన్ విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వేదిక చేసుకున్నారు. ''1960లో మొదలైన నా రాజకీయ జీవితం 63 ఏళ్లుగా నిర్నిరోధంగా కొనసాగుతూ వస్తోంది. ఇక తప్పుకోవాల్సిన సమయం వచ్చింది. విద్య, వ్యవసాయం, క్రీడలు, సంస్కృతి తదితర రంగాల్లో యువత, విద్యార్థులు, దళితులు, గిరిజనులు తదితరులకు సేవ చేయాలనుకుంటున్నా. రాజ్యసభ సభ్యునిగా నాకు మిగిలిన మూడేళ్ల పదవీకాలంలో మహారాష్ట్రకు, దేశానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెడతా. పార్టీలో ఇక ఎలాంటి పదవీ స్వీకరించబోను'' అంటూ ఆకస్మిక ప్రకటన చేశారు. దాంతో పార్టీలో పెను కలకలం రేగింది. పవార్ నిర్ణయానికి నిరసనగా నేతలు, కార్యకర్తలు ఆందోళనకు, మూకుమ్మడి రాజీనామాలకు దిగారు. దాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని కోరారు. పలువురు కార్యకర్తలు భావోద్వేగంతో కంటతడి పెట్టారు. పవార్ వారసుని ఎన్నిక కోసమంటూ మొదలైన ఎన్సీపీ నేతల కమిటీ భేటీ ఈ ఆందోళనల నేపథ్యంలో అర్ధాంతరంగా ముగిసింది. పునరాలోచనకు పవార్‌కు రెండు మూడు రోజులు సమయం కావాలని ఎన్సీపీ నేత అజిత్ పవార్ చెప్పారు. తొందరపాటు చర్యలకు దిగొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. రాజీనామాలు మాని ఆందోళనలు విరమించాలని కోరారు. 15 రోజుల్లో ఢిల్లీలో, మహారాష్ట్రలో భారీ బాంబులు పేలనున్నాయని పవార్ కుమార్తె సుప్రియా సులే ఇటీవలే చెప్పడం తెలిసిందే. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తేవడంలో కీలకంగా వ్యవహరించగల నేతల్లో ఒకరిగా పవార్ గురించి చెబుతుంటారు.

కాకలుతీరిన యోధుడు

దేశ రాజకీయాల్లో కాకలుతీరిన యోధునిగా శరద్ పవార్‌కు పేరుంది. కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలం కొనసాగి కీలక స్థాయికి ఎదిగారు. మహారాష్ట్రకు ఏకంగా నాలుగుసార్లు సీఎంగా పని చేశారు. రక్షణ మంత్రిగా కేంద్ర వ్యవసాయ మంత్రిగా చేశారు. ప్రధాని పదవి కోసం గట్టిగా పోటీ పడ్డారు. ఆ ఆశ నెరవేరకపోవడంతో సోనియాగాంధీ విదేశీయతపై విమర్శల వర్షం కురిపిస్తూ ఆమెతో విభేదించి కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం 1999లో ఎన్సీపీని స్థాపించారు. నాటి నుంచే పవారే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎవరూ ఊహించని విధంగా కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో పవార్‌దే కీలక పాత్ర!

సంయమనం పాటించండి

కర్ణాటకలో పార్టీలకు ఈసీ హితవు

న్యూఢిల్లీ: విషసర్పం, విషకన్య, పనికిమాలిన కుమారుడు. ఇలా కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు శ్రుతిమించుతున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహించింది. పార్టీలు, స్టార్ ప్రచారకులు సంయమనం పాటించాలంటూ హితవు పలికింది. ఆమోదనీయం కాని పదజాలంతో ఎన్నికల వాతావరణాన్ని పాడుచేయొద్దని సూచించింది. కోడ్‌కు అనుగుణంగా హుందాగా నడచుకోవడం పార్టీల విధి అని స్పష్టం చేసింది. మరోవైపు, బీజేపీ స్టార్ ప్రచారకులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విద్వేష ప్రసంగాలతో కర్ణాటక ప్రజలను రెచ్చగొట్టజూస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రచారం చేయకుండా వారిపై తక్షణం నిషేధం విధించాలని ఈసీని కోరింది.

డీకే హెలికాప్టర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు పక్షి తగిలింది. దాంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ పగిలింది. తాకిడి తీవ్రతకు అది పగిలి ముక్కలు కావడంతో ఒక్కసారిగా గాలి లోపలికి ప్రవేశించింది. దాంతో పైలట్ సమీపంలోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్టులో హెలికాప్టర్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశారు.

బజరంగ్ దళ్‌పై నిషేధం

- బీజేపీ సర్కారు ప్రజా వ్యతిరేక చట్టాల రద్దు
- గృహ జ్యోతి, గృహ లక్ష్మి తదితర ఐదు గ్యారెంటీలు
- కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీలు



మేనిఫెస్టోతో సిద్ధరామయ్య, ఖర్గే, శివకుమార్

శివాజీనగర: అధికారంలోకి వస్తే సమాజంలో కులం, మతం ప్రాతిపదికన విద్వేషాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు, బజ్‌రంగ్‌దళ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)వంటి సంస్థలపై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని తెలిపింది. ఈ నెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఆ పార్టీ మేనిఫెస్టో 'సర్వ జనుల శాంతి వనం'ను మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, సీఎల్పీ నేత సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు. 'రాజ్యాంగం, చట్టం పవిత్రతపై మాకు విశ్వాసం ఉంది. ఇదే సమయంలో మెజారిటీ, మైనారిటీ వర్గాల మధ్య విద్వేషాన్ని, శత్రుత్వాన్ని ప్రేరేపించే బజరంగ్‌దళ్, పీఎఫ్ఐ వంటి సంస్థలను ఉపేక్షించం. వీటిపై చట్ట ప్రకారం నిషేధం విధించడం వంటి చర్యలు తీసుకుంటాం'అని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొంది. అంతేకాకుండా, గృహ జ్యోతి, గృహ లక్ష్మి, అన్న భాగ్య, యువ నిధి, శక్తి వంటి అయిదు గ్యారెంటీలను పునరుద్ఘాటించింది. 'ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగే క్యాబినెట్ మొదటి రోజు సమావేశం నుంచే ఈ హామీలను అమలు చేస్తాం. ఇదే నా ఆరో హామీ'అని ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. తమకు అధికారమిస్తే హామీలన్నిటినీ అమలు చేసేందుకు కట్టుబడి ఉంటామని శివకుమార్ అన్నారు.

కాంగ్రెస్ ప్రకటించిన పథకాలివీ..

ప్రభుత్వ బస్సుల్లో రాష్ట్రమంతటా మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పించే పథకం శక్తి. ప్రతి కుటుంబం మహిళా యజమానికి నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం అందించే గృహ లక్ష్మి పథకం. గృహస్తులందరికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించే గృహ జ్యోతి పథకం. అన్న భాగ్య పథకం ద్వారా నిరుపేదల కుటుంబాలకు నెలకు 10 కిలోల ఆహారధాన్యాల పంపిణీ. 'యువ నిధి'ద్వారా నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.3 వేల భృతి, 18–25 ఏళ్ల నిరుద్యోగ డిప్లొమా గ్రాడ్యుయేట్లకు రెండేళ్లపాటు రూ.1,500 సాయం. వీటితోపాటు అవినీతిని వెలుగులోకి తెచ్చే కర్ణాటక విజిల్‌బ్లోయర్స్ రక్షణకు చట్టం. పన్ను ఆదాయంలో కేంద్రం నుంచి న్యాయబద్ధంగా కర్ణాటకకు రావాల్సిన వాటాను డిమాండ్ చేయడం. సమాఖ్య వ్యవస్థలో రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవడం. కేంద్రం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని తిరస్కరిస్తూ రాష్ట్ర విద్యా విధానానికి రూపకల్పన చేయడం.

హనుమపై అంత ద్వేషమా?

కాంగ్రెస్ చరిత్రంతా ఉగ్రవాదం, ఉగ్రవాదుల సంతుష్టీకరణే: మోదీ



బహిరంగ సభలో డప్పు వాయిస్తున్న మోదీ

హొసపేటె/రాయచూరు రూరల్/సాక్షి, బళ్లారి: కర్ణాటకలో అధికారంలోకి వస్తే బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం కర్ణాటకలోని విజయనగర జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ''కాంగ్రెస్ చరిత్రంతా ఉగ్రవాద, ఉగ్రవాదుల సంతుష్టీకరణమయం. ఉగ్రవాదులు హతమైతే కన్నీరు కారుస్తుంది. చివరికి సైనికులనూ అవమానిస్తుంది. సర్జికల్ దాడులకు రుజువులు డిమాండ్ చేస్తుంది. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్లో ఉగ్రవాదులు హతమయ్యారని విని కాంగ్రెస్ అత్యున్నత నేత కళ్ల వెంట బొటబొటా నీళ్లు రాలాయి! గతంలో వారికి రామునితో సమస్య. ఇప్పుడు జై బజరంగ బలీ అని నినదించే వాళ్లతో సమస్య. హనుమంతుడు పుట్టిన గడ్డకు వచ్చి ఆ రామభక్తునికి ప్రణామాలు సమర్పించే భాగ్యం నేడు నాకు దక్కింది. కానీ మన దేశ దౌర్భాగ్యం చూడండి! కాంగ్రెస్ వాళ్లు అప్పట్లో రామున్ని ఖైదు చేసినట్టే ఇప్పుడు హనుమాన్ భక్తులపైనా పడతామంటున్నారు. ఇటువంటి పనుల వల్లే ఆ పార్టీ ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాలకు పరిమితమైంది'' అంటూ దుయ్యబట్టారు. కర్ణాటకను కాంగ్రెస్ ఉగ్రవాదుల అడ్డాగా మారిస్తే తాము వారి వెన్ను విరిచామన్నారు. అలాంటి కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన విజయనగర సామ్రాజ్యానికి దేశ చరిత్రలో గర్వించదగ్గ స్థానముందన్నారు. ఆ సామ్రాజ్యంలో భాగమైన ఈ ప్రాంతాన్ని కిష్కింద క్షేత్రంగా కొందరు చరిత్రకారులు భావిస్తారు. ఇక్కడికి సమీపంలో హంపికి పక్కనే కొప్పల్ జిల్లాలో ఉన్న అంజనాద్రిని హనుమంతుని జన్మస్థలంగా స్థానికులు నమ్ముతారు. రాయలు చూపిన బాటలోనే దేశాన్ని కేంద్రం ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. రాయచూరు జిల్లా సింధనూరు ర్యాలీలో, చిత్రదుర్గ బహిరంగ సభలోనూ ఆయన మాట్లాడారు. బీజేపీని మళ్లీ గెలిపిస్తే కర్ణాటకను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

ఖర్గేలకు ఓటుతో బదులివ్వండి

పేదలకిచ్చిన ఏ హామీనీ నిలుపుకోని చరిత్ర కాంగ్రెస్‌దంటూ మోదీ ఎద్దేవా చేశారు. ఇప్పుడు సొంత అస్తిత్వమే ప్రమాదంలో పడేసరికి మరోసారి కర్ణాటకలో హామీల పేరుతో ప్రజలను వంచించజూస్తోందని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్‌ది ముగిసిన అధ్యాయమన్నారు. తనను విష సర్పం, పనికిరాని కొడుకు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆయన కొడుకు ప్రియాంక్ చేసిన విమర్శలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, జేడీ(ఎస్) దొందూ దొందేనంటూ మోదీ ఎద్దేవా చేశారు.

బురదలో కూరుకుపోయిన మోదీ హెలికాప్టర్

ప్రధాని మోదీ హెలికాప్టర్ సింధనూర్ వద్ద భారీ వర్షం కారణంగా బురదలో కూరుకుపోయింది. సిబ్బంది ఎంతగానో శ్రమించి పొక్లెయిన్లు తదితరాల సాయంతో దాన్ని బయటికి లాగారు. సంబంధిత వీడియోలు వైరల్‌గా మారాయి. అయితే అది మోదీ కోసం ఉంచిన స్పేర్ హెలికాప్టర్. అప్పటికే ఆయన మరో హెలికాప్టర్లో వెళ్లిపోయారు.

రెచ్చగొట్టే యత్నం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: హనుమాన్‌ను బజరంగ్ దళ్‌తో పోల్చడం సిగ్గుచేటంటూ కాంగ్రెస్ మండిపడింది. తద్వారా మత సెంటిమెంట్లను రగిల్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. కోట్లాది హనుమద్భక్తులను అవమానించినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలోనూ మోదీది స్వోత్కర్షే

ప్రధానిపై మరోసారి కాంగ్రెస్ నేత రాహుల్ ధ్వజం




శివమొగ్గ: కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో కూడా ప్రధాని మోదీ కేవలం తన గురించి మాత్రమే చెప్పుకుంటున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ''భూమిపై మోదీ ఒక్కరే లేరు. సామాన్య ప్రజలు కూడా ఉన్నారు. కానీ ఆయన మరే విషయమూ మాట్లాడటం లేదు'' అన్నారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా బాళేబైలిలో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మోదీ మొదటగా సామాన్య ప్రజల గురించి మాట్లాడాలని సూచించారు. కర్ణాటకలో సొంత పార్టీ నేతల అవినీతిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

ఇదొక లూట్, జూట్ సర్కార్

కర్ణాటక బీజేపీ ప్రభుత్వంపై ప్రియాంకా గాంధీ నిప్పులు

మండ్య: ''మూడున్నరేళ్లుగా కర్ణాటకను పాలిస్తున్న బీజేపీ ప్రజలను మోసం చేసింది. ఇదొక లూట్, జూట్ సర్కారు'' అని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వద్రా విమర్శించారు. మంగళవారం ఇక్కడ కాంగ్రెస్ ప్రచార సభలో ఆమె మాట్లాడారు. లంచగొండి బీజేపీ వద్దని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని అన్నారు. 40 శాతం కమీషన్ల ప్రభుత్వం ప్రజలను లూటీ చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ విధించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు.

మహాత్మాగాంధీ మనవడు అరుణ్ కన్నుమూత



ముంబై: మహాత్మాగాంధీ మనవడు, సామాజిక కార్యకర్త అరుణ్ మణిలాల్ గాంధీ(89) మంగళవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కన్నుమూశారు. తన తండ్రి కొంతకాలంగా స్వల్ప అస్వస్థతతో బాధపడుతున్నారని ఆయన కొడుకు తుషార్ గాంధీ చెప్పారు. మహాత్మాగాంధీ నలుగురు కొడుకుల్లో రెండో వాడైన మణిలాల్ గాంధీ కొడుకే అరుణ్ గాంధీ. ఈయన 1934లో దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో పుట్టారు. 12 ఏళ్ల వయస్సులో భారత్‌కు వచ్చి, సేవాగ్రామ్‌లో గాంధీజీతోపాటు గడిపారు. 1948లో తిరిగి దక్షిణాఫ్రికాకు వెళ్లి, అక్కడే సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1957 ప్రాంతంలో భార్య సునందతోపాటు తిరిగి భారత్‌కు వచ్చారు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో 30 ఏళ్లపాటు జర్నలిస్ట్‌గా పనిచేశారు. పేద పిల్లలు, వలస కార్మికుల కోసం పనిచేసే అవని సంస్థతో ఈయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. 1987లో అమెరికాలోని మెంఫిస్‌లోని క్రిస్టియన్ బ్రదర్స్ వర్సిటీలో ఎంకే గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ నాన్ వయెలెన్స్‌ను ఏర్పాటు చేశారు.

పెరుగుతున్న పప్పుధాన్యాల సాగు

గతేడాది కంటే పెరిగిన విస్తీర్ణం • పెసర సాగులో వృద్ధి: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత సీజన్‌లో దేశవ్యాప్తంగా అన్ని పంటల సాగు విస్తీర్ణం గతేడాది కంటే తగ్గినా పప్పుధాన్యాల సాగు మాత్రం పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 66.02 లక్షల హెక్టార్లలో వేసవి పంటలు వేయగా, ఈసారి 65.29 లక్షల హెక్టార్లలో సాగు చేశారని వ్యవసాయ శాఖ తాజా గణాంకాల్లో పేర్కొంది. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం మాత్రం గతేడాది 16.23 లక్షల హెక్టార్లు కాగా ఈసారి 17.57 లక్షల హెక్టార్లని తెలిపింది. పెసర గతేడాది 12.83 లక్షల హెక్టార్లలో ఉండగా అనూహ్యంగా 14.27 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపింది. పెసరకు జాతీయంగా పెరిగిన డిమాండ్ దృష్ట్యానే సాగు పెరిగిందని వెల్లడించింది. మినుముల సాగు గతేడాది మాదిరే 3 లక్షల హెక్టార్ల వరకు ఉందని తెలిపింది. వేరుశెనగ, పొద్దుతిరుగుడు వంటి నూనె పంటలు గతేడాది 10.46 లక్షల హెక్టార్లలో సాగవగా ఈ ఏడాది 9.40 లక్షల హెక్టార్లకు తగ్గిందని తెలిపింది.


తిహార్ జైల్లో గ్యాంగ్‌స్టర్ హత్య

'రోహిణి కోర్టు కాల్పుల' నిందితుడిని చంపిన ప్రత్యర్థి గ్యాంగ్

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని తిహార్ జైలులో ఒక ముఠాకు చెందిన ఖైదీల దాడిలో టిల్లు తాజ్‌పురియా అలియాస్ సునీల్ మాన్ అనే గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. హైరిస్క్ వార్డులో ఉన్న టిల్లుపై ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్ యోగేశ్ అలియాస్ తుండా, అతడి అనుచరులు దీపక్ అలియాస్ టిటార్, రాజేశ్, రియాజ్ ఖాన్ దాడికి దిగారు. తమ సెల్‌కున్న ఐరన్ గ్రిల్స్‌ను కోసి టిల్లూ సెల్‌లోకి లోపలికి ప్రవేశించారు. పదునైన ఆయుధంతో ఏకంగా 92సార్లు సార్లు తీవ్రంగా పొడిచినట్టు అధికారులు తెలిపారు.

ఎవరీ టిల్లు..?

ఢిల్లీలోని అత్యంత క్రూరమైన గ్యాంగ్‌ను నడుపుతున్న వ్యక్తిగా టిల్లు గురించి చెబుతారు. 2015లో ఓ కేసులో అరెస్టయి అప్పటి నుంచి తిహార్ జైలులో ఉంటున్నాడు. ఢిల్లీకే చెందిన మరో గ్యాంగ్‌స్టర్ జితేందర్ గోగితో అతనికి చిరకాల శత్రుత్వం. 2021 సెప్టెంబర్‌లో గోగి ఢిల్లీలోని రోహిణి కోర్టులో దారుణ హత్యకు గురయ్యాడు. ఓ కేసులో విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన గోగిని లాయర్ల వేషంలో వచ్చిన ఇద్దరు టిల్లు అనుచరులు కోర్టు ఆవరణలోనే కాల్చి చంపారు. ఈ కాల్పులకు తిహార్ జైలు నుంచి టిల్లు ఫోన్‌లో ఆదేశాలిచ్చినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. ఈ ఘటనలో టిల్లు ప్రధాన నిందితుడుగా ఉన్నాడు. తాజాగా టిల్లుపై దాడి చేసిన యోగేశ్‌ను గోగి ముఠాకు చెందిన షార్ప్‌షూటర్‌గా చెబుతున్నారు. గోగి హత్యకు ప్రతీకారంగానే తాజా ఘటన చోటుచేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





ఢిల్లీలో వాప్కోస్ మాజీ చైర్మన్, ఎండీ రాజేందర్ గుప్తా ఇళ్లలో మంగళవారం సీబీఐ దాడుల్లో దొరికిన రూ.20 కోట్ల పై చిలుకు నోట్ల కట్టలివి. ఆస్తి పత్రాలు, విలువైన వస్తువులనూ స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 3 । మే । 2023

కేఫ్ లోపల ఇలా..





పల్లె వాతావరణం ప్రతిబింబించేలా

నీరా.. రా రమ్మని!

ఎన్నో పోషక విలువలకు నెలవై.. పల్లె ప్రాంతాలకే ఆలవాలమై 'నీరా'జనాలందుకుంటున్న అత్యుత్తమ పానీయం. తాటి, ఈత చెట్ల నుంచి లభించే ప్రకృతి సిద్ధమైన నీరా నగరవాసులకూ చేరువయ్యేలా రంగం సిద్ధమైంది. హుస్సేన్ సాగర్ తీరాన నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా సమీపంలో రూ.10 కోట్లతో నిర్మించిన నీరా కేఫ్ నేడు ప్రారంభం కానుంది. ఈ పానీయాన్ని ఆస్వాదించేందుకు తరలివచ్చే జనాల కోసం ప్రభుత్వం అన్ని వసతులను కల్పించింది. ఇక్కడ ఏర్పాటు చేసిన పలు చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



నీరా కేఫ్



న్యూస్‌రీల్

ఎల్లమ్మ భక్తులకు ఇక మిల్లెట్ లడ్డూ



సనత్‌నగర్: ఉత్తరాది రాష్ట్రాల్లో ... దిన కాశీకి వెళ్లిన భక్తులు అక్కడి ప్రసాదంగా మిల్లెట్ (చిరు ధాన్యాలు) లడ్డూను రుచి చూసుంటారు. ఇప్పుడా లడ్డూ బల్కంపేట ఎల్లమ్మ భక్తులకు అందుబాటులోకి రానుంది. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆహార నిపుణులతో చర్చించి అరికెలు, కొర్రలు, సామలు, ఊదలు, అండు కొర్రలతో పాటు బెల్లం, కాజు, కిస్మిస్, నెయ్యి ఉపయోగించి లడ్డూల శాంపిల్స్ తయారు చేయించారు. దేవాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు రావడమే తరువాయి.. మిల్లెట్ లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందించేందుకు బల్కంపేట ఎల్లమ్మ ఆలయ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఇక్కడి ప్రసాదాల తయారీలో ఫుడ్ క్వాలిటీ సర్టిఫికెట్‌ను కూడా అందుకున్న విషయం విదితమే.

సాఫీగా సాగేనా.. రసాభాసేనా?

నేడు జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: ఒకటి రెండు వర్షాలకే పొంగిపొర్లుతున్న నాలాలు.. నాలాలో పడి, గుంతలో పడి పిల్లల మరణాలు తదితర పరిణామాల నేపథ్యంలో బుధవారం జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశాలున్నాయి. గత సమావేశం సైతం ఎలాంటి చర్చ లేకుండానే వాదోపవాదాలు, గందరగోళాలతో అర్ధాంతరంగా ముగియడం తెలిసిందే. నాలుగు నెలల తర్వాత తిరిగి ఈ సమావేశం సైతం సాఫీగా జరగడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇటీవలి కాలంలోనే కుక్కల దాడిలో పసి బాలుడి మరణం.. అగ్ని ప్రమాదాల్లో మరణాలు వంటివి చోటు చేసుకున్నాయి. ఈ సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు లేవనెత్తే అవకాశాలున్నాయి. వీటితోపాటు దోమల స్వైర విహారం.. పారిశుద్ధ్యం.. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమాలు, వీధిదీపాలు తదితర సమస్యలపై ప్రతిపక్షపార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు మిత్రపక్షమైన ఎంఐఎం సైతం ప్రశ్నలు సంధించే అవకాశాలున్నాయి. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు సభ్యులకు పంపిన అజెండాలో పేర్కొన్నప్పటికీ, మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు మంగళవారం తెలిపారు. సమయాన్ని మార్చడంపైనా ఊహాగానాలు సాగుతున్నాయి.


17 అంశాలతో అజెండా..

అజెండాలో 17 అంశాలుండగా.. వాటిలో వివిధ పనుల కోసం అవసరమైన స్థల సేకరణలవే ఎక్కువగా ఉన్నాయి. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల ధరలతో పాటు ఇతరత్రా కొన్ని అంశాలున్నాయి. సభ్యులు చర్చ కోసం ఎన్నో ప్రశ్నలు పంపినప్పటికీ వాటిలో దాదాపు 25 ప్రశ్నల్ని మేయర్ ఎంపిక చేసినట్లు సమాచారం.

జేఎన్‌టీయూలో 10 నుంచి టెక్నికల్ ఫెస్ట్



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పీజీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు 'ఆవిష్కార్-2023' పేరుతో టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ సైదా, కో కన్వీనర్ టి.విజయలక్ష్మి, ప్రొఫెసర్ డా.ఎం. సునీతారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా జీవితంలో ఒక భాగమని, అందరూ కలసి మెలసి టెక్నికల్ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని కోరారు.



అల సందె వేళలో..

ఆకాశంలోని ఆ సూరీడు ప్రపంచానికి వెలుగులు పంచితే.. అవనిపైన ఈ హక్కుల సూరీడు బడుగుజీవుల బతుకులకు దారి దీపమయ్యాడు. మంగళవారం సాగర తీరాన.. సాయం సంధ్యవేళ భానుడు.. అంబేడ్కరుడు ఇలా కనిపించారు.

క్రమబద్ధీకరణ జాతర

సర్కారు భూముల్లో నివాస స్థలాలకు మరో అవకాశం

- ఈసారి నోటరీ ఇళ్లకు కూడా..
- త్వరలో జారీ కానున్న ప్రభుత్వ ఉత్తర్వులు

సాక్షి, సిటీబ్యూరో: సర్కారు భూముల్లోని పేదల నివాస స్థలాలు, నోటరీ ఇళ్ల క్రమబద్ధీకరణ జాతర కొనసాగనుంది. ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లకు మరో అవకాశంతో పాటు నోటరీ గృహాలను సైతం క్రమబద్ధీకరణ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రెండు రోజుల క్రితం నగర ఎమ్మెల్యేల విజ్ఞప్తితో నిబంధనల ప్రకారం స్థలాలు, ఇళ్లను క్రమబద్ధీకరించి న్యాయపరమైన హక్కులను కల్పిస్తామని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన నిరుపేదల్లో ఆశలు రేకెత్తిస్తోంది. జీఓ 58, 59ల కింద ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి మరో నెల రోజుల పాటు గడువు పొడిగింపుతో పాటు నోటరీ ఇళ్లకు కూడా అవకాశం లభించనుంది. నోటరీ నివాసాల క్రమబద్ధీకరణ వ్యవహారంలో మాత్రం స్థానిక ఎమ్మెల్యేలు కీలకంగా వ్యవహరించనున్నారు. త్వరలో జీఓ జారీ కానున్న నేపథ్యంలో నోటరీ కలిగిన కుటుంబాల్లో హడావుడి ప్రారంభమైంది.

గత పదిహేనేళ్లుగా..

- ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ పదిహేనేళ్లుగా కొనసాగుతోంది. ఇప్పటికే ఆరుసార్లు అవకాశం వచ్చింది. తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో జీఓ 166 కింద, ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు అనంతరం దశలవారీగా జీఓ 58, 59, ఆ తర్వాత దానికి అనుబంధంగా జీఓ 179, 134, గతేడాది జీఓ 14, జీఓ 29 కింద ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. తాజాగా మరోసారి గడువు పొడిగించనున్నారు.
- ప్రభుత్వం క్రమబద్ధీకరణ కోసం అవకాశం కల్పిస్తున్నప్పటికీ చాలా కుటుంబాలు సరైన ఆధారాలు లేక దరఖాస్తులు చేసుకోలేకపోయారు. కొందరు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తిరస్కరణకు గురయ్యాయి. సర్కారు అలాంటి స్థలాల కోసం గతేడాది ఆక్రమణ కాల పరిమితి సైతం 2014 జూన్ 2వ తదేఈ నుంచి 2020 జూన్2 వరకు పొడిగించింది. అయినా సద్వినియోగం చేసుకోని కుటుంబాలకు తాజాగా సీఎం ప్రకటనతో మరో అవకాశం లభించినట్లయింది.

ఇప్పటి వరకు ఇలా..

గత ఏడాది జీఓ 58, 59లకు అనుగుణంగా జారీ చేసిన 14 జీఓ కింద హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 1.14 లక్షల కుటుంబాలు తమ నివాసాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై క్షేత్రస్థాయి పరిశీలించగా 54 వేల దరఖాస్తులు అర్హత సాధించగా, మిగిలిన దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. క్రమబద్ధీకరణ ప్రక్రియ మాత్రం తుది దశకు చేరుకోకముందే రెండు నెలల క్రితం ఆక్రమణ కాల పరిమితితో పాటు గడువు పొడిగించడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు సైతం తిరస్కరణకు గురయ్యాయి. వాటికి సైతం మరోసారి దరఖాస్తులు చేసుకునేందుకు వెసులుబాటు లభించింది. తాజాగా మరో నెల రోజులు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించనున్నారు.

ఇదీ పరిస్థితి..

- హైదరాబాద్ జిల్లాలో 58, 59 జీఓ కింద 12 వేల మంది దరఖాస్తుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. గత నెలలో మరో 14,036 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో 58, 59 జీఓ కింద గతంలో 32 వేలకు పైగా దరఖాస్తుల ప్రక్రియ పెండింగ్‌లో ఉండగా గత నెలలో సుమారు 16 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.
- మేడ్చల్ జిల్లాలో గతంలో 58, 59 కింద సుమారు 21 వేల దరఖాస్తుల ప్రక్రియ పెండింగ్‌లో ఉండగా తాజాగా మరో 15 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.



హైదరాబాద్ జిల్లాలో గత నెలలో వచ్చిన క్రమబద్ధీకరణ దరఖాస్తులు

మండలం	జీఓ 58	జీఓ 59
అంబర్‌పేట	190	54
అమీర్‌పేట	76	24
ఆసిఫ్‌నగర్	2084	171
బండ్లగూడ	161	97
బహదూర్‌పురా	41	15
చార్మినార్	41	7
గోల్కొండ	149	26
హిమాయత్‌నగర్	402	42
ఖైరతాబాద్	2365	235
మారేడుపల్లి	895	29
ముషీరాబాద్	791	70
నాంపల్లి	227	118
సైదాబాద్	1245	76
సికింద్రాబాద్	787	66
షేక్‌పేట	2289	414
తిరుమలగిరి	751	114

క్రమబద్ధీకరణ రుసుం ఇలా..

- 125 గజాలలోపు స్థలాలకు ఉచిత క్రమబద్ధీకరణ
- 125 గజాల కంటే ఎక్కువ స్థలాలకు మార్కెట్ ధర లెక్కిస్తారు
- 126 నుంచి 250 గజాల వరకు రిజిస్ట్రేషన్ ధరలో 25 శాతం చెల్లించాలి
- 251 నుంచి 500 గజాలలోపు అయితే 50 శాతం
- 501 నుంచి 1000 గజాల లోపు 75 శాతం
- 1000 గజాల పైబడితే 100 శాతం (సీసీఎల్ఏ నిర్ణయం)
- వాణిజ్య అవసరాల కోసం వాడుకునే స్థలమైతే పరిమాణంతో నిమిత్తం లేకుండా రిజిస్ట్రేషన్ ధర చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. ఆస్పత్రులు, విద్యాసంస్థలు వంటి వాటిని వ్యాపార సంస్థలుగానే పరిగణిస్తారు.

లక్షపైనే నోటరీ నివాసాలు

మహా నగరంలో నోటరీ నివాసాలు లక్షపైనే ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. బస్తీలతో పాటు నగర శివార్లలో విస్తరించి ఉన్న నగర పాలక, పురపాలికల్లో పెద్ద ఎత్తున నోటరీ పత్రాలు కలిగిన నివాసాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్‌కు వీలు కాని గ్రామ కంఠం, ఇనాం, పైగా, వక్ఫ్ స్థలాలపై నిర్మాణాలు నోటరీపైనే అధికంగా ఉన్నాయి. వీటికి ఎలాంటి పూర్వ రిజిస్టర్డ్ దస్తావేజులు ఉండవు. కేవలం ఒప్పంద పత్రాలు (నోటరీ)ల ఆధారంగానే ఆస్తుల లావాదేవీలు కొనసాగుతుంటాయి. ఇలా ఖాళీ స్థలాలు కొనుగోలు చేసినవారు.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తుంటారు. ఇలాంటి నిర్మాణాలకు అధికారికంగా ఎలాంటి గుర్తింపు ఉండదు. గతంలో ప్రభుత్వం నోటరీలపై కొనుగోలు చేసిన స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేస్తే.. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ఆదాయాన్ని పెంచుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అక్రమార్కుల చేతివాటం కారణంగా ప్రక్రియ గాడి తప్పింది. దీంతో వాటి రిజిస్ట్రేషన్లకు పాత ఆస్తి పన్ను రసీదులు మూకుతాడు వేయడంతో ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. తాజాగా ఎమ్మెల్యేల విజ్ఞప్తుల మేరకు నోటరీ నివాసాలకు రిజిస్ట్రేషన్లు కంటే ముందు క్రమబద్ధీకరణకు అవకాశం లభించనుంది.

ఆడుకుంటూ వెళ్లి అనంత లోకాలకు

- ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి బాలుడి మృతి



వివేకానంద (ఫైల్)



బాలుడి మృతదేహం వద్ద రోదనలు



బాలుడిని మింగిన నీటి గుంత

బంజారాహిల్స్: ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిన బాలుడు మృతి చెందిన విషాద ఘటన మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆర్యవటం గ్రామానికి చెందిన భీంశంకర్, లవకుమారి దంపతులు కొంత కాలంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని ప్లాట్ నెం. 861లో కాపలాదారులుగా ఉంటున్నారు. వీరికి కూతురు శ్రీలలిత, కుమారుడు వివేకానంద (7) పిల్లలున్నారు. వివేకానంద మస్తాన్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వివేకానంద సహచర పిల్లలతో కలిసి పక్కనే ఉన్న ప్లాట్ నెం. 862 ఖాళీ స్థలంలో ఆడుకుంటున్నాడు. ఈ ప్లాట్‌లోని నీటిగుంత ఇటీవల కురుస్తున్న వర్షాలతో పూర్తిగా నిండిపోయింది. ఆడుకుంటున్న వివేకానంద ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. చుట్టుపక్కల పిల్లలంతా అరుస్తూ బాలుడి కుటుంబ సభ్యులకు చెప్పారు. అంతా కలిసి గుంత దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే వివేకానంద అప్పటికే విగతజీవిగా మారాడు. కుమారుడు కళ్లముందే అసువులు బాయడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అప్పటిదాకా ఆడుతూ పాడుతూ కనిపించిన బాలుడు నీటిగుంతకు బలికావడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు పోస్టుమార్టం అవసరం లేదని పోలీసులను అడ్డుకున్నారు. తీవ్ర వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు నచ్చజెప్పి బాలుడి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన బోడుప్పల్ విద్యుత్ ఏఈ

రూ.10 వేలు లంచం తీసుకుంటూ..



విద్యుత్ ఏఈ ప్రసాద్‌బాబు

బోడుప్పల్: విద్యుత్ ప్యానెల్ బోర్డు మంజూరు కోసం అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రసాద్‌బాబు ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి సఫిల్‌గూడలో నివసిస్తున్న ప్రసాద్‌బాబు చిలుకానగర్ (బోడుప్పల్) విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరుగా రెండేళ్లుగా పని చేస్తున్నాడు. బోడుప్పల్ ఇందిరానగర్‌కు చెందిన మామిళ్ల నవీన్‌కుమార్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. కొత్తగా నిర్మించే అపార్టుమెంట్ల వద్ద ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ తీసుకుని విద్యుత్ మీటర్ల నుంచి వైరింగ్ పని చేస్తుంటాడు. బాలాజీ హిల్స్ కాలనీలో నిర్మిస్తున్న ఓ అపార్టుమెంట్‌ను కాంట్రాక్ట్ తీసుకున్నాడు. విద్యుత్ మీటర్ల ప్యానెల్ బోర్డు కోసం నవీన్‌కుమార్ దరఖాస్తు చేశాడు. ఏఈ ప్రసాద్‌బాబు వాటిని మంజూరు చేసేందుకు రూ.10 వేలు డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో నవీన్‌కుమార్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మంగళవారం ఉదయం నవీన్‌కుమార్ ఏఈ ప్రసాద్‌బాబును కలవగా అతని కింద పని చేసే లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు డబ్బులు ఇవ్వాలని చెప్పాడు. శ్రీనివాస్ వద్దకు వెళ్లి డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించగా అతను ఏఈ ప్రసాద్ బాబు వద్ద పని చేసే ప్రైవేట్ వ్యక్తి గౌతమ్‌కు ఇవ్వాలని చెప్పాడు. ఉదయం 11 గంటలకు బోడుప్పల్ విద్యుత్ కార్యాలయంలో నవీన్‌కుమార్ రూ.5 వేలు లంచంగా గౌతమ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గౌతమ్ వద్ద పట్టుకున్న రూ.5 వేలతో పాటు నవీన్‌కుమార్ వద్ద ఉన్న మరో రూ.5 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏఈ ప్రసాద్‌బాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ గౌతమ్‌ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వారిని విచారించారు. మల్కాజిగిరిలోని ప్రసాద్‌రాబాబు ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, ఆజాద్, జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వనిదే ఏ పనీ కాదు..

ఏఈ ప్రసాద్‌బాబు డబ్బులు ఇవ్వనిదే పనులు చేసేవాడు కాదని.. ఈ పరిస్థితిని చూసే చాలా మంది ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు పనులు మానుకున్నారని మేడ్చల్ జిల్లా 'ఏ' గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ప్రైవేట్ వ్యక్తిని అసిస్టెంట్‌గా పెట్టుకుని ప్రతి పనికీ డబ్బులు వసూలు చేస్తున్నారని, ఏఈ ప్రసాద్‌బాబు వేధింపులు తట్టుకోలేక పలువురు కాంట్రాక్ట్ పనులు మానుకున్నట్లు ఆయన చెప్పారు.



రకుల్



ఆధ్యాత్మిక చికిత్సతో సెల్ఫ్ హీలింగ్

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక స్వయం స్వస్థత (సెల్ఫ్ హీలింగ్) అవసరమని సినీ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. జూబ్లీహిల్స్ వేదికగా హీలింగ్ సెంటర్ 'సాక్రెడ్ పాత్స్'ను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమాన్ని మంగళవారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మైస్కేప్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సినీనటి రకుల్‌ప్రీత్ సింగ్, కొణిదెల సురేఖ, సుస్మిత, నటి మంచు లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సాక్రెడ్ పాత్స్' వ్యవస్థాపకురాలు ఉష మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక- పవిత్రమైన మార్గాలు స్వీయ స్వస్థతను, మానసిక అంతర్గత ఆలోచనలను క్రమబద్ధీకరిస్తాయన్నారు. సెల్ఫ్ హీలింగ్ వైద్య బోధనాశాస్త్రం దశాబ్దాల పూర్వీకుల అధ్యయనాల నుంచి సంగ్రహించిందని ఆమె పేర్కొన్నారు. మానసిక స్వస్థతకు అనువైన వైద్యవిధానాలు అవసరమని రకుల్‌ప్రీత్ సింగ్ చెప్పారు. ఉషా స్వశక్తి స్వీయ- సాధికారత క్యాప్సూల్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ సంగీత మాంత్రికులు షమ్మం విర్మాణి, శ్రీవర్ధ మిత్రుండే సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. - సాక్షి, సిటీబ్యూరో

సందడిగా.. సరదాగా..

- ఓక్రిడ్జ్ స్కూల్‌ను సందర్శించిన ముత్తయ్య మురళీధరన్, డేల్ స్టెయిన్



దిగ్గజ క్రికెటర్లకు బ్యాట్‌లు పైకెత్తి స్వాగతం పలుకుతున్న ఓక్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ బిర్యానీ అంటే తనకెంతో ఇష్టమని సన్ రైజర్స్ స్ట్రాటజిక్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ పేర్కొన్నారు. ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలను మంగళవారం ముత్తయ్య మురళీధరన్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ డేల్ స్టెయిన్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులతో సరదాగా ఫొటోలు దిగారు. 'తనకు తెలుగు రాకపోయినా ఆ భాషా చిత్రాలు చూస్తుంటానన్నారు. తెలుగులో తన ఫేవరెట్ మూవీ 'బాహుబలి' అని ముత్తయ్య మురళీధరన్ చెప్పారు. విద్యార్థులు అడిగిన ఓ ప్రశ్నకు తాను తమిళం, మళయాల భాషలను అనర్గళంగా మాట్లాడతానని సమాధానం చెప్పారు. డేల్ స్టెయిన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా పట్టుదల, కృషిని కొనసాగిస్తే భవిష్యత్తులో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. తన జీవితంలో క్రికెటర్‌గా గుర్తింపు పొందేందుకు పడిన కష్టాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. అంతకుముందు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ క్రిష్ణ ఫర్ షార్ట్, ప్రిన్సిపల్ దీపికారావుతో వారు సమావేశమయ్యారు.

చక్రధర్.. నీకు రాజకీయ యోగం ఉంది!

గతంలో 'జాబ్స్ మోసగాడి'తో చెప్పిన ఓ స్వామీజీ

- అప్పటి నుంచే సిద్దిపేట నియోజకవర్గంపై చక్రధర్ దృష్టి
- సామాజిక సేవలకు అవసరమైన డబ్బు కోసం చీటింగ్స్
- టెలీకాలర్ల కోసం ఏపీ, తమిళనాడు నుంచి సిమ్‌కార్డులు
- వెలుగులోకి వస్తున్న ఘరానా మోసగాడి వ్యవహారాలు



సాక్షి, సిటీబ్యూరో: డేటా ఎంట్రీ సహా అనేక పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో వేల మందికి ఎరవేసి, బోగస్ ఇంటర్వ్యూలూ చేసి, ఒక్కొక్కరి నుంచి రూ.2500 చొప్పున వసూలు చేసి మోసం చేసిన కేసులో అరెస్టు అయిన చక్రధర్ గౌడ్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతడిని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత వారం పట్టుకున్న విషయం విదితమే. ఇప్పటి వరకు చక్రధర్ అమాయకుల నుంచి కాజేసిన మొత్తం రూ.50 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

మోసపోయి అదే బాటలో...

సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత ఓ బ్యాంక్‌లో ఒప్పంద ఉద్యోగిగా పని చేశాడు. అప్పట్లో ఓ స్వామీజీని కలిసిన ఇతడికి ఆయన నుంచి 'తన భవిష్యత్తు' తెలిసింది. 'చక్రధర్... నీకు రాజకీయ యోగం ఉంది. ఎప్పటికైనా ఎమ్మెల్యే అవుతావు' అంటూ ఆయన చెప్పడంతో ఆ ధ్యాసలో పడ్డాడు. తన సొంత నియోజకవర్గమైన సిద్దిపేట పైనే దృష్టి పెట్టాడు. ఇదిలా ఉండగా.. ఓ కాల్ సెంటర్ నుంచి ఫోన్ అందుకున్న ఇతగాడు పార్ట్ టైమ్ జాబ్ వల్లో పడ్డాడు. అవతలి వాళ్లు చెప్పిన మాట విని రూ.1.5 లక్షలు చెల్లించి మోసపోయాడు. రాజకీయంగా తాను నిలదొక్కుకోవాలంటే సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు భారీగా డబ్బు ఖర్చు పెటాల్సి ఉందని భావించాడు. ఆ డబ్బు కోసం తానూ కాల్ సెంటర్ దందా చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఎక్కడా ఉనికి బయటపడకుండా...

పంజగుట్ట ప్రాంతంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసిన చక్రధర్ అడుగడుగునా తన తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద యువకులను ఇన్‌ఫ్ల్యూయన్సర్స్‌గా పిలిచే టెలీకాలర్లను నియమించుకున్నాడు. వీరితో అనేక మందికి ఫోన్లు చేయిస్తూ డేటా ఎంట్రీ సహా పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.2500 చొప్పున కాజేశాడు. ఎక్కువ మొత్తం కాజేస్తే ఫిర్యాదు చేస్తారనే ఉద్దేశంతో చిన్న మొత్తాలను టార్గెట్ చేశాడు. ఆ మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో కాకుండా వివిధ వ్యాలెట్స్‌లో జమ చేయించాడు. వ్యాలెట్స్ నుంచి డబ్బును బదిలీ చేయడానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏడు పెట్రోల్ బంకులతో ఒప్పందం చేసుకున్నాడు. వారికి 3 శాతం కమీషన్ ఇచ్చి నగదు రూపంలో తీసుకునే వాడు. ఈ డబ్బును ఇన్‌ఫ్ల్యూయన్సర్స్‌కే ఇచ్చి వారితోనే ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ ఖాతాలోకి డిపాజిట్ చేయించేవాడు.

ఆ మొత్తాలను విరాళాలుగా చూపి...

ఒక్కో ఉద్యోగి నుంచి రూ.50 వేలు లేదా రూ.లక్ష డిపాజిట్ చేయించే వాడు. అలా వచ్చిన మొత్తాలే తన ఫౌండేషన్ విరాళాలుగా చూపేవాడు. ఈ మొత్తాలనే వినియోగించి సిద్ధిపేటలోని అనేక ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు, రైతులకు ఆదుకునే పథకాలు చేపట్టాడు. కొన్ని ఫోన్ నెంబర్లను టార్గెట్‌గా చేసుకున్న తర్వాత గరిష్ఠంగా 45 రోజుల్లో వారి నుంచి డబ్బు కాజేసేస్తాడు. ఆపై ఆ సిమ్‌కార్డులన్నీ ధ్వంసం చేసేలా ఆధారాలు లేకుండా చూసుకుంటాడు. ఇతగాడు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంతో పాటు తమిళనాడు నుంచి ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు సేకరిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. ఒక్కోటి రూ.1000 చొప్పున ఖరీదు చేస్తున్నట్లు చెప్తున్నారు. ఈ కేసులో లోతుగా విచారించడానికి చక్రధర్ గౌడ్‌ను తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించిన పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

బార్‌లో బెట్టింగ్.. ఐదుగురు అరెస్టు



బెట్టింగ్ నిర్వహిస్తూ పట్టుబడిన నిందితులు

ముషీరాబాద్: పార్సిగుట్ట చౌరస్తాలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.18,980 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసనగర్‌లోని స్కందగిరి సమీపంలో నివసిస్తున్న పానుగంటి కృష్ణకుమార్, పార్సిగుట్ట మధురానగర్‌లోని ఎస్‌ఆర్ హాస్పటల్ సమీపంలో కూరగాయల వ్యాపారం చేసే ఆవుల ఐలయ్య, బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్యనగర్‌లో నివసించే వై.నరేష్, ఇదే ప్రాంతానికి చెందిన బొమ్మెన రమేష్, న్యూ నల్లకుంటలో నివసిస్తూ కొరియర్ బాయ్‌గా పని చేసే కె.నరేష్‌లు బెంగళూర్, లక్నో మధ్య జరిగిన ఐపీఎల్ టి–20 మ్యాచ్‌లో ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోని బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బార్ అండ్ రెస్టారెంట్‌పై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసులమని బెదిరించి సెల్‌ఫోన్ల చోరీ

ఇద్దరు నూడో పోలీసుల అరెస్ట్



ఓరుగంటి నరేష్



శివసాయి గణేష్

బంజారాహిల్స్: నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు యువకులను తాము పోలీసులమంటూ బెదిరించి బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని..ఎస్‌ఆర్ నగర్ ప్రాంతంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి సెల్‌ఫోన్లు తస్కరించిన ఇద్దరు నూడో పోలీసులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపిన వివరాల ప్రకారం...శ్యాంలాల్ కుంటకు చెందిన ఓరుగంటి నరేష్ ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన శివసాయి గణేష్ వాటర్ సరఫరా వ్యాపారం చేస్తుంటాడు. వీరిద్దరూ గత నెల 30వ తేదీన తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని కేబీఆర్ పార్కు సమీపంలో దారికాచి వెస్ట్‌బెంగాల్‌కు చెందిన కౌస్తర్‌ఘోష్, బిశ్వనాథ్ ఘోష్‌లను ఆపారు. ఇంత అర్ధరాత్రి ఎక్కడికి వెళ్లి వస్తున్నారని బెదిరించి మీపై అనుమానం ఉంది..పోలీస్ స్టేషన్‌కు పదండి అంటూ హెచ్చరించారు. అయితే వీరిద్దరూ వినిపించుకోకపోవడంతో కొట్టి బలవంతంగా తమ బైక్‌పై ఎక్కించుకున్నారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు పక్కన ఆపి వీరిద్దరిని తీవ్రంగా కొట్టారు. ఇద్దరి సెల్‌ఫోన్లు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. బాధితులు అదే రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి ఎస్‌ఆర్‌నగర్ ఘటన జరిగిన ప్రాంతంలో ఓ సీసీ ఫుటేజీలో నరేష్ ముఖచిత్రాన్ని స్పష్టంగా గమనించారు. ఈ ఫొటో ఆధారంగా స్థానికంగా వాకబుచేయగా నిందితుడు పట్టుబడ్డాడు. గతంలోనే వీరిద్దరి మీద కేసులు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. గణేష్ మీద గంజాయి కేసు, నరేష్ మీద రాత్రిపూట తాళాలు పగలగొట్టి ఇళ్లల్లో చోరీ చేసే కేసు నమోదై ఉన్నాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

పేదల నడ్డివిరుస్తున్న మోదీ సర్కార్

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ

బంజారాహిల్స్: ప్రపంచంలో ఏ దేశంలో కూడా కార్పొరేట్లకు పన్నులు తగ్గించి పేదలపై పన్నులు పెంచలేదని, ఒక్క భారతదేశంలో మాత్రమే మోదీ సర్కారు ఇలా చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం దేశ్‌కి బచావో మోదీకి హటావో కార్యక్రమంలో భాగంగా పంజగుట్ట నుంచి పంజగుట్ట హిందూ శ్మశాన వాటిక వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ వైఫల్యాన్నల ఎండగడుతూ ముద్రించిన కరపత్రాలను పంచి పెట్టారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ దేశంలో కటిక పేద వారిని సైతం మోదీ సర్కార్ వదలడం లేదని అన్నారు. శ్మశాన వాటికలను కూడా కార్పొరేట్ పరం చేసి తరతరాలుగా కాటికాపరి వృత్తి చేసుకునే వారి నోట్లో మట్టి కొట్టే కుట్రలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. శ్మశాన వాటికల్లో పనిచేసే వారి ఉద్యోగాలకు ఎసరుపెట్టే కుట్రలను తిప్పకొడతామని హెచ్చరించారు. నగరంలో 4 వేల మందికి పైగా కాటికాపరులు ఈ వృత్తిపై ఆధారపడి పని చేస్తున్నారని, అభివృద్ధి, సుందరీకరణ పేరుతో రాష్ట ప్రభుత్వం శ్మశాన వాటికలను అభివృద్ధి చేసి కార్పొరేట్ పరం చేయకుండా కాటికాపరుల డిమాండ్లను, హక్కులను రాష్ట్ర ప్రభుత్వం ముందు పెడతామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికల్లో పని చేస్తున్న వారి సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాటికాపరుల వృత్తిదారుల అధ్యక్షుడు మన్నె శ్రీధర్, మహేష్ ఫిరోజీ, ప్రభాకర్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



సీఎంకు ఆహ్వానం

కోకాపేటలో నిర్మించనున్న 'హరే కృష్ణ' హెరిటేజ్ టవర్ భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ...మంగళవారం సెక్రటేరియట్‌లో సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రికను అందజేసిన 'హరే కృష్ణ మూమెంట్' తెలంగాణ శాఖ అధ్యక్షుడు శ్రీ సత్య గౌరచంద్ర దాస ప్రభుజీ తదితరులు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్ రెడ్డి ఉన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.వెయ్యి వేతనం పెంచడం పట్ల నగరవ్యాప్తంగా కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం పలుచోట్ల కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కొన్నిచోట్ల కృతజ్ఞత సభలు నిర్వహించారు. సికింద్రాబాద్‌లో పరిధిలోని ఐడీహెచ్ కాలనీలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

'ఎన్నికలకు తొందరేం లేదు'

హెచ్‌సీఏ వ్యవహారాలపై దుర్గాప్రసాద్ వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు నిర్వహించేందుకు సుప్రీంకోర్టు ఎలాంటి డెడ్‌లైన్ విధించలేదని, అన్ని అంశాలు పరిశీలించిన తర్వాతే దానిపై దృష్టి పెడతామని మాజీ ఐపీఎస్ అధికారి కె.దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మీడియా సమావేశంలో హెచ్‌సీఏ సీఈఓ సునీల్ కాంటేతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎన్నికలు ఫలానా తేదీలోగా జరపాలని సుప్రీంకోర్టు ఎలాంటి గడువును ఎల్.నాగేశ్వరరావుకు విధించలేదు. మాకు తగినంత సమాచారం కావాల్సి ఉంది. దీని గురించి ఇప్పటికే హెచ్‌సీఏ క్లబ్ కార్యదర్శులను అడిగాం. చాలా మంది వివరాలు అందించగా, మరికొందరు గడువు కోరారు. మే 10 వరకు వారికి అవకాశం ఇస్తున్నాం. ఆ తర్వాత సాధ్యమైనంత తొందరగా ఎన్నికలు జరిపేందుకు ప్రయత్నిస్తాం. నాగేశ్వరరావుతోపాటు మేమందరం కూడా సమస్యలను పరిష్కరించి హైదరాబాద్ క్రికెట్ గౌరవాన్ని పెంచే ప్రయత్నమే చేస్తున్నాం. అన్నీ చక్కబెట్టి అప్పగిస్తే హైదరాబాద్ క్రికెట్‌లు మేలు కలుగుతుంది' అని దుర్గాప్రసాద్ అన్నారు. మరోవైపు గతంలో అర్ధాంతరంగా రద్దు చేసిన హెచ్‌సీఏ అకాడమీని పునరుద్ధరిస్తున్నట్లు సీఈఓ సునీల్ కాంటే ప్రకటించారు. దీనికి మాజీ క్రికెటర్ విజయ్ మోహన్‌రాజ్‌ను డైరెక్టర్‌గా ఎంపిక చేశామని... ఇతర సహాయక సిబ్బంది వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

రెట్టింపు నగదు ఆశ చూపి..

- రూ.31 లక్షల 60 వేలు స్వాహా
- సైబర్ వలలో చిక్కిన ఇద్దరు బాధితులు

పటాన్‌చెరు టౌన్: రెట్టింపు నగదు ఇస్తామని ఆశ చూపి ఆన్‌లైన్‌లో ఇద్దరి నుంచి పెద్ద ఎత్తున నగదు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఏప్రిల్ 20వ తేదీన వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. ఇందులో పెట్టుబడి పెట్టి టాస్క్ పూర్తి చేస్తే రెట్టింపు నగదు ఇస్తామని ఆశచూపారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఏడు రోజుల పాటు రూ.30 లక్షల వరకూ పెట్టుబడి పెడుతూ వచ్చాడు. ఇచ్చిన టాస్క్‌లన్నీ పూర్తి చేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని సదరు బాధితుడు కోరాడు. ఆ వ్యక్తులనుంచి ఎలాంటి స్పందన రాలేదు. వెంటనే బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో...

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఏప్రిల్ 15న తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు 16వ తేదీన వివరాలు నమోదు చేసి రూ.1,60,000 చెల్లించాడు. ఇచ్చిన టాస్కులు పూర్తి చేసి తిరిగి నగదు చెల్లించమని అడగ్గా ఎవరూ స్పందించలేదు. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరువురి ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

గోల్కొండ: అక్రమంగా కొనసాగుతున్న ఓ హుక్కా సెంటర్‌పై పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. డీసీపీ పి.రాధాకిషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం...గోల్కొండ సాత్‌గల్లీలో మీర్జా ఇబ్రహీం అహ్మద్ (23), 'ద పాన్ హౌస్ ఎన్.మోర్ పేరిట పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అయితే ఇందులో అక్రమంగా హుక్కా సెంటర్ కూడా నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖలీల్ పాషా ఆధ్వర్యంలో పాన్ హౌస్‌పై దాడి చేసి 7 హుక్కా కుండలు, 10 చిలం హుక్కాలు, 19 హుక్కా పైపులు, రెండు హుక్కా హీటర్లు, వందలాది ఫ్లేవర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుంది. ఈ మేరకు మీర్జా ఇబ్రహీం అహ్మద్, అతని అసిస్టెంట్ మహ్మద్ వాజిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా మరో భాగస్వామి మీర్జా ఫుర్ఖాన్‌బేగ్ పరారీలో ఉన్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను గోల్కొండ పోలీసులకు అప్పగించారు.

తప్పిపోయిన చిన్నారి.. తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసులు



కాప్రా: మూడేళ్ల ఓ చిన్నారి తప్పిపోయి..తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరిన సంఘటన కుషాయిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చర్లపల్లి డివిజన్ వాసవి శివానగర్‌లోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో మంగళవారం సాయంత్రం ఓ చిన్నారి ఏడుస్తూ రోడ్డుపక్కన ఉంది. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఆ చిన్నారిని చూసి ఆగారు. ఏడుస్తున్న చిన్నారిని బుజ్జగించారు. వివరాలు అడిగే ప్రయత్నం చేయగా పాప పేరు హబి అని చెప్పింది. తండ్రి తుహాన్, తల్లి పేరు పూజ అని చెప్పింది. స్థానికంగా విచారించగా తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిందని తెలుసుకుని చిన్నారిని పోలీసులు అక్కున చేర్చుకున్నారు. ఓ వైపు చిన్నారిని ఓదారుస్తూనే మరో వైపు తల్లిదండ్రుల ఆచూకీ కోసం విచారించారు. చివరకు ఆచూకీ తెలుసుకుని చిన్నారి హబిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. కూతురు తప్పిపోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లారు. చిన్నారి కోసం గల్లీ గల్లీ జల్లెడపట్టారు. ఈ క్రమంలో పోలీసుల వద్ద క్షేమంగా ఉందని తెలుసుకుని పరుగులు తీశారు. తప్పిపోయిన తమ చిన్నారిని క్షేమంగా తమ వద్ద చేర్చిన పోలీసులకు తల్లిదండ్రులు తుహాన్, పూజ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల విషయంలో కాస్త జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన మలక్‌పేట మార్కెట్ గ్రేడ్–1 కార్యదర్శి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–1 కార్యదర్శిగా చిలకా నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బాటసింగారం మార్కెట్‌లో గ్రేడ్–3 కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై మలక్‌పేట మార్కెట్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌కు వచ్చే రైతుల సంక్షేమానికి కృసి చేస్తానన్నారు. పదోన్నతిపై బదిలీ అయి వచ్చిన ఆయనను మార్కెట్ సిబ్బంది అభినందించారు.

5వ తేదీ నుంచి 12 వరకు నాయిని మెమోరియల్ క్రికెట్ టోర్నీ

కవాడిగూడ: మాజీ మంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని మే 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఎన్‌టీఆర్ స్టేడియంలో నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ క్రికెట్ లీగ్–2 నిర్వహిస్తున్నట్లు రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు ఆయన మంగళవారం బీఆర్‌ఎస్ నేతలతో కలిసి క్రీడామైదానాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ట్లాడుతూ నాయిని నర్సింహారెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. గత సంవత్సరం ఎన్‌టీఆర్ స్టేడియంలోనే నాయిని మెమోరియల్ క్రికెట్ లీగ్–1 పోటీలు నిర్వహించామన్నారు. ఈసారి టోర్నీని విజయవంతం చేయాలని కోరారు. 12వ తేదీన నాయిని జయంతి సందర్భంగా జరగబోయే ఫైనల్ పోటీల్లో విజేతలకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాలుపంచుకోవాలనే వారు వివరాల కోసం 8801885570, 9866666718 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చాక్లెట్లలో బంగారం

ఇద్దరు ప్రయాణికుల నుంచి రూ.16 లక్షలు విలువ చేసే బంగారం స్వాధీనం



చాక్లెట్లలో దాచి తీసుకొచ్చిన బంగారం

శంషాబాద్: బంగారం అక్రమ రవాణాలో అక్రమార్కులు కొత్త పుంతలు తొక్కుతూనే ఉన్నారు. తాజాగా ఓ ఇద్దరు ప్రయాణికులు చాక్లెట్లలో దాచుకుని తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం ఇద్దరు ప్రయాణికులు ఈకే–526 విమానంలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వారి వద్ద ఉన్న వస్తువులను పరిశీలించిన అధికారులు లగేజీలో ఉన్న చాక్లెట్లను కూడా విప్పి చూశారు. అందులో మొత్తం 13 ముక్కలుగా ఉన్న బంగారాన్ని బయటికి తీశారు. మొత్తం 269 గ్రాముల బరువు కలిగిన బంగారం విలువ 16.5 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తమా..అలర్ట్ ప్లీజ్!



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 339 మిలియన్ల మంది ఆస్తమా బారిన పడ్డారని, 2025 నాటికి ఈ సంఖ్య 400 మిలియన్లకు పెరుగనుందని ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్ తెలిపారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఉబ్బసం ప్రతి సంవత్సరం సుమారు 250,000 మరణాలకు కారణమవుతోందని, ఇది ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోందని అన్నారు. వ్యాధి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆస్తమా దినోత్సవం ఒక సున్నితమైన హెచ్చరికగా పనిచేస్తుందని అన్నారు. ఈ ఏడాది థీమ్ 'అందరికీ ఆస్తమా సంరక్షణ' పైన అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముందని, దీని బారినుంచి సంరక్షణ విధానాలను, జాగ్రత్తలను, నివారణా చర్యలను సమాజానికి చేరువ చేయాలని సూచించారు. కార్టికోస్టెరాయిడ్స్‌తో సాధారణ చికిత్సను అందించవచ్చని, ఉబ్బసం పెంచే అంశాలలో ధూమపానం, పర్యావరణ కాలుష్యం కీలకంగా మారాయన్నారు. ఆరోగ్యకరమైన ఊపిరితిత్తుల పోర్టల్ (www.thehealthylungs.com) లో విశ్వసనీయ సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు.

ఆర్టీసీ కళాభవన్‌తో సుచిరిండియా లీజు రద్దు

ముషీరాబాద్: అద్దె బకాయిలు సకాలంలో చెల్లించని కారణంగా సుచిరిండియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేసుకున్న ఆర్టీసీ కళాభవన్ అద్దె కాంట్రాక్టును తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రద్దు చేసినట్లు టీఎస్‌ఆర్టీసీ పీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు. భవన సముదాయం పూర్తిగా ఆర్టీసీ ఆధీనంలోకి తీసుకుందని, ఈ కళాభవన్‌లో ఇప్పటికే వివాహ శుభకార్యాలకు బుకింగ్ చేసుకున్న వారు టీఎస్ ఆర్టీసీకి చెందిన కోఠి కమ్యూనికేషన్ సెల్ నెంబర్ 99592 26160ను సంప్రదించాలని కోరారు. పని సమయాల్లో ఆర్టీసీ కళ్యాణ మండప కార్యాలయంలోనూ సంప్రదించవచ్చునని పీఆర్వో పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేసింది ఈమేరకు అసోసియేషన్ నేతలు మంగళవారం మంత్రి నివాస గృహంలో కలిసి ఆమెకు వినతి పత్రాన్ని అందించారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సబితా రెడ్డి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా తెలిపారు.

క్లుప్తంగా...

15న మాతృమూర్తుల దినోత్సవం

లిబర్టీ: అంతర్జాతీయ మాతృమూర్తుల దినోత్సవం ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాతృమూర్తుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ మాతృమూర్తులకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎల్‌బీ స్టేడియంలో రేపు నేషనల్ ప్రేయర్ డే

పంజగుట్ట: ఈ నెల 4వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో నేషనల్ ప్రేయర్ డే నిర్వహిస్తున్నట్లు ఆలిండియా దళిత, క్రైస్తవ సంఘాల సమాఖ్య సెక్రటరీ జెరుషలేము మత్తయ్య అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..ఏడేళ్లుగా ఈ కార్యక్రమానికి సీఎం రావడం లేదని.. ఈ సంవత్సరం రాకపోతే ఎల్‌బీ స్టేడియం నుంచి నేరుగా ప్రగతిభవన్‌కు వచ్చి అక్కడ ప్రేయర్ చేస్తామని హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి క్రిస్టియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని ప్రస్తుతానికి దానికి చైర్మన్ లేదని వెంటనే పూర్తి కార్యవర్గం ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో పాస్టర్ కె.శిఖామణి, ఆనంద్, అమృత్, పి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జిజ్ఞాస'



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న దృశ్యం

పంజగుట్ట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల స్టడీ ప్రాజెక్ట్, ప్రజెంటేషన్ కార్యక్రమం మంగళవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రారంభమైంది. జిజ్ఞాస పేరుతో జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు హిస్టరీ (చరిత్ర), ఎకనామిక్స్ (అర్థశాస్త్రం) లో ప్రాజెక్టులు చేసి తమతమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రాజెక్టు చేసిన కాలేజీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, రాష్ట్రస్థాయి బహుమతులు ఉన్నత విద్యాశాఖ తరపున అందచేయనున్నట్లు ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.యాదగిరి తెలిపారు.

ఎన్‌ఎస్‌యూఐ నేతల అరెస్ట్

బంజారాహిల్స్: అనుమతులు లేకుండా యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన శ్రీనిధి, గురునానక్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాశాఖామంత్రి సబితా ఇంద్రారెడ్డి నివాస ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం వెంకట్‌తో పాటు ఎన్‌ఎస్‌యూఐ నేతలు పెద్ద సంఖ్యలో శ్రీనగర్ కాలనీలోని సబితా ఇంద్రారెడ్డి వద్ద నినాదాలు చేస్తూ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు వీరందరినీ అరెస్ట్ చేసి గోషామహల్‌కు తరలించారు. తాము విద్యాశాఖామంత్రికి వినతి పత్రాన్ని ఇచ్చేందుకు వచ్చామని తమను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ వీరు ఆరోపించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హనుమాన్ దేవాలయంలో శ్రీ శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పూజా కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం రుద్ర, చండీ, సుబ్రహ్మణ్య సహిత హోమాలు, ధాన్యాధివాసం, సాయంత్రం ఫల, పుష్ప శయ్యాధివాసం వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు.

మణిరత్నం సినిమాలు-స్త్రీ పాత్రలపై చర్చాగోష్టి

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశ మందిరంలో మణిరత్నం సినిమాలు– స్త్రీ పాత్రలు అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. విద్యార్థి ఏపీ.అరవింద్ అధ్యక్షతన జరిగిన సభకు ప్రధాన వక్తగా ప్రముఖ రచయిత్రి వోల్గా హాజరై ప్రసంగించారు. మణిరత్నం చాలా గొప్ప దర్శకులని ప్రశంసించారు. రోజా, బొంబాయి వంటి సినిమాలలో మణిరత్నం సరైన న్యాయం చేయలేదన్నారు. కథ పరంగా పరిమితులకు లోబడి ఉన్నాయని అన్నారు. స్త్రీలను అందంగా చిత్రించడంలో గొప్పగా ఉన్న పటికిని కథలలోని తిరుగుబాటు తనంలో పరిమితులు ఉన్నాయన్నారు. సినిమా గీత రచయిత్రి పింగళి చైతన్య మాట్లాడుతూ.. నేడు ఎదుర్కొంటున్న పిల్లలలో ఆటిజంపై 30 ఏళ్ల క్రితమే అంజలి సినిమా తీశారన్నారు.

పెంచిన జీతాలతో 1093 మందికి లబ్ధి

- ఆనందం వ్యక్తం చేస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు
- వాడవాడలా కేసీఆర్‌కు పాలాభిషేకాలు



ఖైరతాబాద్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల జీతాలు రూ.1000 పెంచుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని 1093 మంది కార్మికులకు లబ్ధి చేకూర్చింది. స్వీపర్లు, కామాటీలు, ఎస్‌ఎఫ్‌ఏలతో పాటు ఎంటమాలజీ విభాగం సిబ్బందికి కూడా పెంచిన జీతాలతో బతుకులు కొంత మెరుగయ్యాయి. ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న జీతాల పెంపు మే 1వ తేదీ నుంచి సీఎం ప్రకటనతో అమల్లోకి వచ్చినట్లయింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–17, సర్కిల్–18 పరిధిలోని ఆరు డివిజన్ల పరిధిలో స్వీపర్లు ఈ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వాడవాడలా సీఎం చిత్రపటానికి పారిశుద్ధ్య కార్మికులు పాలాభిషేకం చేశారు. ఖైరతాబాద్, సోమాజిగూడ, వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో స్వీపర్లు ఈ ప్రకటనతో మిఠాయిలు పంచుకున్నారు. ఎన్నో ఏళ్ళుగా పని చేస్తున్న వీరందరూ కష్టనష్టాలకోర్చి రేయింబవళ్లు పారిశుద్ధ్య విభాగంలో రెక్కలు ముక్కలు చేసుకున్నారు.

500 జీతం నుంచి పని చేస్తున్నా



గత 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తున్నాను. మొదట్లో నా జీతం రూ. 500. ఏనాడూ ఈ పని నాకొద్దనుకోలేదు. ఎప్పటికైనా జీతాలు పెరుగుతాయనే ఆశతో పని చేస్తున్నాను. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మా జీతాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు తాజాగా ఇంకో వెయ్యి పెంచుతూ సీఎం తీసుకున్న నిర్ణయాన్ని మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. – దానమ్మ

ఊహించలేదు



ఒకేసారి రూ.1000 జీతం పెంచుతారని ఊహించలేదు. నేను గత 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తున్నాను. ప్రతియేటా జీతాలు పెంచాలని మేం కోరుతున్న నేపథ్యంలో ఈ సర్కారు వచ్చాక భారీగా జీతాలు పెరిగాయి. ఇప్పుడు ఏకంగా వెయ్యి పెంచారు. ఈ పెంపు వల్ల మాకు కొంత ఖర్చు తగ్గుముఖం పడుతుంది. – అంజమ్మ

నా ఫిట్‌నెస్‌కు కారణం మార్షల్ ఆర్ట్స్

సినీ నటుడు సుమన్



జాతీయ స్థాయి కరాటే పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న సుమన్ తదితరులు

పంజగుట్ట: తాను 10 భాషల్లో 700 వరకు సినిమాలు చేశానని, 45 సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నానని ఇప్పటికీ మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉన్నానంటే అది మార్షల్ ఆర్ట్స్ వల్లే అని సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు. వన్మయి షోటోకాన్ కరాటే అండ్ కుంగ్‌ఫూ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న 33వ జాతీయస్థాయి కరాటే, కుంగ్ఫూ చాంపియన్ షిప్ –2023 కరపత్రాన్ని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అకాడమీ వ్యవస్థాపకులు గ్రాండ్‌మాస్టర్ సి.రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ .. తాను 12 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు మార్షల్ ఆర్ట్స్‌కు వెళ్లానని 50 సంవత్సరాలుగా నిత్యం మార్షల్ ఆర్ట్స్ చేస్తూనే ఉన్నానని అందుకే ఇప్పటికీ ప్రతీ రోజు 11 గంటలు ఎండ, వాన అని లేకుండా పనిచేయగలుగుతున్నానన్నారు.

దొరికిన ఆటో.. యువకుడు హ్యాపీ



ఆటోతో సెల్ఫీ దిగుతున్న యువకుడు

బంజారాహిల్స్: పోగొట్టుకున్న ఆటో దొరకడంతో ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లో ఆటో తీసుకునే క్రమంలో ఆనందంతో సెల్ఫీ దిగాడు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78లోని పద్మాలయ అంబేడ్కర్ నగర్ బస్తీలో నివసించే నరేష్ అనే యువకుడి ఆటో(టీఎస్ 32పి 8204) గత ఫిబ్రవరి 14వ తేదీన చోరీ అయ్యింది. ఎప్పటిలాగే రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను తస్కరించారు. జూబ్లీహిల్స్ పోలీసులకు అదే రోజు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆటో దొంగల కోసం గాలిస్తుండగానే నార్సింగ్ పోలీసులు ఈ దొంగను పట్టుకున్నారు. లంగర్‌హౌజ్‌కు చెందిన తండ్రీకొడుకులిద్దరూ ఆటోలు దొంగిలిస్తూ పోలీసులకు దొరకకుండా అద్దెకు తిప్పుకుంటున్నారు. గత నెల ఏప్రిల్ 13వ తేదీన నార్సింగ్ పోలీసులకు ఈ తండ్రీ కొడుకులు దొరకగా వీరిద్దరిని విచారిస్తే పద్మాలయ అంబేడ్కర్‌లో ఆటో దొంగతనం చేసిన విషయం బయటపడింది. జూబ్లీహిల్స్, నార్సింగ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ చేసిన ఆటోలను తండ్రీ, కొడుకులు బాడుగకు తిప్పుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు వెల్లడించారు. వీరి నుంచి జూబ్లీహిల్స్‌లో చోరీకి గురైన ఆటోను రికవరీ చేశారు. కోర్టు వ్యవహారాల అనంతరం మంగళవారం నరేష్‌కు ఆటోను అప్పగించారు. దీంతో యువకుడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇక దొరకదేమో అనుకున్న ఆటో దొరకడంతో సంబరపడ్డాడు.

రోడ్డు మరమ్మతు పనులు మొదలు



వినాయకనగర్‌లో మొదలైన మరమ్మతులు

ఫిలింనగర్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో కొత్తగా మొదలైన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి ఎగువ ప్రాంతం నుంచి మట్టి, రాళ్ళు, వ్యర్థాలు కొట్టుకొచ్చి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పరిస్థితిని స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళారు. మంగళవారం కొంత తెరిపినివ్వడంతో రోడ్డు పనులు మొదలయ్యాయి. కొట్టుకుపోయిన రోడ్డును మట్టితో చదునుచేసే పనులు మొదలు పెట్టారు. గత నాలుగైదురోజులుగా కొట్టుకుపోయిన రోడ్డుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజా మరమ్మతులతో కొంత ఊపిరిపీల్చుకున్నట్లు అయింది.

టీఆర్‌టీ క్వార్టర్స్‌లో కమ్యూనిటీ ఇంటరాక్షన్



అధికారులు, ప్రజలతో చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో మంగళవారం కార్పొరేటర్ సామల హేమ అధ్యక్షతన కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో పర్యటించిన అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించి దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ ప్రతినిధులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యకర వాతావరణం ఏర్పాటు చేసుకోవడం పట్ల అవగాహన కలిగించారు. రోడ్లు, నాలాల్లో చెత్త చెదారాలు వేయడంతో ఏర్పడే అనారోగ్యకర పరిస్థితుల పట్ల అవగాహన కలిగించారు. ఖాళీ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లు, రహదారులపై చెత్తడంపింగ్‌లు లేకుండా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానిక ప్రజలకు అవగాహన కలిగించాలని అధికారులు సూచించారు. చెత్త డంపింగ్‌ల ద్వారా ఎదురయ్యే సమస్యలను అధికారులకు సమాచారం అందించి సత్వర పరిష్కారం అభించే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడగ్రీన్ కార్నర్ ప్రాంతంలో తరచూ మురుగునీటి సమస్యలు పునరావృతం అవుతున్న సీవరేజీ లైన్లను పరిశీలించారు. త్వరలో కొత్త సీవరేజీ లైన్ నిర్మాణం చేపట్టి స్థానికులకు మురుగునీటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వై.కృష్ణ, మేనేజర్లు నవ్య, అన్విత్, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, స్ట్రీట్‌లైట్స్ పర్యవేక్షకుడు శ్రీనివాస్, శేఖర్, రాజేశ్, అశ్విన్, లలిత, అరుణ, అనిత, గౌస్, రహీం పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అమ్మి వేస్తున్నారు

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఔటర్ రింగ్‌రోడ్డును కొనసాగించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వల్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంటే కేవలం 30 సంవత్సరాలకు 7 వేల కోట్లకు ఆ సంస్థకు అప్పగించడం వెనుక జరిగిన కుంభకోణాన్ని బట్ట బయలు చేయాలని డిమాండ్ చేశారు.

మూసీ ప్రక్షాళన కోసం పోరాడుదాం

రాంగోపాల్‌పేట్: మూసీనది కాలుష్యంతో నగరంలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని దాని ప్రక్షాళన కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ డిమాండ్ చేసింది. వివిధ సంఘాల ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ సంస్థగా ఏర్పడి మూసీనది ప్రక్షాళన కోసం గత నెల 23వ తేదీన పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ పాదయాత్ర నగరంలోని వివిధ ప్రాంతాల గుండా సాగుతూ మంగళవారం రెతిఫైల్ బస్టాండ్ నుంచి మోండా మార్కెట్‌కు చేరుకుంది. మూసీనది నుంచి వస్తున్న కలుషిత జలాలతో ఎదురవుతున్న అనర్థాలపై కరపత్రాలు, బ్యానర్లు, చిన్న చిన్న సభల ద్వారా చైతన్య పరుస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటదాస్, ప్రెసిడెంట్ పిట్ల నగేష్, కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు.అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది వివిధ ప్రాంతాల గుండా ప్రవహిస్తూ పారిశ్రామిక రసాయనిక వ్యర్థాలు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు తదితర విష పదార్థాలతో పూర్తిగా కలుషితం అవుతుందన్నారు. ఈ నది పరివాహక ప్రాంతాల్లో పండుతున్న కూరగాయలు, ఆకుకూరలు, గడ్డి తిన్న ఆవులు, బర్రెల నుంచి వచ్చే పాలతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు విష గాలులు పీల్చడంతో గొంతు, కడుపునొప్పి, కంటి సమస్యలు, చర్మవ్యాధులు, తదితర అనారోగ్యాలతో సతమతమవుతున్నారని వివరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మూసీనదిని పూర్తిగా ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీటిగా మారుస్తామని హామీ ఇచ్చిన నేటికీ దాని ఊసేలేదన్నారు. వచ్చే నెల 15వ తేదీన ఈ పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు.

ఆకట్టుకున్న ఆర్ట్ సౌక్-2023

- హెచ్‌సీయూ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్‌సౌక్–2023 అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ మేరకు హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిష్ జాకబ్ థామస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని సిటీ క్యాంపస్ గోల్డెన్ థ్రెషోల్డ్‌లో 'ఆర్ట్ సౌక్ -2023' పేరిట నిర్వహించారు. అరబిక్ పదం 'సౌక్' అంటే 'బజార్' అని అర్థం. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూలోని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెయింటెడ్ టెర్రకోట ప్లాటర్ నుంచి వెల్డెడ్, టెర్రకోట శిల్పాలు, జైన్‌ల నుంచి ఆభరణాల వరకు అన్నింటిని ప్రదర్శించారు. దీంతోపాటు క్యాలెండర్లు, బ్యాగ్‌లు, స్కార్ఫ్‌లు, కుండలు, మార్బుల్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్‌తో సహా వివిధ కళాత్మక పద్ధతులతో చేతితో తయారు చేసిన వస్తువులు ఉంచారు. యానిమేటెడ్ ఫిల్మ్ ప్రదర్శించారు రుచికరమైన వంటకాలు, పానీయాలు కూడా అందుబాటులో ఉంచడంతో సందర్శకులు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, సందర్శకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్టును వదిలేశారు



ఎమ్మెల్యే కాలనీలో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్టు

బంజారాహిల్స్: ఈదురుగాలలతో కురిసిన వర్షానికి బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో పలు చెట్లు నేలకూలాయి. ఎమ్మెల్యే కాలనీలోని విజయ శాంతి నివాసం వీధిలోని ఉమా ఎన్‌క్లేవ్ వద్ద ఓ భారీ చెట్టు వంగిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించకుండా కొమ్మలు మాత్రమే కట్ చేసి తీసుకెళ్ళారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. మిగిలిపోయి ఉన్న చెట్టు ఎప్పుడు ఎవరిమీద కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జీవో 58, 59 పొడిగింపు పట్ల సీఎంకు కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఇళ్ళ స్థలాలను క్రమబద్ధీకరించే జీవో 58, 59లను మరో నెల రోజుల పాటు పొడిగించడం పట్ల ఖైర తాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి ఆయన సీఎంను కలిసి జీవో పొడిగింపు పట్ల పేదల తరపున హర్షం వ్యక్తం చేశారు. నోటరీలతో పాటు ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించి వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయాలని స్వయంగా కేసీఆర్ ప్రకటించడంతో వేలాది మందికి ఎంతగానో ఉపయోగ పడుతుందని ఈ సందర్భంగా నాగేందర్ అన్నారు.

ఘనంగా ఈదమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని దోభీఘాట్ బస్తీలోని ఈదమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో బస్తీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రెండో రోజు అమ్మవారికి కుంభాభిషేకంతో పాటు ఆలయ చండీ హోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న ఖైరతాబాద్ కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి

ఫుట్‌పాత్‌పైనే వృద్ధుడి మృతదేహం

స్థానికుల సహకారంతో అంత్యక్రియలు



ఫుట్‌పాత్ పై జగన్నాథం మృతదేహం

రహమత్‌నగర్ : వృద్ధుడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు నవ్‌యుగ్ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు నవీన్ యాదవ్. ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన జగన్నాథానికి(75) ఇద్దరు కుమారులు.ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు కుమారుల్లో ఒకరు మృతి చెందగా మరో కుమారుడు మతిస్థిమితం లేక ఇల్లు వదిలి పోయాడు. భార్య చని పోవడంతో జగన్నాథం కరీం నగర్‌లో ఉన్న రెండవ కూతురు శారద దగ్గరే ఉంటున్నారు.ఇటీవల ఆరోగ్యం విషమించడంతో జగన్నాథాన్ని కూతురు శారద ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించి వెళ్లి పోయింది, అప్పటి నుండి రెండవ కూతురు పద్మ ఆసుపత్రిలోనే ఉంటూ నాన్నను చూసుకునేది. ఈక్రమంలో జగన్నాథం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని కూతురు పద్మ రహమత్‌నగర్‌లో నివాసమంటున్న తన సోదరి సరోజ నివాసానికి వచ్చింది.అయితే ఇంటి యాజమాని తన నివాసంలో అంత్యక్రియలు జరుపుకునేందుకు ససేమిరా ఒప్పుకోక పోవడంతో చేసేది లేక ఏం చేయాలో అర్థకాక ఫుట్‌ఫాత్ పైకి మృతదేహాన్ని తీసుకెళ్లింది. సమాచారం అందుకున్న స్థానిక నాయకులు అనిల్ ముదిరాజ్, అక్రం, రాఖీలు ప్రవీణ్‌లు నవ్‌యుగ్ నిర్మాణసంస్థ వ్యవస్థాపకుడు నవీన్ యాదవ్‌కు అర్ధరాత్రి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించారు. యూసుఫ్‌గూడ స్మశాన వాటికలో మంగళవారం అంత్రక్రియలు నవీన్ యాదవ్ అనుచరులు నిర్వహించారు.

జల్సా బ్యాచ్.. చోరీ టార్గెట్

ఐదుగురి అరెస్ట్



గొలుసు దొంగలు

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడ్డ ఆరు మంది యువకులు రాత్రిపూట రోడ్లపై తిరుగుతూ దారికాచి ఒంటరిగా వెల్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని మెడలో బంగారు గొలుసులు తస్కరిస్తున్న అయిదుగురు దొంగల ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగడ్డ, సుల్తాన్ నగర్, నటరాజ్ నగర్ ప్రాంతానికి చెందిన ఎండి సాహిల్ ఖాన్(20) రోటీ మేకర్‌గా, బీటెక్ విద్యార్థి ఎండి. షోయబ్(21), ఆవారాగా తిరుగుతున్న ఎండి హమీద్(23), షవర్మాలో పని చేస్తున్న అద్నాన్ అలియాస్ టైగర్(20), పెయింటర్‌గా పని చేస్తున్న షేక్ మహ్మద్(20), డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న ఎండి అద్నాన్(20)లు దోపిడీ ముఠాగా ఏర్పడి కొంత కాలంగా రాత్రిపూట రోడ్లపై సంచరిస్తూ గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత నెల 28వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో సుమన్ టీవీలో టీమ్ లీడర్‌గా పని చేస్తున్న వై. మధుసూదన్‌రెడ్డి విధులు ముగించుకొని ఎల్ఎన్‌నగర్‌లోని తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వీరు బలవంతంగా ఆయన మెడలో నుంచి గొలుసు తస్కరించి పరారయ్యారు. అదే సమయంలో జూబ్లీహిల్స్ పోలీసులు కొద్ది దూరంలోనే వాహన తనిఖీలు చేస్తుండగా ఈ ఆరు మంది వెనక్కి వచ్చి గొలుసును మధుసూదన్‌రెడ్డి పైకి విసిరేసి పరారయ్యారు. బాధితుడు అదే రోజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు ఇక్కడి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఎండి. హమీద్ 2019లో దొంగతనం కేసులో పంజగుట్ట పోలీసులు అరెస్ట్ చేయగా సీసీ పుటేజీలోని ఫొటో ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. హమీద్‌ను పట్టుకొని విచారించగా గ్యాంగ్ గుట్టురట్టయింది. షోయబ్ పరారీలో ఉన్నాడని మిగతా అయిదుగురు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ 'జూడా' జాతీయస్థాయిలో సత్తా



డా. సుమిత్‌ను అభినందిస్తున్న ప్రొ. శ్రవణ్‌కుమార్

గాంధీఆస్పత్రి: గాంధీ మెడికల్ కాలేజీ పీజీ డాక్టర్ సుమిత్ కుమార్ సుమన్ పేపర్ ప్రజంటేషన్ విభాగంలో జాతీయస్థాయిలో సత్తా చాటాడు. ఇండియన్ న్యూరోగ్యాస్ట్రోఎంట్రాలజీ అండ్ మొటిలిటీ అసోషియేషన్ ఆరవ జాతీయ కాంగ్రెస్ సదస్సు నగరంలోని ఓ హోటల్‌లో ఇటీవల జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది వైద్యనిపుణులు హాజరై వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పోస్టర్ ప్రజంటేషన్ విభాగంలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు చెందిన 37 మంది పోటీ పడగా, గాంధీ మెడికల్ కాలేజీ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న జూనియర్ డాక్టర్ సుమిత్‌కుమార్ సుమన్ 'హై రిజల్యూషన్ మోనోమెట్రీ ఇన్ పేషెంట్ విత్ హిస్టరీ ఆఫ్ క్యాస్టిక్ ఇంజ్యూరీ' అంశంపై సమర్పించిన పోస్టర్‌కు తృతీయ బహుమతి లభించింది. అవార్డుతోపాటు సర్టిఫికెట్, రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి అందించారు. యాసిడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలు తాగిన బాధితులు అస్వస్థత నుంచి కోలుకున్న తర్వాత గుండెల్లో వచ్చే నొప్పికి గల కారణాలను విశ్లేషిస్తూ పేపర్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన డాక్టర్ సుమిత్‌ను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ అభినందించారు.


క్లుప్తంగా...

సీబీఐ విచారణకు హాజరైన వివేకా పీఏ కృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా పీఏ కృష్ణారెడ్డిని మంగళవారం ప్రశ్నించారు. హత్యకు ముందు వివేకానందరెడ్డి రాసిన లేఖను కృష్ణారెడ్డి దాచిపెట్టిన విషయంపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన కృష్ణారెడ్డిని ఐదు గంటలకు పైగా ప్రశ్నించారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన కీలక ఆధారమైన ఆ లేఖను ఎందుకు దాయాల్సి వచ్చింది? ఎవరు ఆదేశాలిచ్చారు? లేఖను ఎవరు తొలుత గుర్తించారు? తర్వాత దాన్ని ఎక్కడ దాచిపెట్టారు? లేఖ విషయం తొలుత ఎవరెవరితో పంచుకున్నారు? లేఖను ఎన్ని గంటలకు పోలీసులకు అప్పగించారు? అప్పటి వరకు లేఖను గోప్యంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలేవైనా ఉన్నాయా?.. ఇలా అనేక అంశాలపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు కృష్ణారెడ్డి ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలిసింది. ఇటీవల పులివెందులలోని కృష్ణారెడ్డి ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లగా, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణకు హాజరుకావాలని కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

వివేకా హత్యకేసులో సాక్షి రంగన్న పరిస్థితి విషమం

వయసు రీత్యా అనారోగ్య సమస్యలు



పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వివేకా హత్య జరిగిన రోజు అక్కడే ఉన్న వాచ్‌మన్ రంగన్న కోర్టుకు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌లో కూడా వివేకాను ఎర్ర గంగిరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్, దస్తగిరి హత్యచేశారని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలవల్ల వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో వాచ్‌మన్ రంగన్న ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రంగన్నను అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

విశ్వ నగరం వెలుగు రేఖలు

విశాఖలో అత్యాధునికంగా విద్యుత్ వ్యవస్థ

- ఆర్థిక నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ కేబుళ్లు
- తుపాన్లు వచ్చినా సరఫరా నిలిచిపోకుండా రూ.925 కోట్లతో నిర్మాణం



విశాఖపట్నం నుంచి సాక్షి ప్రతినిధి: ఏదైనా ఒక రాష్ట్రం, ప్రాంతం ఆర్థిక స్థితిని అంచనా వేయడంలో విద్యుత్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. విశ్వ నగరంగా మారిన విశాఖ ఆర్థిక రాజధానిగా బలంగా ఎదిగేలా విద్యుత్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. భారీ పరిశ్రమలు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మాల్స్, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా విశాఖలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగని విధంగా భూగర్భం నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్ పంపిణీ కానుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాఖలో సిద్ధమవుతున్న ఆధునిక విద్యుత్ వ్యవస్థపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇదీ..

■ తుపాన్లకు తల వంచదు..

రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాల కోసం వచ్చి విశాఖలో స్థిరపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుంటూ పలువురు పారిశ్రామికవేత్తలు సాగర నగరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పనులు కూడా మొదలయ్యాయి. తుపాన్లు లాంటి విపత్తుల సమయంలోనూ విశాఖ నగరం అంతటా విద్యుత్ వెలుగులకు ఆటంకం కలుగకుండా రూ.925 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.481.49 కోట్ల ఖర్చుతో 80,529 విద్యుత్ కనెక్షన్లను భూగర్భ విద్యుత్ వ్యవస్థలోకి తెచ్చారు. నగరం మొత్తం 2,449 కి.మీ. పొడవున అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నగరం కావడంతో తుపాన్లు వచ్చినపుడు విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పాత స్తంభాల స్థానంలో సెంట్రిఫ్యూగల్లీ కాస్ట్ రీఇన్ఫోర్స్ కాంక్రీట్ స్తంభాలు (స్పన్‌పోల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 3,266 స్పన్‌పోల్స్ ఏర్పాటు కాగా అందుకోసం రూ.15.36 కోట్లను వెచ్చించారు. నష్టాల తగ్గింపు, ఆధునికీరణ పనులను సుమారు రూ.1,722.02 కోట్లతో చేపట్టారు. ఇందులో భాగంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16 నిర్మించనున్నారు. గత మూడు నెలల్లో 421 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

'భోగాపురం' భూమి పూజ నేడే

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేయనున్నారు. దీంతోపాటు విజయనగరం జిల్లాలో మరో రెండు కీలక ప్రాజెక్టులు, విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ గ్రూప్ నిర్మించే వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం కానుండగా ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా వైజాగ్ టెక్ పార్కు రూపుదిద్దుకోనుంది. సీఎం జగన్ భోగాపురం మండలం సవరవిల్లి వద్ద నిర్వహించే సభలో ప్రసంగించనున్నారు.

టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8 వరకు పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ మంగళవారం పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 20న ఏపీలో నాలుగు చోట్ల, తెలంగాణలో 17 ప్రాంతాలలో జరిగే ప్రవేశ పరీక్షకు 21,500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీ సిగలో 'గులాబీ'

- దేశ రాజధానిలో సిద్ధమైన బీఆర్ఎస్ కార్యాలయం
- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వాస్తుపూజతోపాటు సుదర్శన హోమం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వేముల, ఎంపీ సంతోష్



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఐదు అంతస్తుల్లో నిర్మితమైన ఈ భవనాన్ని ఈ నెల 4న తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం వాస్తు పూజతోపాటు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:05 గంటలకు కేసీఆర్ ఈ భవనాన్ని ప్రారంభిస్తారు.

ఆంక్షలతో ఆలస్యం

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో కాలుష్యం కారణంగా నిర్మాణ పనులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయారు. ఏడాదిన్నరగా రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నిర్మాణ సంస్థపై ఒత్తిడి పెంచుతూ పనులు వేగంగా జరిగేలా చూశారు. బీఆర్ఎస్ భవన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైన నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

ఐదంతస్తుల్లో 20 వేల చదరపు అడుగులు

మొత్తం 1,300 గజాల్లో ఉన్న స్థలంలో 20 వేల చదరపు అడుగుల ప్రాంతంలో భవనాన్ని నిర్మించారు. అందులో లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండవ, 3వ అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులు న్నాయి. లోయర్ గ్రౌండ్‌లో మీడియా సమావేశాల ను నిర్వహించేందుకు వీలుగా మీడియా హాల్‌తోపాటు రెండు ఇతర గదులను నిర్మించారు. లోయర్ గ్రౌండ్‌లోకి వచ్చే మీడియాకు వీలుగా ఉండేలా ప్రత్యేక ఎంట్రెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, కార్యకర్త లు, నాయకుల కోసం క్యాంటీన్‌ను సిద్ధం చేశారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. 2,3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్యకర్తలు, నాయకులు బస చేసేందు కు 18 గదులతోపాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లను సిద్ధం చేశారు. సూట్ రూమ్‌లలో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేస్తారు.

మహారాష్ట్రలో ప్రభంజనం ఖాయం: కేసీఆర్

- కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు నన్ను సంప్రదిస్తున్నారు
- అధికారంలోకి వస్తే అక్కడ తెలంగాణ మోడల్
- 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' మూలమూలకూ వెళ్లాలి
- మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలతో భేటీ



మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాచైతన్యమే తమ పార్టీ అయువుపట్టు అని, మహారాష్ట్రలో ప్రభంజనం సృష్టిస్తుందని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి మహారాష్ట్రకు చెందిన అనేకమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. మహారాష్ట్రలో ఏం జరగబోతోందో మీరే చూస్తారు అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేస్తామని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మహారాష్ట్రకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. అక్కడ బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. మే 10 నుంచి జూన్ 10 వరకు మహారాష్ట్ర మూల మూలకు 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం వెళ్లాలని స్పష్టం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, బ్లాక్ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరారు. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారు. అనేకమంది నాతో సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసి వారి ప్రేమను పొందాలి. ప్రజల మనసులు గెలవడం బీఆర్ఎస్ లక్ష్యం. తెలంగాణ తర్వాత మహారాష్ట్రకే దేశాన్ని మలుపుతిప్పే అవకాశం వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అంటూ కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

త్వరలో జిల్లా సమన్వయకర్తల నియామకం

రెండు, మూడురోజుల్లో జిల్లా సమన్వయకర్తల నియామకం పూర్తి చేస్తామని, మే 10 నుంచి జూన్ 10 వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావాలని కేసీఆర్ ఆదేశించారు. ఒకేరోజు ఒకే సమయంలో 288 నియోజకవర్గ కేంద్రాల నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రారంభం కావాలన్నారు. శివాజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నుంచి పార్టీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని చెప్పారు. సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యత్వానికి రూ.50 చొప్పున తీసుకోవాలన్నారు. మే 8, 9 తేదీల్లో మహారాష్ట్ర నేతలకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఈ భేటీలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ ఎంపీ నగేశ్, దాసోజు శ్రవణ్, మహారాష్ట్ర ముఖ్యనేతలు మాణిక్ కదం, మాజీ ఎమ్మెల్యే శంకరన్న డోంగే, మాజీ మేయర్ రవీంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానమే లేదు

- అందుకే సచివాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు
- రాజ్‌భవన్ నుంచి ప్రకటన విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందలేదని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. ఆహ్వానించినా ఆమె గైర్హాజరయ్యారనడం నిరాధారణ, తప్పుడు ఆరోపణలని తోసిపుచ్చింది. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రగతి నిరోధక శక్తులు తట్టుకోలేకపోతున్నాయని, సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ రాకపోవడం అందులో భాగమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవానికి రావడం, రాకపోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై రాజ్‌భవన్ పరోక్షంగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

నగర వార్తలు

రాష్ట్ర వీరశైవ జంగం అర్చక సంఘం నూతన కమిటీ ఎన్నిక



అర్చక సంఘం నూతన కార్యవర్గం

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్ర వీరశైవ జంగం అర్చక పురోహిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పురంతు వీరయ్యస్వామి, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నందీశ్వర్, కోశాధికారిగా శైలపతి, సంయుక్త కార్యదర్శిగా మహేశ్‌లను సంఘం ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పురంతు వీరయ్యస్వామి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచవటి క్షేత్రం ప్రధాన పూజారి అయ్యప్పస్వామి, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మడుపతి మహేశ్‌స్వామి, ఉమా శంకర్‌స్వామి, కార్యవర్గ సభ్యులు నాగయ్యస్వామి, సురేష్‌స్వామి, శివప్రసాద్‌స్వామి, విజయ్‌స్వామి, నాగభూషణంస్వామి, కేదార్‌నాథ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ద్వారిక స్వప్న

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యమకారులపై నిర్లక్ష్యం తగదని బీఆర్ఎస్ తెలంగాణ విద్యార్థి మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ద్వారిక స్వప్న అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మహిళలను రాష్ట్రం ఏర్పాటు అనంతరం విస్మరించారని ధ్వజమెత్తారు. త్యాగాలు ఉద్యమకారులు చేస్తే భోగాలు ఉద్యమ ద్రోహులు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ తమ త్యాగాలను గుర్తించి తెలంగాణ ఉద్యమకారులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మహుస్సేన్ డాక్టర్ నేరేళ్ల పద్మ, నాగమణి, అరుణ, సునీత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీసి రోడ్లపైనే వేస్తే ఎలా అంటూ..

- జలమండలి కార్యాలయం ముందు బీజేపీ కార్పొరేటర్ల మెరుపు ధర్నా
- అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

పంజగుట్ట: జలమండలి కార్యాలయం ముందు బీజేపీ కార్పొరేటర్లు మంగళవారం ఉదయం మెరుపు ధర్నాకు దిగారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయం లేక డ్రైనేజీలోని సిల్ట్ (పూడిక) తీసి రోడ్లపైనే వేస్తున్నారని పేర్కొంటూ.. దానిని తీసుకొచ్చి వాటర్‌బోర్డు కార్యాలయం ముందు పడేశారు. అంతేకాకుండా ఓ పూలకుండీలో డ్రైనేజీ సిల్ట్ వేసి పూలమొక్క నాటి, దానిని వాటర్‌బోర్డు చైర్మన్ దానకిషోర్‌కు ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కార్యాలయంలోకి దూసుకువెళ్లేందుకు కార్పొరేటర్లు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు కార్పొరేటర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు



కార్పొరేటర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు



జలమండలి కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

తరలించారు. డ్రైనేజీ మురుగులో నడిస్తే అక్కడి పరిసరాలు ఎలా అవుతాయి, ప్రజలు ఎంత ఇబ్బంది పడతారో తెలిపేందుకే తాము ఈ కార్యక్రమం చేపట్టామని బీజేపీ నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ .. నగరంలో ఎన్నో ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు మంచి నీటిలో కలిసి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలాల్లో పూడికలు తీయడంలేదని, కొన్నిచోట్ల తీసినా వ్యర్థాలు తిరిగి అక్కడే ఉంచడంతో వర్షానికి అవి తిరిగి నాలాల్లోకే వెళ్తున్నాయన్నారు. ప్రజా సమస్యలను వివరించేందుకు వస్తే తమగోడు వినేందుకు ఒక్క అధికారి కూడా రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్పొరేటర్లు శ్రవణ్, అరుణ, నర్సింహారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, రవిచారి, శ్రీవాణి, పద్మావతి రెడ్డి పాల్గొన్నారు.

14 మంది బీజేపీ కార్పొరేటర్లపై కేసులు

ఖైరతాబాద్: జలమండలి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళనకు దిగి అధికారుల విధులకు ఆటంకం కలిగించిన 14 మంది బీజేపీ కార్పొరేటర్లతో పాటు పలువురు నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేటర్లు రవిచారి (రాంనగర్), రచన (కవాడిగూడ), దర్శన్ (జియాగూడ), నర్సింహారెడ్డి (మన్సూరాబాద్), జీవన్‌రెడ్డి (హయత్‌నగర్), సుప్రియాగౌడ్ (ముషీరాబాద్) పాటు ఇతర కార్పొరేటర్లపై కేసు నమోదైంది. మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన ద్వారం వద్ద మెట్లపై కూర్చొని బీజేపీ కార్పొరేటర్లు అధికారులు, ఉద్యోగులను విధులకు హాజరుకాకుండా అడ్డుకోవడంతో పాటు పూల కుండీలు ధ్వసం చేసినట్లు జలమండలి ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట సుబ్బారావు సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ సత్తయ్య తెలిపారు.

కమిషనర్‌పై ఉద్యోగ సంఘాల గుస్సా

- వాణిజ్య పన్నుల శాఖలో బయోమెట్రిక్ చిచ్చు
- వర్క్‌టు రూల్ పాటిస్తామని చెబుతున్న ఉద్యోగులు
- బయోమెట్రిక్ పాటించాల్సిందే: కమిషనర్



సాక్షి,సిటీబ్యూరో: వాణిజ్య పన్నుల శాఖలో బయోమెట్రిక్ విధానం చిచ్చు రేపింది. విధుల నిర్వహణలో బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు బయోమెట్రిక్‌ను అమలు చేస్తే... వర్క్ టూ రూల్ పాటిస్తామని తెగేసి చెబుతున్నాయి. ఉద్యోగులు సమయానుగుణంగా కార్యాలయానికి రావడంలేదని ఫిర్యాదులు రావడంతో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్...బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం అమలులోకి వచ్చినా కొందరు ఉద్యోగులు తమ తీరు మార్చుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషనర్.. వారికి తాఖీదులు జారీ చేశారు. కమిషనర్ చర్యతో ఆవేదన చెందిన ఉద్యోగులు.. చట్టబద్ధతలేని బయోమెట్రిక్‌ను పాటించేది లేదని మొండికేస్తున్నారు. విధులకు సకాలంలో హాజరుకాకుండా.. పన్ను వసూళ్ల లక్ష్య సాధనలోనూ వెనుకబడడాన్ని సమీక్షించిన తర్వాతే బయోమెట్రిక్‌ను విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నామని.. దీనిపై ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గేదిలేదని కమిషనర్ స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. ఏదీ ఏమైనా బయోమెట్రిక్ విధానం వాణిజ్య శాఖను ప్రస్తుతం కుదుపేస్తోంది.

కుత్బుల్లాపూర్ పరిధిలో నవీన్ మిట్టల్ పర్యటన

- క్రమబద్ధీకరణ దరఖాస్తుల నేపథ్యం..
- ఎక్కువ మొత్తానికి డిమాండ్ నోటీసు రావడంపై ఆక్రమిత స్థలాల పరిశీలన




కైసర్ నగర్‌లో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న నవీన్ మిట్టల్

సుభాష్‌నగర్: ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు 58, 59 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను మంగళవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ముందుగా జగద్గిరిగుట్ట డివిజన్ పాపిరెడ్డినగర్, గాజులరామాలయం డివిజన్‌లోని రోడామిస్త్రీ నగర్, కైసర్‌నగర్ ప్రాంతాల్లోని అభివృద్ధి స్థితిగతులను పరిశీలించారు. గతేడాది కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలో 58 జీఓ కింద 9331 దరఖాస్తులు రాగా.. 1300 మందికి పట్టాలు వచ్చాయి. 59 కింద 14518 దరఖాస్తులు రాగా 4032 మందికి డిమాండ్ నోటీసులు అందాయి. మిగతా వారికి అందలేదు. డిమాండ్ నోటీసులు అందిన వారిలో చాలామందిలో 80 గజాలకు రూ.80 వేలు కట్టమని మెసేజ్ రాగా, అదే ప్లాట్ల కొనుగోలు చేసిన వారికి ఏకంగా రూ. 8 లక్షలు కట్టమని మెసేజ్ వచ్చింది. దీంతోజీఓ 59 కింద డిమాండ్ నోటీసులు అందిన వారు డబ్బులు కట్టడానికి వెనకడుగు వేశారు. కాగా, ఇందుకు సంబంధించి వందల సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఈ విషయమై నేరుగా నవీన్ మిట్టల్ రంగంలోకి దిగారు. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలోని మూడు ప్రాంతాలను పర్యటించి స్థానికంగా స్థల విలువ ఎంత, అక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

వారి పేర్లు సరి చేస్తాం...

ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, 58,59 కింద దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం మరో నెల రోజుల పాటు మే 31 వరకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. సాంకేతిక లోపం, కొన్ని చోట్ల కమర్షియల్ ప్రాంతాలు ఉండటం వలన కొంతమందికి డబ్బులు ఎక్కువ కట్టాలని మెసేజ్ వచ్చిందని, అలాంటి వారి పేర్లను సరి చేస్తామని తెలిపారు. ఆయన వెంట జేసీ నరసింహా రెడ్డి, ఆర్డీఓ మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు, ఆర్‌ఐ లు పరమేశ్వర్ రెడ్డి, రేణుక, సర్వేయర్ సునీతలు ఉన్నారు.

హుడా భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



హుడా భూముల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హుడా అధికారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హుడా భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను హెచ్‌ఎండీఏ ఎస్టేట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక పోలీసుల సహకారంతో మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా హుడా అధికారులు మాట్లాడుతూ.. హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ, ఫరానగర్, మల్కారంలోని హుడా భూముల్లోని అక్రమ నిర్మాణాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశామన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎండీఏ ఎస్టేట్ అధికారి జనార్దన్, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ సాయిపై కేసు ..

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ భూములు, హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసిన బీఆర్ఎస్ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్‌పై హుడా అధికారుల ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన 20వ డివిజన్ కార్పొరేటర్‌గా సాయికుమార్ ఎన్నికయ్యాడు. జవహర్‌నగర్‌లోని పలు ప్రభుత్వ భూములను అమ్ముతూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగాడు. 18 నెలల క్రితం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. తన భూ వ్యాపారాలు కొనసాగించడానికే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు పలువురు అంటున్నారు.

రెవెన్యూ భూముల్లోని నిర్మాణాలు కూడా...

కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఆర్‌ఐ విశ్వనాథ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల్లో పేపర్ లేఅవుట్లు చేసి నిరుపేదలకు ప్లాట్లుగా విక్రయిస్తూ మోసం చేస్తున్నారన్నారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సాయన్న చావుకు బీఆర్ఎస్ నేతలే కారణం

కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ ఆరోపణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతికి బీఆర్ఎస్ నేతలే కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా మంత్రి రాజశేఖర్ రెడ్డి కంటోన్మెంట్‌లో వర్గపోరును ప్రోత్సహిస్తూ సాయన్నను మానసికంగా హింసించి చావుకు కారకుడయ్యాడన్నారు. మంగళవారం బోర్డు కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సాయన్న అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించకుండా దళిత ఎమ్మెల్యేను ఘోరంగా అవమానించారన్నారు. ఎమ్మెల్యే చనిపోయి పక్షం రోజులు కాకుండానే బీఆర్ఎస్ నేతలు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దళిత నేత కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి, రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే ఆశావహులను కలుపుకుని తిరుగుతూ సాయన్న కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తనకు రాజకీయ ఓనమాలు నేర్పిన సాయన్న కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఉప ఎన్నికలు జరిగితే సాయన్న వారసులకు వ్యతిరేకంగా బీజేపీ తరఫున అభ్యర్థిని పోటీ పెట్టబోమన్నారు. సాయన్న వారసులు బీజేపీలోకి వస్తే స్వాగతిస్తామని రామకృష్ణ ప్రకటించారు.

'ధర్నా చౌక్‌ను అంబేడ్కర్ విగ్రహం వద్దకు మార్చాలి'

కాచిగూడ: ఇందిరాపార్కు వద్ద ప్రస్తుతం కొనసాగుతున్న ధర్నా చౌక్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు మార్చాలని బ్రాహ్మణ సమాజ్ పార్టీ అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు వచ్చి సమస్యలు తెలుపుకొనేందుకు ప్రత్యేకంగా ఇద్దరు మంత్రులను కేటాయించడంతో పాటు ప్రతి రోజూ నూతన సచివాలయం వద్ద ప్రజా దర్బార్ ఏర్పాటు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ప్రతి రోజూ ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకొని వాటికి రసీదు ఇవ్వడంతో పాటు సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో సమగ్ర సమాచారం ఇవ్వాలని అన్నారు. ధర్నా చేయడానికి ఇక నుంచి ఎవరు ఇందిరాపార్కు వద్దకు వెళ్లవద్దని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా వేదిక మొదలుపెట్టాలని సూచించారు.

ఉన్నది ఒకటే జీవితం ... కోరుకున్న విధంగా బతకాలన్నదే తాపత్రయం
అడ్డుపడే వైకల్యం .. అడ్డంపడే కుటుంబ నిబంధనల నుంచి
తమకంటూ ఓ కొత్త లోకాన్ని ఏర్పాటు చేసుకోవాలని
తపించే వారికి అండగా ఉంటుంది కృష్ణప్రియ.
హైదరాబాద్ ఉప్పల్‌లో ఉంటున్న దివ్యాంగురాలైన కృష్ణప్రియ
తను నిలదొక్కుకోవడమే కాకుండా
తనలాంటి వారికి దగ్గరుండి మరీ పెళ్లిళ్లు చేస్తోంది.
కష్టపడుతూనే ఇష్టమైన జీవన ఫలాలను అందుకోవడానికి తపిస్తున్న
కృష్ణప్రియను కలిస్తే తమ గురించి ఇలా వివరించింది..


కృష్ణప్రియ

అదిగో నవలోకం

● వారికి అండగా ఆమె

“మూడేళ్ల వయసులో నరాల సమస్య వల్ల కాళ్లు రెండు చచ్చుబడిపోయాయి. అయినా, నా ఉత్సాహం చూసి స్కూల్ చదువు వరకు చెప్పించారు మా అమ్మానాన్న. ఇక చదువు వద్దు అంటే నేనే మొండికేసి ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత ఇంట్లోనే ఉండేదాన్ని. ఇంట్లో సినిమాలు చూడటానికి కంప్యూటర్ తీసుకున్నారు నాన్న. ఖాళీ సమయంలో యూ ట్యూబ్ చూసి డిజిటల్ వర్క్స్ నేర్చుకున్నాను. డిటిపీ వర్క్స్, ఆన్‌లైన్, సోషల్‌మీడియా వర్క్స్ చేస్తుండేదాన్ని. హాస్టల్‌లో ఉండి నన్ను నేను పోషించుకుంటాను అని ఓ రోజు చెప్పాను. ‘మేం నీకు ఇంత తిండి పెట్టలేమా? బయట అవస్థలు పడుతుంటే నలుగురు చూసి ఏమనుకుంటారు?’ అని అమ్మానాన్నా, ‘నడవడమే సరిగా రాదు, ఏం సాధిస్తావని, ఇంటి పట్టున ఉండక’ అని తెలిసినవాళ్లు.. ఇలాంటి మాటలు విని విని విసిగిపోయాను. ప్రతిదానికి ఇంట్లో వారిపై ఆధారపడటం, భారంగా ఉండటం ఇష్టం లేక ఎనిమిదేళ్ల క్రితం బయటకు వచ్చేశాను. మూడేళ్లు ఒక్కదాన్నే రూమ్ తీసుకుని ఉన్నాను. వచ్చిన కంప్యూటర్ వర్క్స్ నాకు కొంత ఆదాయాన్ని తెచ్చిపెట్టేవి.

■ ఒక్కొక్కరూ జతగా చేరి..

దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఎన్జీవోలను కలిశాను. అక్కడ నాలాంటి వారెందరో కలిశారు. వైకల్యం ఎలాగూ బాధిస్తుంది. మరొకరి మీద ఆధారపడటం మరింతగా బాధిస్తుంది. ఇంట్లో వారిమీద ఆధారపడటం ఇష్టలేని కొంతమంది దివ్యాంగ అమ్మాయిలు నాతో కలిశారు. దీంతో పెద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నాను. ఇంటి యజమానులు మాకు అద్దెకు ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. ‘మీ పనులు మీరే సరిగా చేసుకోలేరు. ఇక ఇంటినేం శుభ్రంగా ఉంచుతారు’ అనేవారు. కొన్ని రోజుల ప్రయత్నంతో ఎలాగో ఇల్లు దొరికింది. మరో ఆరుగురు నాతో కలిశారు. చిన్న హాస్టల్‌లా ‘ఆద్య’ అనే పేరుతో దివ్యాంగుల కోసం హోమ్ ప్రారంభించాను. మాలాంటి వారి సమస్యల పట్ల మాకే అవగాహన ఉంటుంది కాబట్టి, అందరం ఒకింటి సభ్యుల్లా కలిసిపోయాం.

■ పెళ్లితో కొత్త జీవితం..

దివ్యాంగుల చదువు, ఉద్యోగం, పెళ్లి .. ప్రయత్నాల్లో ఉండేవారికి, తమ గురించి తాము ఆలోచించుకోవడానికి తగిన వాతావరణం గల ప్రత్యేక హోమ్స్ అంటూ ఏమీ లేవు. జీవితంలో నిలదొక్కుకోవడానికి కావాల్సిన వాతావరణం కల్పించే సరైన వసతి మాకు ఎక్కడా కనిపించలేదు. దాంతో ఎక్కువ వైకల్యం ఉన్న వారి కోసం నేనే అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాను. రెండేళ్ల క్రితం దివ్యాంగుడైన సత్తయ్యను పెళ్లి చేసుకున్నాను. అతను ఫ్లోర్‌వాకర్. ఎన్జీవోల సాయంతో చిన్న షాప్ నడుపుతున్నాడు. నాకంటూ ఓ జీవితాన్ని ఏర్పాటు చేసుకున్నాను.

> భార్యాభర్తలు ఇద్దరూ దివ్యాంగులే అయితే, మా సమస్యలు మాకు బాగా అర్థం అవుతాయి. ఒకరికొకరం తోడుగా ఉంటాం. దివ్యాంగ సమావేశాలు ఎక్కడ జరిగినా, మాకు అందే అవకాశాల గురించి ఎప్పటికప్పుడు మీటింగ్‌లు ఏర్పాటు చేసుకుంటాం. ఇక్కడ అందరూ ఆప్యాయంగా అక్కా అని పిలుస్తుంటారు. ఏ చిన్న సమస్య వచ్చినా చెప్పుకోవడానికి తోడున్నామనే భరోసా ఉంది.
> – కృష్ణప్రియ



నాతోపాటు ఉన్న అమ్మాయిలలో నలుగురికి దగ్గరుండి పెళ్లిళ్లు జరిపించాను. ఇందుకు అవసరమైన డబ్బులను పోగుచేయడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. అవమానకరంగా మాట్లాడినవారూ ఉన్నారు. కానీ, మాకూ ఓ జీవితం ఉందని తెలియజేయాలనుకున్నాను. దివ్యాంగులైన అమ్మాయిలు పెళ్లి చేసుకోవడానికి కొంచెం వెనకంజ వేసేవారు. తమనెవరు పెళ్లి చేసుకుంటారనే నిస్పృహ వారిలో ఉండేది. ఇందుకోసం చాలా కౌన్సెలింగ్ చేయాల్సి వచ్చింది. మాకు ఇళ్లలో చదువు, కళలు, వ్యాపారాలు, వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఉన్నా పెద్దగా ప్రోత్సాహం ఉండదు. ఎంత టాలెంట్ ఉన్నా ఎంత వయసు వచ్చినా ఏళ్లకేళ్లు ఇంటికే పరిమితమవ్వాలి. ఇక వివాహం .. కల్లో కూడా ఊహించలేం. ఈ పరిస్థితులన్నీ మనకు మనమే అధిగమించాలని చెబుతుంటాను.

■ మాకు మేమే పరిష్కారం

మాకు అసలు పెళ్లి భాగ్యం ఉందా అనుకున్న అమ్మాయిలు ఒకింటి వారై తమకు తాముగా కొత్త జీవితాన్ని గడుపుతుండటం చాలా ఆనందంగా ఉంటుంది. దివ్యాంగుల పెళ్ళిళ్లు, పోషణ నిమిత్తం మా స్నేహితులు, బంధువులు, ఎన్జీవోల సాయం తీసుకుంటున్నాను. ‘ఇవన్నీ ఎందుకు? మీరే చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. మళ్లీ పెళ్ళిళ్లు చేసుకొని ఎందుకు కష్టపడతారు’ అంటుంటారు. కానీ, మాకూ ఓ కుటుంబ జీవనం కావాలని, నలుగురిలో మేమూ గొప్పగా జీవించాలనీ ఉంటుంది కదా! అందుకే ఇంతగా తాపత్రయపడుతున్నాను. భార్యాభర్తలు ఇద్దరూ దివ్యాంగులే అయితే, మా సమస్యలు మాకు బాగా అర్థం అవుతాయి. ఒకరికొకరం తోడుగా ఉంటాం. దివ్యాంగ సమావేశాలు ఎక్కడ జరిగినా, మాకు అందే అవకాశాల గురించి ఎప్పటికప్పుడు మీటింగ్‌లు ఏర్పాటు చేసుకుంటాం. ఇక్కడ అందరూ ఆప్యాయంగా అక్కా అని పిలుస్తుంటారు. ఏ చిన్న సమస్య వచ్చినా చెప్పుకోవడానికి తోడున్నామనే భరోసా ఉంది. మరిన్ని అవకాశాలు లభిస్తే ఎవరి మీదా ఆధారపడకుండా బతకాలన్నదే మా ఆలోచన’’ అని వివరించింది కృష్ణప్రియ. దివ్యంగా ఉన్న ఆమె ఆశయాలు నెరవేరాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

● న్యూస్‌మేకర్

ఆరేళ్ల పాప కారిడార్‌లో ఆడుతుంటేనే చిన్న భయం ఉంటుంది.
17,500 అడుగుల ఎత్తు ఉండే ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకోవాలనుకుంటే?
పూణెకు చెందిన ఆరేళ్ల ఆరిష్క లడ్డా ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకున్న అత్యంత చిన్నారిగా రికార్డు స్థాపించింది.
తల్లితో కలిసి పదిహేను రోజులపాటు ఆరోహణ చేసి ఈ సాహసకార్యం పూర్తి చేసింది.
కొంతమంది చిన్నారులు పుట్టుకతో చిరుతలు అని పాడుకోవాలి ఇలాంటి పిల్లలను చూస్తే.


ఆరిష్క లడ్డా



ఎవరెస్ట్ పర్వతాన చిన్నారి పాదాలు

ఆరేళ్ల ఐదు నెలల వయసు ఉన్న ఆరిష్కా లడ్డాకు నిజంగా తానేం ఘనకార్యం చేసిందో తెలియదు. ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతం బేస్ క్యాంప్‌కు చేరుకోవడం అంత చిన్న వయసులో అసాధ్యమైనా సాధ్యం చేసిందనీ తెలియదు. తల్లి చేయి పట్టుకుని ఎంత దూరమైనా సాగగలను అనే నమ్మకమే ఆరిష్కాను సముద్ర మట్టానికి 17,500 ఎత్తు ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేర్చింది. పూణెలో ఇప్పుడు ఆ పాప నివాసం ఉంటున్న కొత్‌రుడ్ ఏరియా, చదువుతున్న స్కూలు, బంధువులు అందరూ గర్వపడుతున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

‘12 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు తీసుకెళ్లరు. ఎందుకంటే పర్వతారోహణ సమయంలో తమ ఆరోగ్యంలో ఎటువంటి మార్పు వస్తున్నదో చిన్న వయసు పిల్లలు స్పష్టంగా చెప్పలేరు. అలా చెప్పకపోతే ప్రమాదం వస్తుంది. మేము రిజిస్టర్ చేసుకున్న సంస్థను నడిపే భగవాన్ చావ్లే మా పూణెకు చెందిన పర్వతారోహకుడు. మూడుసార్లు ఎవరెస్ట్ ఎక్కాడాయన. పర్వతారోహణలో విశేష అనుభవం ఉంది. ఆయన మార్గదర్శకత్వంలో నేను ఆరిష్కాతో పాటుగా ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌కు వెళ్లాలనుకున్నప్పుడు– మీ సొంత రిస్క్ మీద తీసుకువెళతాను. కాని పాప ఆరోగ్యంలో ఏ మాత్రం మార్పు వచ్చినా వెంటనే వెనక్కు పంపిస్తాను అని చెప్పాడు. నేను అంగీకరించాను. ఎందుకంటే నా కూతురు సాధించగలదన్న నమ్మకం ఉంది’ అంది ఆరిష్కా తల్లి డింపుల్ లడ్డా.

ప్రాథమిక శిక్షణ

ఆరిష్కా పూణెలో వారాంతంలో చుట్టుపక్కల కోటలను, కొండలను ట్రెక్ చేసేది. గత సంవత్సరం వైష్ణోదేవికి వెళ్లినప్పుడు కూడా హుషారుగా నడిచింది. ‘అది గమనించాకే బేస్‌క్యాంప్‌కు నడవగలదు అన్న నమ్మకం కుదిరింది’ అంది డింపుల్. ఏప్రిల్ మొదటివారంలో మొదలైన వీరి ఆరోహణ పోను 65 కిలోమీటర్లు రాను 65 కిలోమీటర్లు మొత్తం 130 కిలోమీటర్ల పొడవునా కాలినడకన సాగింది. అంత దూరమూ ఆరిష్కా తల్లికి సహకరిస్తూ హుషారుగా నడవగలిగింది.

> పాపను చలి నుంచి కాపాడటానికి 7 దొంతరల బట్టలు తొడిగి జాగ్రత్త తీసుకున్నాను. ఆ దారిలో మైనస్ 3 నుంచి మైనస్ 16 వరకు ఉష్ణోగ్రతలు ఉండేవి.
> – డింపుల్, అరిష్కా తల్లి

ఖర్జూరాలు, డ్రైఫ్రూట్ లడ్డూలు

పర్వతారోహణ చేయాలంటే చాలా శక్తి కావాలి. అందుకు మంచి ఆహారం ఉండాలి. ‘మేము శాకాహారులం. పర్వతారోహణలో మాకు పప్పన్నం మాత్రమే శాకాహారంగా దొరికింది. అయితే పాపకు నేను ఖర్జూరాలు, డ్రైఫ్రూట్ లడ్డూలు ఎక్కువగా పెట్టాను. వేణ్నీళ్లు ఎక్కువగా తాగేలా చూశాను. చలి నుంచి కాపాడటానికి 7 దొంతరల బట్టలు తొడిగి జాగ్రత్త తీసుకున్నాను. ఆ దారిలో మైనస్ 3 నుంచి మైనస్ 16 వరకు ఉష్ణోగ్రతలు ఉండేవి. ఒక్కోసారి పాప తలనొప్పి, చెవుల నొప్పి అని కంప్లయింట్ చేసేది. అయితే అదృష్టవశాత్తూ కొద్దిపాటి మందులతో కుదుటపడింది’ అని తెలిపింది డింపుల్.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ దగ్గర చెయ్యూపుతూ నిలబడటంతో మన దేశం నుంచి అత్యంత చిన్న వయసులో అక్కడివరకూ చేరిన చిన్నారిగా ఆరిష్కా రికార్డు సాధించింది. ‘ఇక ఆమెను మరింత ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దుతాను. ఎవరెస్ట్ ఎక్కేలా చేస్తాను. తోడుగా కావాలంటే నేనూ ఎక్కుతాను’ అని తెలిపింది డింపుల్. తండ్రి కౌస్తుభ్ ‘నా కూతురిని చూసి గర్వపడుతున్నాను. ఈ ఘనత అంతా తల్లీకూతుళ్లదే. నేను కేవలం సపోర్టింగ్ యాక్టర్‌ని’ అని నవ్వాడు.

ఆరిష్కాకు అభినందనలు. ●

స్వర విన్యాసాలు యూత్‌కు కొత్త కాదు.
అయితే ఆ కళ ఇప్పుడు తమ వ్యక్తిగత వినోదానికి మాత్రమే పరిమితం కావడం లేదు.
ఆ కళ కెరీర్‌గా మారి వారిని ఎక్కడికో తీసుకువెళుతోంది.
‘ది వాయిస్ ఈజ్ ఏ సెకండ్ ఫేస్’ అనే మాట ఉంది.
అదేమిటోగానీ...
తమ వాయిస్ యూత్‌కు బలంగా మారింది.
అది ఇప్పుడు కొత్త అవకాశాలకు దారి చూపుతోంది....



నీ పలుకే బంగారం!



> నా గొంతు విని ఆశ్చర్యపోయేవారు. అసహ్యంగా ముఖం పెట్టేవారు... అదే గొంతు విని అభినందించే స్థాయికి చేరుకోవాలి అనే పట్టుదలతో వాయిస్–వోవర్ రంగంవైపు వచ్చాను.
> – రీచా నిగమ్

పాండమిక్ టైమ్‌లో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు దూసుకుపోవడం అనేది ఒక కోణం అయితే ఆ ప్లాట్‌ఫామ్‌ల వల్ల స్వర బలం కలిగిన యువతకు బోలెడు అవకాశాలు రావడం రెండో కోణం.

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లే కాదు న్యూస్‌రీడింగ్, పాడ్‌కాస్ట్, ఫిల్మ్, డాక్యుమెంటరీలు, రేడియో... మొదలైన విభాగాలలో యువతకు మంచి అవకాశాలు వస్తున్నాయి.

వాయిస్ వోవర్ ప్రొఫెషన్‌కు ఎలాంటి ప్రత్యేక అకడమిక్ క్వాలిఫికేషన్‌లు అక్కర్లేకపోయినా వాయిస్–వోవర్‌పై షార్ట్–టర్మ్ కోర్సులు రూపొందించిన మీడియా ఇన్‌స్టిట్యూట్‌లలో చేరడానికి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

ఓవర్‌నైట్ సక్సెస్ కావాలనుకోవడం లేదు. పరుగులు తీయాలనుకోవడం లేదు.

‘కళాకారులకు బోలెడు ఓపిక కావాలి’ అనేది వారికి తెలియనిదేమీ కాదు.

యువతకు అత్యంత స్ఫూర్తి ఇస్తున్న వాయిస్–వోవర్ ఆర్టిస్ట్‌లలో రీచా నిగమ్ ఒకరు.

ముంబైకి చెందిన రీచా నిగమ్ కుటుంబంలో అందరూ గాయకులే. రీచాకు శాస్త్రీయసంగీతం నేర్పిద్దాం అనుకున్నాడు తండ్రి. అయితే ఆమె గొంతు విన్న గురువు ‘అమ్మాయి గొంతు సంగీతానికి సరిపోదేమో’ అని పెదవి విరిచాడు.

ఇక స్కూల్‌రోజుల్లో ఆమె గొంతును ‘హస్కీ వాయిస్’ ‘అన్‌పర్‌ఫెక్ట్‌వాయిస్’ ‘హారర్ వాయిస్’... ఇలా రకరకాలుగా పిలుచుకునేవారు.

తన గొంతులో ఉన్న ప్రత్యేకత వల్ల తమ ఆల్–గర్ల్స్ స్కూల్‌లో ప్రదర్శించే నాటకాలలో మగ పాత్రలు తానే వేసేది రీచా.

‘నా గొంతు విని ఆశ్చర్య పోయేవారు. అసహ్యంగా ముఖం పెట్టేవారు...అదే గొంతు విని అభినందించే స్థాయికి చేరుకోవాలి’ అనే పట్టుదల ఆమెలో పెరిగి వాయిస్–వోవర్ రంగం వైపుకు రావడానికి కారణం అయింది.

‘నా గొంతు విని ఎవరు అవకాశాలు ఇస్తారు?’ అని ఆమె ఎప్పుడూ నిరాశ పడలేదు.

‘ఎక్కడో ఏదో అవకాశం నన్ను వెదుక్కుంటూ తప్పకుండా వస్తుంది’ అని బలంగా నమ్మింది. ఆమె నమ్మకం వృథా పోలేదు. ఒక యాడ్ ఫిల్మ్‌లో ఒక అమ్మాయికి నాన్–సిటీ వాయిస్, అన్‌పాలిష్డ్ వాయిస్‌తో వాయిస్–వోవర్ చెప్పే అవకాశం వచ్చింది.

ఇక ఆమె వెనక్కి తిరిగిచూసుకోలేదు.

తన యూనిక్ వాయిస్‌తో మన దేశంలోని టాప్–5 వాయిస్ వోవర్ ఆర్టిస్ట్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది రీచా నిగమ్.



> ఈ విద్యకు ఏకాగ్రత అనేది అతి ముఖ్యం. సమయస్ఫూర్తి ఉంటే మ్యాజిక్ సృష్టించవచ్చు.
> – రవీనా రవి

లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడమే కాదు, ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో తాము రాణించాలనుకుంటున్న రంగంలోని ప్రతిభావంతులు చెప్పే మంచి మాటలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది యువత. దీనికి ఉదాహరణ వాయిస్ యాక్టర్ రవీనా రవి.

దక్షిణాది సినిమాలలో స్టార్ హీరోయిన్‌లకు డబ్బింగ్ చెబుతోంది రవీనా.

‘వాయిస్ వోవర్ అంటే స్క్రీన్ చూస్తూ మైక్ ముందు మాట్లాడడం కాదు. అది యాంత్రికమైన పని ఎంత మాత్రం కాదు. మూడ్ ఆఫ్ ది క్యారెక్టర్‌ను పట్టుకోగలగాలి. నటులలో ప్రతి ఒక్కరికీ తమదైన ప్రత్యేకత ఉంటుంది. ప్రతి ఎమోషన్‌కు ఒక మీటర్ ఉంటుంది. దానిపై అవగాహన ఉండాలి. ఈ విద్యకు ఏకాగ్రత అనేది అతి ముఖ్యం. తగినంత సమయస్ఫూర్తి ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చు’ అంటోంది రవీనా రవి.

‘కోకిలలాంటి తీయటి గొంతు ఉంటే చాలు...’

‘కంచుకంఠం నీ సొంతమైతే చాలు...’

‘అవకాశాలు పరుగెత్తుకుంటూ వస్తాయి’ అనేది ఒకప్పటి మాట.

రచయితలు రకరకాల పాత్రలు సృష్టించడం, మాండలికాలకు వినోదరంగంలో మహర్దశ నడుస్తుండడం... మొదలైన కారణాల వల్ల ఇప్పుడు రకరకాల గొంతులకు ఇండ్రస్టీ స్వాగతం పలుకుతోంది.

‘నా వాయిస్ డిఫరెంట్‌గా ఉంటుందని ఫ్రెండ్స్ అంటుంటారు. నేనెందుకు వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా ప్రయత్నించకూడదు’ అనుకుంటున్నారు వారు యువతరంలో పెద్ద సంఖ్యలోనే కనిపిస్తున్నారు. ●

యూత్ పల్స్

ఒక పుస్తకం.. ఒక చాయ్!

● ఒక విజయ గీతిక




గీతిక ఆనంద్

కుటుంబం, స్నేహితులు ఎవరూ లేని ఒంటరితనం చుట్టుముట్టినప్పుడు వచ్చిన ఆలోచనను అమలులో పెట్టింది గీతిక ఆనంద్. కితాబీ చాయ్ (బుక్ టీ)పేరుతో కేఫ్ అండ్ బుక్ స్టోర్ ప్రారంభించి, సక్సెస్ బాటలో నడిపిస్తోంది. ఈ కేఫ్‌లో ఆరు వేలకు పైగా పుస్తకాలు ఉంటాయి. వంద రూపాయలు చెల్లించి, నచ్చిన పుస్తకాన్ని ఎంచుకొని మూడు గంటల పాటు కూర్చొని టీ తాగుతూ చదువుకోవచ్చు. పుణేలో ఉన్న ఈ కేఫ్ నుంచి దేశంలో ఎక్కడ నుంచైనా పుస్తకాలను కొనుగోలు చేయవచ్చు. ఈ స్టోర్ గురించి వచ్చిన ఆలోచనను గీతిక పంచుకుంటూ...

‘‘రాత్రి తర్వాత ఉదయం కచ్చితంగా వస్తుందని చెబుతారు. అలాగే చెడు కాలం కూడా వెళ్లిపోతుంది. అయితే కష్ట సమయాల్లో ఓర్పు, ధైర్యం చాలా ముఖ్యం అని నా జీవితమే నాకు తెలియజేసింది. ఇండోర్‌లో పుట్టి పెరిగాను. ఇప్పుడు పుణేలో వ్యాపారవేత్తగా ఉన్నాను. నా జీవితంలో అత్యంత బాధాకరమైన విషయం పెళ్లి బంధం నుంచి విడిపోవడం. విడాకుల సమయంలో నా చుట్టూ ఒంటరితనం తప్ప మరేమీ లేదు. బయట ఏదైనా ప్లేస్‌లో కాసేపు కూర్చోవడానికి చాలా చోట్లు వెతకాల్సి వచ్చింది.

కళ్లలో ఎన్నో కలలు

2013లో పెళ్లి తర్వాత పుణే వచ్చాను. ఏవేవో కలలు ఉండేవి. కానీ, అవన్నీ కుటుంబం చుట్టూ తిరిగేవి. కానీ, 2017లో విడాకులు తీసుకోవడంతో నా కలలన్నీ కుప్పకూలిపోయాయి. ఆ కాలం నా జీవితంలో ఒక పీడకల. ప్రతీది వ్యాపారీకరణ అయిన ఈ రోజుల్లో ఎక్కడా ప్రశాంతంగా కాసేపు కూర్చోలేకపోయాను. అప్పుడే, ఎలాంటి ఆటంకం లేకుండా గంటల తరబడి కూర్చునే కేఫ్‌ని ఎందుకు ప్రారంభించకూడదు అనుకున్నాను. ఒంటరితనంతో బాధపడేవారికి పుస్తకాలు చాలా ఊరటనిస్తాయి. వాటిని చదువుకుంటూ గంటలు గంటలు గడిపేయవచ్చు. అందుకు ఇల్లులాంటి మరో ప్లేస్ కావాలి. నాకు టీ తాగడం, పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. ఈ అనుభూతిని మిగతావారుకూడా పొందవచ్చు కదా అనుకున్నాను.

ఐదేళ్ల క్రితం..

ఈ బుక్ కేఫ్ నడపడానికి ముందు తొమ్మిదేళ్లు కార్పొరేట్ రంగంలో రోజుకు 16 గంటలు పనిచేశాను. ఆ సమయంలో ‘ఉద్యోగం కోసం ఇంత సమయం ఇస్తున్నాను, ఎందుకు నా సొంత వ్యాపారం ప్రారంభించకూడద’ని అనిపించేది. ఉద్యోగానికి రిజైన్ చేసిన నెల రోజులకు పుణెలో కేఫ్ ప్రారంభించాను. ఒక మహిళగా వ్యాపారం చేయడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. రెగ్యులర్‌గా ఒక కిరాణా షాపులో సరుకులు కొనేదాన్ని. ఒకరోజు అతను మా కేఫ్‌కి వచ్చి, ‘మీ బాస్‌ని పిలవమ’ని చెప్పాడు. ‘నేనే ఓనర్’ అని చెప్పడంతో అతను ‘మీరు ఒక మహిళ కదా!’ అని నాతో జాలి చూపుతున్నట్టు మాట్లాడాడు. చాలా బాధగా అనిపించింది. వ్యాపారం ప్రారంభించడానికి నా నగలను అమ్మేశాను, పొదుపు చేసినదంతా ఉపయోగించాను. ఇక్కడ కస్టమర్లకు తమ ఇంట్లో ఉన్న అనుభూతిని కలిగించాలని కోరుకున్నాను. దీని కోసం, నేను కేఫ్‌లో టేబుల్–కుర్చీలు, బీన్ బ్యాగ్‌లు, కుషన్‌లు ఉంచాను. టీ, కాఫీల ఏర్పాట్లు చేశాను. పుస్తకాలు సేకరించాను. నేడు కేఫ్‌లో 6 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. ఒక్కరు రూ.100తో మూడు గంటల పాటు కూర్చొని టీ తాగుతూ పుస్తకాన్ని ఆస్వాదించవచ్చు.


‘కితాబీ చాయ్’ కేఫ్ అండ్ బుక్ స్టోర్

ఎక్కడ నుంచైనా..

ఇక్కడ కూర్చొని పుస్తకాలు చదవవచ్చు. అద్దెకు కూడా తీసుకెళ్లొచ్చు. ఇది ఒక బుక్ స్టోర్‌గా కూడా ఉపయోగిస్తున్నాం. దేశంలో ఎవరైనా మా నుండి పుస్తకాలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. అన్ని భాషల్లోనూ పుస్తకాలు లభిస్తాయి. 50 పుస్తక ప్రచురణ సంస్థలతో టై అప్‌లో ఉన్నాను. విరాళాలతో కూడా పుస్తకాలు జమ చేశాను. అయితే, ఐదేళ్లయినా జనం కితాబీ చాయ్ భావనను అర్థం చేసుకోలేదనుకుంటున్నాను. పుస్తక దుకాణం అని కొందరు, కేఫ్ అని కొందరు అనుకుంటారు.

చిన్నప్పుడు పుస్తకాలతో చేసిన దోస్తీ ఇప్పటికీ అంతకంతకు పెరిగిందే తప్ప ఏ మాత్రం తగ్గలేదు. మా రెండవ ఇల్లు లాంటిదని ఇక్కడకు వచ్చినవాళ్లు ఆత్మీయంగా చెబుతుంటే మాత్రం చాలా ఆనందం కలుగుతుంది’’ అని వివరిస్తుంది గీతిక. ●

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ



ఈ సీజన్‌లో తమ నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తూ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 1–6, 10–5తో 'సూపర్ టైబ్రేక్‌'లో మార్సెలో మెలో (బ్రెజిల్)–అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంటను ఓడించింది. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

హెడ్ కోచ్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం



భారత సీనియర్ మహిళల క్రికెట్ జట్టు హెడ్ కోచ్ పదవికి దరఖాస్తులు కోరుతూ బీసీసీఐ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 60 ఏళ్లలోపు వారై ఉండి... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్‌గానీ, 50 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవమైనా ఉన్నాకానీ లేదంటే ఎన్‌సీఏ లెవల్ 'సి' కోచింగ్ సర్టిఫికెట్, అంతర్జాతీయ టి20 జట్టుకు కనీసం ఒక్క సీజన్‌కైనా కోచింగ్ చేసి ఉండాలి. ఇందులో ఏ ఒక్క అర్హత ఉన్నా ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీసీఐ కోరింది.

హరికృష్ణకు కాంస్యం



సాక్షి, హైదరాబాద్: బుకారెస్ట్ గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ కాంస్య పతకం సాధించాడు. రొమేనియాలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత మాక్సిమ్ చిగయెవ్ (రష్యా), డేనియల్ బొగ్డాన్ (రొమేనియా), హరికృష్ణ 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. చిగయెవ్‌కు టాప్ ర్యాంక్ దక్కగా... బొగ్డాన్‌కు రెండో ర్యాంక్, హరికృష్ణకు మూడో ర్యాంక్ లభించాయి. హరికృష్ణ మొత్తం ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని, భారత్‌కే చెందిన యువ గ్రాండ్ మాస్టర్ రౌనక్‌తో జరిగిన గేమ్‌లో ఓడిపోయాడు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేశాకే బరిలోకి...

భారత స్టార్ రెజ్లర్ల స్పష్టీకరణ



న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ ను అరెస్టు చేసే వరకు... తాము విదేశీ టోర్నీల్లో పాల్గొనేది లేదని భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ తెలిపారు. 'రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినా ఇంకా బ్రిజ్‌భూషణ్ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఫిర్యాదు చేసిన మహిళా రెజ్లర్ల నుంచి ఢిల్లీ పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు. విచారణకు రావాలని ఇంకా బ్రిజ్ భూషణ్‌కు నోటీసులు కూడా జారీ చేయలేదు. కొన్నేళ్లుగా మా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. గత జనవరిలో కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ పర్యవేక్షక కమిటీని నియమించి ఈ వివాదాన్ని ముగించాలని చూశారు. అంతే తప్ప ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు' అని వినేశ్ వ్యాఖ్యానించింది. జూన్ 1 నుంచి 4 వరకు కిర్గిస్తాన్‌లో జరిగే ర్యాంకింగ్ సిరీస్ టోర్నీకి దూరంగా ఉన్నామని వినేశ్, బజరంగ్, సాక్షి తెలిపారు.

ఢిల్లీని గట్టెక్కించిన ఇషాంత్

- గుజరాత్‌పై 5 పరుగులతో గెలుపు
- షమీ బుల్లెట్ బౌలింగ్ వృథా
- క్యాపిటల్స్‌ను ఆదుకున్న అమన్



అహ్మదాబాద్: తక్కువ స్కోర్లేగా... తుక్కుతుక్కు కింద కొట్టేస్తామంటే కుదరదు! ఎందుకంటే ఈ సీజన్‌లో తక్కువ స్కోర్ల మ్యాచ్‌లే ఆఖర్లో ఎక్కువ ఉత్కంఠ రేపుతున్నాయి. అలాంటి రసవత్తర పోరులో ఢిల్లీని ఆఖరి ఓవర్‌తో ఇషాంత్ శర్మ (2/23)) గెలిపించాడు. దీంతో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ సొంతగడ్డపై 5 పరుగుల తేడాతో ఓడింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. అమన్ హకీమ్ (44 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించగా, రిపాల్ పటేల్ (13 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (4/11) అదరగొట్టాడు. తర్వాత గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడింది. హార్దిక్ పాండ్యా (53 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు.

షమీ నిప్పులు చెరగడంతో...

వెటరన్ సీమర్ షమీ నిప్పులు చెరగడంతో ఢిల్లీ బ్యాటర్లు హడలెత్తారు. ఒకదశలో 5 ఓవర్లకే 23 పరుగుల వద్ద సగం వికెట్లు కూలడంతో ఢిల్లీ 10, 12 ఓవర్లయినా ఆడుతుందా అనే సందేహం కలిగింది. అంతలా అతని పేస్ పదును క్యాపిటల్స్‌ను దెబ్బ తీసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సాల్ట్ (0)ను డకౌట్ చేసిన షమీ తన వరుస ఓవర్లలో రోసో (8), మనీశ్ పాండే (1), ప్రియమ్ గార్గ్ (10)లను అవుట్ చేశాడు. ఈ దశలో ఢిల్లీని అమన్ హకీమ్, అక్షర్ పటేల్ (30 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. అక్షర్ అవుటయ్యాక అమన్ నిలకడగా ఆడి అర్ధసెంచరీ సాధించడంతో ఢిల్లీ వంద పైచిలుకు స్కోరు చేసింది.


షమీ

పాండ్యా ఆఖరిదాకా ఉన్నా...

అచ్చూ ఢిల్లీలాగే... టైటాన్స్ కూడా ప్రధాన బ్యాటర్లు సాహా (0), గిల్ (6), విజయ్ శంకర్ (6), మిల్లర్ (0)లను ఆరంభంలోనే కోల్పోయింది. 32/4 స్కోరుతో కష్టాల్లో ఉన్న గుజరాత్‌ను మనోహర్ (33 బంతుల్లో 26; 1 సిక్స్) అండతో కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిలబెట్టాడు. కానీ ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌కు 12 బంతుల్లో 33 పరుగుల సమీకరణం కష్టమైంది. అయితే 19వ ఓవర్లో తెవాటియా (7 బంతుల్లో 20; 3 సిక్సర్లు) హ్యాట్రిక్ సిక్సర్లు గుజరాత్‌ను విజయం వైపునకు తీసుకెళ్లాయి. 6 బంతులకు 12 పరుగులు కావాల్సి ఉండగా... ఇషాంత్ ప్రమాదకరమైన తెవాటియాను అవుట్ చేసి 6 పరుగులే ఇవ్వడంతో ఢిల్లీకి పోయిన ప్రాణం తిరిగొచ్చింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) మిల్లర్ (బి) షమీ 0; వార్నర్ (రనౌట్) 2; ప్రియమ్ (సి) సాహా (బి) షమీ 10; రోసో (సి) సాహా (బి) షమీ 8; పాండే (సి) సాహా (బి) షమీ 1; అక్షర్ (సి) రషీద్ (బి) మోహిత్ 27; అమన్ హకీమ్ (సి) మనోహర్ (బి) రషీద్ 51; రిపాల్ (సి) పాండ్యా (బి) మోహిత్ 23; నోర్జే (నాటౌట్) 3; కుల్దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 130.**
వికెట్ల పతనం: 1–0, 2–6, 3–16, 4–22, 4–23, 6–73, 7–126, 8–130. **బౌలింగ్:** షమీ 4–0–11–4, హార్దిక్ 1–0–10–0, జోష్ లిటిల్ 3–0–27–0, రషీద్ 4–0–28–1, నూర్ అహ్మద్ 4–0–20–0, మోహిత్ శర్మ 4–0–33–2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: వృద్ధిమాన్ సాహా (సి) సాల్ట్ (బి) ఖలీల్ అహ్మద్ 0; శుబ్‌మన్ గిల్ (సి) మనీశ్ పాండే (బి) నోర్జే 6; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 59; విజయ్ శంకర్ (బి) ఇషాంత్ శర్మ 6; డేవిడ్ మిల్లర్ (బి) కుల్దీప్ యాదవ్ 0; అభినవ్ మనోహర్ (సి) అమన్ (బి) ఖలీల్ అహ్మద్ 26; తెవాటియా (సి) రోసో (బి) ఇషాంత్ శర్మ 20; రషీద్ ఖాన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 125.**
వికెట్ల పతనం: 1–0, 2–18, 3–26, 4–32, 5–94, 6–122. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–1–24–2, ఇషాంత్ శర్మ 4–0–23–2, నోర్జే 4–0–39–1, కుల్దీప్ యాదవ్ 4–0–15–1, అక్షర్ పటేల్ 4–0–24–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	9	6	3	12	0.532
రాజస్తాన్	9	5	4	10	0.800
లక్నో	9	5	4	10	0.639
చెన్నై	9	5	4	10	0.329
బెంగళూరు	9	5	4	10	-0.030
పంజాబ్	9	5	4	10	-0.447
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	9	3	6	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × చెన్నై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
పంజాబ్ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి భారత్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా 121 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానం నుంచి తొలి స్థానానికి ఎగబాకింది. గత 15 నెలలుగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా 122 రేటింగ్ పాయింట్ల నుంచి 116 రేటింగ్ పాయింట్లకు పడిపోయి రెండో స్థానానికి చేరుకుంది. భారత్ చివరిసారి 2021 డిసెంబర్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత్, ఆస్ట్రేలియా జట్లు వచ్చే నెలలో లండన్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడనున్నాయి. ప్రస్తుతం టెస్టు సిరీస్‌లు లేకపోయినా... 2019–2020 సీజన్‌లో నమోదైన టెస్ట్ సిరీస్ ఫలితాలను తొలగించడంతో ర్యాంకింగ్స్‌లో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. పురుషుల టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్ ర్యాంక్‌లోనే కొనసాగుతుండగా ... పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్ ముగిశాక మే 10న వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు.

కోహ్లి, గంభీర్‌లపై భారీ జరిమానా

నవీనుల్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత


నవీనుల్

లక్నో: కోహ్లి, గంభీర్‌ల జగడంపై బీసీసీఐ గట్టి చర్యలే తీసుకుంది. ఇద్దరి మ్యాచ్ ఫీజులపై వంద శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించగా... లక్నో బౌలర్ నవీనుల్ హఖ్‌పై 50 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించింది. సోమవారం బెంగళూరు, లక్నో జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఇద్దరు మాటల యుద్ధానికి దిగారు. బెంగళూరు స్టార్ బ్యాటర్ కోహ్లి, లక్నో మెంటార్ గంభీర్‌లు... సహచరులు వారిస్తున్నా, అంపైర్లు సముదాయిస్తున్నా... ముఖాముఖిగా దూసుకొచ్చి మరీ వాగ్వాదానికి దిగారు. ఇది కాస్తా తీవ్రరూపం దాల్చింది. మ్యాచ్ చూడటానికి స్టేడియానికి వచ్చిన ప్రేక్షకులు తమ ఫోన్ కెమెరాలతో ఈ తతంగాన్ని వీడియో తీసి సోషల్ నెట్‌వర్క్ సైట్లలో పెట్టారు. ఆటగాళ్ల ప్రవర్తన కూడా గీత దాటడంతో ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.21 అతిక్రమణ కింద చర్యలు తీసుకున్నారు. సాధారణంగా 25, 50, 75 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించడం ఆనవాయితీ కాగా... వారి వివాదం పెను దుమారం రేపడంతో మొత్తం మ్యాచ్ ఫీజు (వంద శాతం)ను జరిమానాగా విధించారు. నిజానికి టీమిండియా విజయాల్లో కీలకపాత్ర పోషించిన గంభీర్, కోహ్లి మధ్య ఉన్న సాహచర్యాన్ని 2013 ఐపీఎల్ సీజన్ దెబ్బ తీసింది. అప్పుడు కోల్‌కతా కెప్టెన్ గంభీర్, బెంగళూరు కెప్టెన్ కోహ్లి నువ్వెంతంటే నువ్వెంతని మాటల యుద్ధానికి దిగారు. పదేళ్లనాటి ఈ వైరం పెరిగిందే తప్ప ఇప్పటికీ తగ్గలేదు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆశిష్



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో రోజు భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఆశిష్ చౌదరీ (80 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... హర్ష్ చౌదరీ (86 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ బౌట్‌లలో ఆశిష్ 4–1తో మేసమ్ గెష్లాగి (ఇరాన్)పై గెలుపొందగా... హర్ష్ 0–5తో బిల్లీ మెక్‌అలిస్టర్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే బౌట్‌లో నిశాంత్ దేవ్ (71 కేజీలు) తొలి రౌండ్‌లో సర్ఖాన్ (అజర్‌బైజాన్)తో తలపడతాడు. ఈ మెగా టోర్నీలో 107 దేశాల నుంచి 538 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

సినిమా

ఈ నెలలోనే ఛత్రపతి



బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ బాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఛత్రపతి'. విజయేంద్ర ప్రసాద్ కథ అందించిన ఈ సినిమాకి వీవీ వినాయక్ దర్శకత్వం వహించారు. నుష్రత్ బరుచ్చా హీరోయిన్‌గా నటించారు. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఛత్రపతి' (2005)ని అదే పేరుతో హిందీలో రీమేక్ చేశారు. డాక్టర్ జయంతి లాల్ గడా సమర్పణలో పెన్ స్టూడియోస్‌పై ధవల్ జయంతిలాల్ గడా, అక్షయ్ జయంతిలాల్ గడా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు మేకర్స్. ''తెలుగు 'ఛత్రపతి' సినిమా బ్యాక్‌డ్రాప్‌ని మార్చి, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా హిందీ 'ఛత్రపతి'ని తెరకెక్కించారు వినాయక్. శ్రీనివాస్ రగ్డ్ అండ్ మాస్ లుక్‌లో కనిపిస్తాడు. భావోద్వేగ సన్నివేశాల్లోనూ అద్భుతంగా నటించాడు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ అలీ షఫీ, సంగీతం: తనిష్క్ బాగ్చి, వరల్డ్ వైడ్ విడుదల: పెన్ మరుధర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్.

నా కొత్త నేస్తాన్ని స్వాగతించండి - సల్మాన్ ఖాన్


గ్రూట్

ప్రస్తుతం తన కొత్త ఫ్రెండ్ 'గ్రూట్' అంటున్నారు సల్మాన్ ఖాన్. గ్రూట్ ఎవరో హాలీవుడ్ ఫ్రాంచైజీ 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ' చిత్రాలు చూసినవారికి తెలిసిందే. ఈ చిత్రాల్లోని కీలక పాత్ర గ్రూట్. ఈ నెల 5న 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3' విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సల్మాన్ ఖాన్ 'గ్రూట్'కి సంబంధించిన సీన్‌ని ఫోన్‌లో చూస్తుండటం, ఆ తర్వాత విలేకరుల సమావేశంలో పాల్గొని, ఏ ప్రశ్న అడిగినా 'నేను సల్మాన్' అని చెప్పే వీడియోను రిలీజ్ చేసింది యూనిట్. సోషల్ మీడియాలో ఈ వీడియోను షేర్ చేసి, నా కొత్త ఫ్రెండ్ గ్రూట్‌ని స్వాగతించండి అన్నారు సల్మాన్. ఇక దేశ వ్యాప్తంగా ఇంగ్లిష్., హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ శుక్రవారం 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3' రిలీజ్ కానుంది.



"కుటుంబం అంతా కలసి థియేటర్‌కి వెళ్లి చూడడానికి ఒక మంచి చిత్రం కావాలి. అందరూ కూర్చుని హ్యాపీగా చూసే సినిమా అవసరం. అలాంటి మూవీ రావడం లేదనే లోటుని 'రామబాణం' భర్తీ చేస్తుంది" అన్నారు డైరెక్టర్ శ్రీవాస్. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా తెరకెక్కిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు శ్రీవాస్ మీడియాతో పంచుకున్న విశేషాలు.

ఆ లోటుని రామబాణం భర్తీ చేస్తుంది - డైరెక్టర్ శ్రీవాస్

- 'లక్ష్యం, లౌక్యం' తర్వాత గోపీచంద్‌గారు, నేను మళ్లీ ఓ మూవీ అనుకున్నప్పుడు ఒక మంచి యాక్షన్ సినిమా చేద్దామనుకున్నాను. అయితే మా కాంబినేషన్‌లో వచ్చిన 'లక్ష్యం, లౌక్యం' సినిమాలను ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్, క్లాస్.. ఇలా అందరూ ఇష్టపడ్డారు. దీంతో మా నుంచి ప్రేక్షకులు మళ్లీ అలాంటి సినిమా కోరుకుంటారని భావించి, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో యాక్షన్, ఎమోషన్స్ ఉన్న 'రామబాణం' చేశాం.
- 'లక్ష్యం' తర్వాత గోపీచంద్, జగపతిబాబుగారు మళ్లీ కలసి చేస్తున్నారు కాబట్టి 'లక్ష్యం 2' అని వర్కింగ్ టైటిల్ అనుకున్నాం. అయితే ఆ సినిమా కథకు ఇది సీక్వెల్ అనుకునే అవకాశం ఉంది కాబట్టి 'రామబాణం' టైటిల్ ఫిక్స్ చేశాం. కరోనా తర్వాత జనాలు చాలావరకు ఆర్గానిక్ ఫుడ్‌పై ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఈ కథలో కూడా ఆర్గానిక్ ఫుడ్ గురించి అవసరం మేరకు చెప్పాం.
- ఫ్యామిలీ ఎమోషన్స్ తీయడం తేలిక కాదు.. మన జీవితం నుంచి పాత్రలు రావాలి. నేనిలాంటి తరహా సినిమాలు చేయడానికి నేను వచ్చిన నేపథ్యం కారణం కావచ్చు. పైగా ఇలాంటి చిత్రాలతోనే నాకు ప్రేక్షకాదరణ లభించింది. కానీ అన్ని రకాల చిత్రాలు చేయడానికి రెడీగా ఉన్నాను.
- దాసరిగారిలా సొంత కథ రాసుకొని డైరెక్ట్ చేయగలను. అలాగే రాఘవేంద్రరావుగారిలా ఎవరైనా మంచి పాయింట్ చెబితే స్క్రిప్ట్‌గా మలచుకోగలను. అయితే రెడీమేడ్‌గా ఉన్న మంచి కథలని ఎంచుకొని దర్శకత్వంపై ఎక్కువ దృష్టి పెట్టాలనేది నా వ్యక్తిగత అభిప్రాయం. మనం చేసే సినిమా పాన్ ఇండియాకి వెళ్లాలి కానీ.. పాన్ ఇండియా సినిమా చేయాలనుకుని చేస్తే కుదరదనుకుంటున్నాను.

యమ భటులం...


'వెన్నెల' కిశోర్, శ్రీనివాస్ రెడ్డి

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, 'వెన్నెల' కిశోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నూతన దర్శకుడు యలమంద చరణ్ తెరకెక్కించిన చిత్రం 'భువన విజయమ్'. కిరణ్, వీఎస్కే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'నువ్వు చనిపోతే తీసుకెళ్లడానికి వచ్చిన యమ భటులం.. అట్లాంటప్పుడు మనం నరకానికి పోవాలి కానీ ఈ సినిమా ఆఫీసుకు వచ్చుడేంది సర్' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఫన్, ఎమోషన్, సస్పెన్స్, థ్రిల్.. ఇలా అన్నీ ఉన్న చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: సాయి.

ఆత్మ కథ

ప్రతి సినిమా కథకీ ఒక సోల్ ఉంటుంది. ఆ ఆత్మ ఎంత బలంగా ఉంటే సినిమా అంతగా ప్రేక్షకులకు దగ్గరవుతుంది. ఒకవేళ సినిమా కథే 'ఆత్మ' చుట్టూ తిరిగితే.. ఆ ఆత్మ భయపెడుతుంది... థ్రిల్‌కి గురి చేస్తుంది. ఆత్మ చుట్టూ అల్లిన కథ బలంగా ఉంటే.. బాక్సాఫీస్ ఖజానాని వసూళ్లు ఆవహించినట్టే. ఇక ప్రస్తుతం ఆత్మ, ప్రేతాత్మల నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న 'ఆత్మ'కథా చిత్రాల గురించి తెలుసుకుందాం.


'అన్వేషి'లో...


- రాశీ ఖన్నాకి హారర్ జానర్ అంటే ఇష్టం. అందుకే హారర్ జానర్‌లో సాగే 'అరణ్‌మణై 3'కి చాన్స్ వచ్చినప్పుడు హ్యాపీగా ఓకే చెప్పేశారు. ఇప్పుడు నాలుగో భాగంలోనూ నటిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుందర్. సి కీలక పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన 'అరణ్‌మణై', 'అరణ్‌మణై 2', 'అరణ్‌మణై 3' ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు నాలుగో భాగం నిర్మాణంలో ఉంది. ఈ చిత్రంలో ఆర్య హీరో. గత మూడు భాగాల్లో నటించిన చిత్రదర్శకుడు సుందర్ ఇందులోనూ కీలక పాత్రలో కనిపిస్తారు. రాశీ ఖన్నా ఒక కథానాయిక కాగా మరో నాయికగా తమన్నా నటిస్తున్నారు. మూడో భాగంలో ఆండ్రియా ఆత్మగా కనిపించారు. నాలుగో భాగంలో తమన్నానే ఆత్మ అని సమాచారం. మరి.. తమన్నా, రాశీల్లో ఆత్మ ఎవరనేది ఈ ఏడాది చివర్లో తెలిసిపోతుంది. డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.
- క్యూట్ బ్యూటీ సమంత ప్రేతాత్మగా భయపెట్టనున్నారని సమాచారం. అది కూడా హిందీ ప్రేక్షకులను. ఆయుష్మాన్ ఖురానా, సమంత జంటగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. హారర్–కామెడీ జానర్‌లో సాగే ఈ చిత్రంలో సమంత రెండు పాత్రల్లో కనిపిస్తారని, అందులో ఒకటి ప్రేతాత్మ పాత్ర అని టాక్. 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ఆరంభమవుతుందని బాలీవుడ్ ఖబర్.


'ఊరు పేరు భైరవకోన'లో సందీప్ కిషన్

- 'ఎవరికీ అంతు చిక్కని రహస్య ప్రపంచం భైరవకోనలోకి ప్రవేశించండి' అంటూ సందీప్ కిషన్ హీరోగా రూపొందుతున్న 'ఊరు పేరు భైరవకోన' ఫస్ట్ లుక్ విడుదలైన విషయం తెలిసిందే. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ మిస్టరీ మూవీలో ఆత్మల నేపథ్యం కూడా ఉంటుందని సమాచారం. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.
- ఓ యువకుడు డిటెక్టివ్ కావాలనుకుంటాడు. ప్రేమలో పడిన అతడు తన ప్రేయసితో ఆనందంగా ఉంటాడు. అతని హ్యాపీ లైఫ్ ఒక టర్న్ తీసుకుంటుంది. రాత్రి సమయంలో రాకపోకలు నిషేధం అయిన మారేడు కోన ప్రాంతానికి అతను వెళ్లాల్సి ఉంటుంది. ఆ ఊరికి ఆ యువకుడు ఎందుకు వెళ్లాడు? ఆ తర్వాత ఏం జరిగిందనే అంశంతో రూపొందుతున్న చిత్రం 'అన్వేషి'. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా వీజే ఖన్నా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రకథ ఆత్మలు ఉన్నాయా? అనే కోణంలో సాగుతుంది.

ఈ చిత్రాలే కాదు.. మరికొన్ని 'ఆత్మ'కథలు కూడా ఉన్నాయి. హారర్ జానర్‌కి ట్రెండ్‌తో పని లేదు. ఎప్పుడు తీసినా.. సరిగ్గా తీస్తే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.. మరి.. రానున్న 'ఆత్మ'కథల్లో ఎన్ని కథలు ప్రేక్షకులకు నచ్చుతాయో చూడాలి.


తమన్నా
సమంత
రాశీ ఖన్నా



దివంగత దర్శకులు దాసరి నారాయణరావు జయంతి (మే 4) సందర్భంగా దాసరి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వాసవి ఫిల్మ్ అవార్డ్స్ వ్యవస్థాపకులు కొత్త వెంకటేశ్వరరావు, మడిపడిగె రాజు, ముఖ్య సలహాదారులు బండారు సుబ్బారావు, పబ్బతి వెంకట రవికుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో ఆంధ్ర, తెలంగాణలో పలు రంగాల్లో కృషి చేస్తున్న ప్రతిభావంతులకు పురస్కారాలు అందించారు. దర్శకుడు కృష్ణవంశీ, నటులు శ్రీకాంత్, బ్రహ్మానందం, 'బలగం' నిర్మాత హర్షిత్ రెడ్డి, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు, ధీరజ అప్పాజీతో పాటు పలువురు పురస్కారాలు అందుకున్నారు. 'ప్రతి ఏడాది ఉత్తమ హీరోకి నా వంతుగా యాభై వేలు పారితోషికం ఇస్తాను' అని నటుడు అలీ అన్నారు.

క్రైమ్.. థ్రిల్...


కార్తీక్ రాజు

కార్తీక్ రాజు హీరోగా, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అథర్వ'. మహేశ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమాని జూన్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'అథర్వ'. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో జూన్‌లో మా సినిమాని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

సాక్షి బిజినెస్
బుధవారం
3-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	242	61,355
నిఫ్టీ ▲	83	18,148

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,090	▼	122
డోజోన్స్	33,624	▼	427
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,773	▼	78
డాక్స్	15,727	▼	195
షాంఘై (అత్రారం ముగింపు)	3,323	▲	37
నికాయ్	29,158	▲	35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (99.9 గ్రాములు)	60,417
బంగారం (99.5 గ్రాములు)	60,176
వెండి (కేజీ)	74,226

టాటా స్టీల్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,566 కోట్లు
- షేరుకి రూ. 3.6 డివిడెండ్

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం టాటా స్టీల్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 84 శాతం క్షీణించి రూ. 1,566 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 9,835 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయం తగ్గడం లాభాలను దెబ్బతీసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 69,616 కోట్ల నుంచి రూ. 63,131 కోట్లకు నీరసించింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ. 57,636 కోట్ల నుంచి రూ. 59,918 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3.60 చొప్పున డివిడెండ్



ప్రకటించింది.

యూరప్ విభాగం

యూకే, మెయిన్‌ల్యాండ్ యూరప్‌లలో రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తలెత్తిన సప్లైచైన్ అవాంతరాలకు తోడు.. అధిక వడ్డీ రేట్లు, స్టీల్ మార్జిన్లపై ఒత్తిడి తదితర అంశాల ప్రభావాన్ని సొంత అనుబంధ పరోక్ష సంస్థ టాటా స్టీల్ యూరప్ (టీఎస్ఈ) అంచనా వేసినట్లు టాటా స్టీల్ వివరించింది. వెరసి కంపెనీ బోర్డు వీటిని తట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేసింది. ప్రస్తుతం కంపెనీ నికర రుణ భారం రూ. 67,810 కోట్లుగా నమోదైనట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు 2.3 శాతం బలపడి రూ. 110 వద్ద ముగిసింది.

గో ఫస్ట్ దివాలా

- ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్
- నేటి నుంచి 3 రోజులు సర్వీసులు రద్దు
- ప్రయాణికులకు పూర్తి రిఫండ్

న్యూఢిల్లీ: దేశీయంగా మరో విమానయాన సంస్థ సంక్షోభంలో చిక్కుకుంది. ఇంజిన్ల లోపాల వల్ల సగం పైగా విమానాలను పక్కన పెట్టాల్సి రావడంతో ఆర్థికంగా కుదేలైన విమానయాన సంస్థ గో ఎయిర్‌లైన్స్ తాజాగా దివాలా ప్రకటించింది. స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అన్ని ఫ్లయిట్ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే బుక్ చేసుకున్న వారికి పూర్తి రిఫండ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 'నిర్వహణపరమైన కారణాలతో మే 3 నుంచి 5 వరకు ఫ్లయిట్లను రద్దు చేయాల్సి వస్తోంది. ప్రయాణికులకు దీని వల్ల కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నాం. వారికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తాం' అని గో ఎయిర్‌లైన్స్ పేర్కొంది. సర్వీసులను రెండు రోజులే రద్దు చేయనున్నట్లు కంపెనీ సీఈవో కౌశిక్ ఖోనా ముందుగా ప్రకటించినప్పటికీ తర్వాత మరో రోజు పెంచుతున్నట్లు సంస్థ వెల్లడించింది. 'గో ఫస్ట్' బ్రాండ్ పేరిట గో ఎయిర్‌లైన్స్ రోజూ 180–185 విమాన సర్వీసులు నిర్వహిస్తోంది. మరోవైపు, ఇంజిన్ల సరఫరాకు సంబంధించి నిర్వహణపరమైన సవాళ్ల కారణంగా గో



ఫస్ట్ ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడం దురదృష్టకరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యానించారు. గో ఫస్ట్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, సంస్థకు అన్ని విధాలుగా అవసరమైన తోడ్పాటును అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంజిన్లతో ఇక్కట్లు..

ప్రాట్ అండ్ విట్నీ సంస్థ సరఫరా చేసిన ఇంజిన్లు వరుసగా విఫలమవుతుండటం వల్ల దాదాపు సగం విమానాలు నడవడం లేదని ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన పిటిషన్‌లో గో ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఇంజిన్ల మరమ్మతు, లేదా తగినన్ని స్పేర్ ఇంజిన్లను సమకూర్చడంలోనూ ప్రాట్ అండ్ విట్నీ విఫలమైందని పేర్కొంది. 2020 జనవరి నుండి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగకపోతుండటం వల్ల రూ. 10,800 కోట్ల మేర ఆదాయాలను నష్టపోయినట్లు పేర్కొంది. 17 ఏళ్ల క్రితం ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా రూ. 6,500 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. గత రెండేళ్లలోనే రూ. 2,400 కోట్లు పైగా వెచ్చించినట్లు వివరించింది. ఇక ఆర్థికపరమైన చెల్లింపులు జరిపే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించినట్లు గో ఎయిర్‌లైన్స్ పేర్కొంది.

యూకో బ్యాంక్ లాభం హైజంప్

ముంబై: యూకో బ్యాంక్ గతేడాది చివరి త్రైమాసికం (2022–23, క్యూ4) లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. క్యూ4లో నికర లాభం 86% జంప్‌చేసి రూ. 581 కోట్లను అధిగమించింది. మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 312 కోట్లు ఆర్జించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధిక లాభం సాధించింది. రూ. 1,862 కోట్లు ఆర్జించింది. 2021–22లో రూ. 930 కోట్ల లాభం మాత్రమే నమోదైంది. ఇది 100 శాతంపైగా వృద్ధికాగా.. గతేడాది కొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 7,343 కోట్ల నికర వడ్డీ ఆదాయం పొందింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

3-5-2023	
విశాఖ	463–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
2-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

3 నెలల గరిష్టానికి మార్కెట్

ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాలు

- మెరుగైన కార్పొరేట్ క్యూ4 ఫలితాల ప్రభావం
- సెన్సెక్స్ ఎనిమిదోరోజూ, నిఫ్టీకు అయిదో రోజూ ర్యాలీ

ముంబై: స్టాక్ మార్కెట్లో లాభాల పరంపర కొనసాగుతోంది. ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ4 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు దన్నుతో సూచీలు మూడు నెలల గరిష్టం వద్ద ముగిశాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడం కలిసొచ్చాయి. ఒకరోజు సెలవు తర్వాత ప్రారంభమైన సూచీలు లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 190 పాయింట్లు పెరిగి 61,302 వద్ద, నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 18,125 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 374 పాయింట్లు ర్యాలీ చేసి 61,486 వద్ద, నిఫ్టీ 115 పాయింట్లు దూసుకెళ్లి 18,180 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే యూరప్ మార్కెట్ల బలహీన ట్రేడింగ్ ప్రభావంతో చివర్లో కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఆఖరికి



సెన్సెక్స్ 242 పాయింట్ల లాభంతో 61,355 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా ఎనిమిదోరోజూ లాభాల ముగింపు. నిఫ్టీ 83 పాయింట్లు పెరిగి 18,148 వద్ద ముగిసింది. కాగా ఈ ఇండెక్స్‌కిది అయిదోరోజూ లాభం ముగింపు కావడం విశేషం. వరుస ర్యాలీ క్రమంలో సూచీలు మూడు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. ఎఫ్‌ఎంసీజీ, టెలీ కమ్యూనికేషన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1997 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.394 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఐదుపైసలు బలహీనపడి 81.87 వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశ ప్రారంభానికి ముందు(మంగళవారం రాత్రి) ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ప్లాట్‌ఫామ్ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ షేరు 16 శాతం పెరిగి రూ.566 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 18 శాతం ఎగిసి రూ.595 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. మార్చి క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం 63% వృద్ధితో రూ.79 కోట్లను సాధించడం ఈ షేరుకు డిమాండ్ పెరిగింది.
- ఏప్రిల్‌లో ఎన్ఎండీసీ ఉత్పత్తి, అమ్మకాలు రెండంకెల వృద్ధిని సాధించడంతో ఈ ప్రభుత్వ రంగ కంపెనీ షేరు రాణించింది. బీఎస్ఈలో ఒకటిన్నర శాతం బలపడి రూ.110 వద్ద స్థిరపడింది.
- కేంద్రం ముడి చమురు ఉత్పత్తిపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను భారీగా తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఓఎన్‌జీసీ షేరు మూడున్నర శాతం లాభపడి రూ.164 వద్ద ముగిసింది.

''ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ4 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు దన్నుతో దేశీయ స్టాక్ సూచీలు లాభాలు గడించాయి. ప్రస్తుతం సాంకేతికంగా నిఫ్టీకి ఎగువ స్థాయిలో 18180 – 18200 శ్రేణిలో కీలక నిరోధం కలిగి ఉంది. దిగువ స్థాయిలో 18050 – 18000 పరిధిలో తక్షణ మద్దతు కలిగి ఉందని'' జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

తెలంగాణలో ఫ్లిప్‌కార్ట్ మరో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్

- సంగారెడ్డిలో ఏర్పాటు; రాష్ట్రంలో ఆరోది
- ప్రారంభించిన ఐటీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తాజాగా తెలంగాణలో మరో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. సంగారెడ్డిలో నెలకొల్పిన ఈ కేంద్రాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు (కేటీఆర్) మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సీజనల్, తాత్కాలిక ఉద్యోగులు, వెండార్లు మొదలైన వారి జీవనోపాధికి కూడా భద్రత కల్పించడంపై ఈ–కామర్స్ కంపెనీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ సూచించారు. అలాగే ఉద్యోగ నైపుణ్యాలు గల మానవ వనరులను పెంపొందించుకునేందుకు ప్రభుత్వాలతో కూడా కలిసి పనిచేసే అంశాన్నీ కంపెనీలు పరిశీలించాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత సాధించే దిశగా పూర్తిగా వారి సారథ్యంలోనే నడిచే ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐటీ) జయేశ్ రంజన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 100కు పైగా సెంటర్లు..

ఉత్పత్తుల డెలివరీలను మరింత వేగవంతం చేసే దిశగా దేశవ్యాప్తంగా తమకు 100కు పైగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నట్లు ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసినది తెలంగాణలో తమకు అతి పెద్దదని తెలిపారు. దీనితో కలిపి రాష్ట్రంలో తమకు మొత్తం ఆరు ఫుల్‌ఫిల్‌మెంట్, సార్టింగ్ సెంటర్లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దాదాపు 4 లక్షల చ.అ. విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు, దీనితో 4 వేల పైచిలుకు ఉద్యోగాలకు ఊతం లభించగలదని కల్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు. తెలంగాణ నుంచి తమ ప్లాట్‌ఫాంలో 14,000 పైగా విక్రేతలు ఉన్నట్లు, 40,000 పైచిలుకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. సంగారెడ్డి ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌తో స్థానికంగా డెలివరీలను మరింత వేగవంతం చేసేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.



ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి, జయేష్ రంజన్

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎస్‌బీఐలో 217 ఎస్‌ఓ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశంలోని పలు ప్రాంతాల్లోని స్పెషల్ కేడర్ ఆఫీసర్(ఎస్ఓ) పోస్టుల భర్తీకి రెగ్యులర్, కాంట్రాక్టు ప్రాతిపదికన నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 217
» **పోస్టుల వివరాలు:** మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో..బీటెక్/బీఈ, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 29.04.2023 నుంచి 19.05.2023
» **ఆన్‌లైన్ పరీక్ష:** జూన్ 2023
» **వెబ్‌సైట్:** www.sbi.co.in/web/careers

సీఆర్‌పీఎఫ్‌లో 212 ఎస్సై, ఏఎస్సై పోస్టులు

డైరెక్టరేట్ జనరల్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. గ్రూప్ బి, సి(నాన్ మినిస్టీరియల్, నాన్ గెజిటెడ్, కంబాటైజ్డ్ సిగ్నల్ స్టాఫ్) కేటగిరీలో ఎస్సై, ఏఎస్సై పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 212
» పోస్టుల వివరాలు: సబ్–ఇన్‌స్పెక్టర్(ఆర్‌వో)–19, సబ్ ఇన్‌స్పెక్టర్(క్రిప్టో)–07, సబ్–ఇన్‌స్పెక్టర్(టెక్నికల్)–05, సబ్–ఇన్‌స్పెక్టర్(సివిల్)(మేల్)–20, అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్(టెక్నికల్)–146, అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్(డ్రాఫ్ట్స్‌మ్యాన్)–15.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 21.05.2023 నాటికి ఎస్సై పోస్టులకు 30 ఏళ్లలోపు, ఏఎస్సై పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్సై పోస్టులు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఏఎస్సై పోస్టులకు రూ. 29,200 నుంచి రూ.92,300 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్/ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.05.2023
» **వెబ్‌సైట్:** https://rect.crpf.gov.in

సీఈసీ.. కార్పొరేట్ కొలువుకు కేరాఫ్!

సీఈసీ.. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులు ఉండే గ్రూప్! సీఈసీ ఉత్తీర్ణులు తమకు బీకాం ఒక్కటే మార్గంగా ఉందని ఆందోళన చెందుతుంటారు. కేవలం బీకాంతోనే జాబ్ మార్కెట్‌లో పోటీ పడగలమా? అని సందేహిస్తుంటారు. వాస్తవానికి సీఈసీ విద్యార్థులకు బీకాంతోపాటు కార్పొరేట్ రంగంలో.. ఉజ్వల కెరీర్స్‌ను అందించే కోర్సులు అనేకం ఉన్నాయి!! వీటిని పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థలు.. రెడ్ కార్పెట్ స్వాగతం పలకడం ఖాయం!! ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. ఈ నేపథ్యంలో.. సీఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రొఫెషనల్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు బీకామ్‌తోపాటు ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరే అవకాశముంది. ముఖ్యంగా సీఏ, సీఎంఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు జాబ్ మార్కెట్‌లో ఎంతో డిమాండ్ నెలకొంది. సీఈసీ విద్యార్థులు ఒకవైపు బీకామ్ చదువుతూనే.. మరోవైపు సంబంధిత ప్రొఫెషనల్ కోర్సుల్లోనూ ఉత్తీర్ణత సాధించొచ్చు. ఆయా ప్రొఫెషనల్ అర్హతలతో కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

మూడు దశల్లో సీఏ కోర్సు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) నిర్వహించే కోర్సు.. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ). ఎన్నో ఏళ్లుగా ఈ కోర్సుకు కార్పొరేట్ ప్రపంచంలో మంచి ఆదరణ ఉంది. మొత్తం మూడు దశలు(ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్)గా ఉండే ఈ కోర్సును సీఈసీ, ఎంఈసీ విద్యార్థులు సులభంగా పూర్తి చేసుకోవచ్చు.

సీఏ ఫౌండేషన్:

- మొత్తం మూడు దశల సీఏ కోర్సులో తొలి దశ.. ఫౌండేషన్ కోర్సు. ఇంటర్మీడియెట్ అర్హతతో సీఏ ఫౌండేషన్‌లో అడుగు పెట్టొచ్చు. ఫౌండేషన్ దశకు నమోదు చేసుకున్న నాలుగు నెలల తర్వాత.. ఫౌండేషన్ పరీక్షలు రాసి తదుపరి దశ ఇంటర్మీడియెట్‌కు అర్హత పొందొచ్చు.
- ఫౌండేషన్ పరీక్షను మొత్తం నాలుగు పేపర్లు, ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున నిర్వహిస్తారు. ప్రతి ఏటా మే, నవంబర్ నెలల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. నవంబర్‌లో పరీక్ష రాయదలచుకున్న వారు జూన్ 30లోపు, మే నెలలో పరీక్షలు రాయాలనుకునే వారు అంతకు ముందు సంవత్సరం డిసెంబర్ 31లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సీఏ ఇంటర్మీడియెట్:

- సీఏ ఇంటర్మీడియెట్ రెండు గ్రూప్‌లుగా ఉంటుంది. ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లు చొప్పున మొత్తం ఎనిమిది పేపర్లు ఉంటాయి. ఈ పరీక్షలు ప్రతి ఏటా రెండుసార్లు (మే, నవంబర్) నిర్వహిస్తారు. ఇందులోనూ మొత్తం ఎనిమిది పేపర్లకు 800 మార్కులకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కులతో, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. సీఏ కోర్సులోని తుది దశ సీఏ–ఫైనల్‌కు అర్హత లభిస్తుంది.



ఆఫ్టర్ ఇంటర్

» సీఈసీ ఉత్తీర్ణులకు పలు ప్రొఫెషనల్ కోర్సులు
» ముందువరుసలో నిలుస్తున్న సీఏ, సీఎస్, సీఎంఏ
» బీకాంలోనూ ఆధునిక సబ్జెక్ట్ కాంబినేషన్లు
» భవిష్యత్తులో ఎంబీఏ, బిజినెస్ స్టడీస్ కోర్సులు

సీఏ ఫైనల్:

- సీఏ ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు రెండున్నరేళ్ల ప్రాక్టికల్ ట్రెనింగ్ పూర్తి చేసిన వారు సీఏ ఫైనల్ పరీక్షలకు నమోదు చేసుకోవచ్చు.
- సీఏ ఫైనల్‌లోనూ రెండు గ్రూప్‌లు (గ్రూప్–1, గ్రూప్–2)గా ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లతో పరీక్ష నిర్వహిస్తారు. గ్రూప్–2లో పేపర్–6ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. విద్యార్థులు నిర్దేశించిన ఆరు సబ్జెక్ట్‌ల నుంచి ఏదైనా ఒక సబ్జెక్ట్‌ను ఎలక్టివ్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అలా ఎలక్టివ్‌గా ఎంచుకున్న సబ్జెక్ట్‌లోనే పరీక్ష నిర్వహిస్తారు.
- ఇలా మొత్తం 800 మార్కులకు ఎనిమిది పేపర్లలో నిర్వహించే ఈ పరీక్షలో ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులు, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఏ కోర్సు పూర్తయినట్లే. ఈ పరీక్షలు ప్రతి ఏటా రెండు సార్లు మే/నవంబర్ నెలల్లో నిర్వహిస్తారు.

కెరీర్ అవకాశాలు

సీఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఫైనాన్స్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ అకౌంటెంట్స్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, ఫైనాన్స్ కంట్రోలర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. పనితీరు, అనుభవం, ప్రతిభ ఆధారంగా కంపెనీలకు మేనేజింగ్ డైరెక్టర్లు, సీఎఫ్ఓ వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.

సీఎంఏ కోర్సు

సీఈసీ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న మరో ముఖ్యమైన కోర్సు.. కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ(సీఎంఏ). దీనినే గతంలో కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెన్సీ కోర్సుగా పిలిచే వారు. ఇంటర్ సీఈసీతో సీఎంఏలో చేరిన విద్యార్థులు ఇంటర్ తర్వాత రెండేళ్ల మూడు నెలల వ్యవధిలో; ఇంటర్ తర్వాత సీఎంఏలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రెండేళ్ల తొమ్మిది నెలల వ్యవధిలో సీఎంఏ కోర్సును పూర్తి చేసుకుని చక్కటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

మూడు దశలుగా సీఎంఏ కోర్సు

సీఎంఏ కోర్సు కూడా మూడు దశల్లో(ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్) ఉంటుంది.

ఫౌండేషన్ కోర్సు:

- సీఎంఏ కోర్సులో తొలి దశ.. ఫౌండేషన్ కోర్సు. ప్రతి ఏటా రెండుసార్లు సీఎంఏ ఫౌండేషన్ పరీక్షలు జరుగుతాయి. డిసెంబర్‌లో జరిగే పరీక్షలకు జూలై 31లోపు, జూన్‌లో జరిగే పరీక్షలకు జనవరి 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష మొత్తం ఎనిమిది సబ్జెక్టులలో నాలుగు పేపర్లుగా ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున 400 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లోనూ ఆబ్జెక్టివ్,డిస్క్రిప్టివ్ విధానంలో ప్రశ్నలుంటాయి. 400 మార్కులకుగాను ప్రతి పేపర్‌లో 40 శాతం చొప్పున, అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. తదుపరి దశ సీఎంఏ–ఇంటర్మీడియెట్‌కు అర్హత లభిస్తుంది.

సీఎంఏ–ఇంటర్మీడియెట్ ఇలా:

- సీఎంఏ ఫౌండేషన్ కోర్సును పూర్తి చేసిన సంవత్సరం తర్వాత.. సీఎంఏ ఇంటర్మీడియెట్ పరీక్షలకు అర్హత లభిస్తుంది. ఈ పరీక్షలను కూడా ప్రతి ఏటా రెండుసార్లు(జూన్, డిసెంబర్) నెలల్లో నిర్వహిస్తారు. జూన్‌లో పరీక్షలకు జనవరి 31లోపు, డిసెంబర్‌లో పరీక్షలకు జూలై 31 లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- సీఎంఏ పరీక్షలో రెండు గ్రూప్‌లు(గ్రూప్–1, గ్రూప్–2).. ఒక్కో గ్రూప్‌లో నాలుగు పేపర్లు ఉంటాయి. అంటే..రెండు గ్రూప్‌లకు కలిపి మొత్తం ఎనిమిది పేపర్లు, ఒక్కో పేపర్‌కు వంద మార్కులు కేటాయించారు. ఇలా రెండు గ్రూప్‌లు కలిపి మొత్తం 800 మార్కులకు సీఎంఏ ఇంటర్మీడియెట్ పరీక్ష జరుగుతుంది.
- రెండు గ్రూప్‌లలోనూ ప్రతి పేపర్‌లో 40 శాతం మార్కులతో మొత్తంగా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. సీఎంఏ కోర్సులోని తుది దశ సీఎంఏ ఫైనల్‌కు అర్హత లభిస్తుంది.

సీఎంఏ ఫైనల్:

- సీఎంఏ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన తర్వాత 6 నెలల ప్రాక్టికల్ ట్రెనింగ్ కూడా పూర్తి చేసుకుంటే..సీఎంఏ ఫైనల్ పరీక్షలకు అర్హత లభిస్తుంది. ఫైనల్‌లోనూ రెండు గ్రూప్‌లు (గ్రూప్–3, గ్రూప్–4) ఉంటాయి. ఒక్కో గ్రూప్‌లో నాలుగు సబ్జెక్టులు/పేపర్లలో పరీక్ష ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్/పేపర్‌కు వంద మార్కులతో పరీక్ష నిర్వహిస్తారు. అంటే.. మొత్తం రెండు గ్రూప్‌ల్లో కలిపి ఎనిమిది పేపర్లలో 800 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఎనిమిదో పేపర్‌లో మూడు ఎలక్టివ్స్ ఉంటాయి.వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. రెండు గ్రూప్‌లలోనూ ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కు లు, మొత్తం అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులు పొందితే.. సీఎంఏ కోర్సు పూర్తి చేసుకున్నట్లే!

ఉద్యోగావకాశాలు

సీఎంఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్, కాస్ట్ కంట్రోలర్, చీఫ్ అకౌంటెంట్, ఫైనాన్షియల్ కంట్రోలర్ వంటి కీలకమైన కొలువులు లభిస్తాయి. ఇటీవల సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో.. హెచ్‌సీఎల్, ఐడీబీఐ, ఐటీసీ, సిప్లా, జెన్‌ప్యాక్ట్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి సంస్థలు ఆకర్షణీయమైన పే ప్యాకేజ్‌లతో ఉద్యోగాలందించాయి.

కంపెనీ సెక్రటరీ కోర్సు

సీఏ, సీఎంఏలతోపాటు సీఈసీ గ్రూప్ విద్యార్థులకు మరో చక్కటి కోర్సు..కంపెనీ సెక్రటరీ(సీఎస్). ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నిర్వహించే సీఎస్ కోర్సు మూడు దశలుగా ఉంటుంది.

సీఎస్ ఫౌండేషన్ కోర్సు

ఎగ్జిక్యూటివ్ ఎంట్రన్స్ టెస్ట్:

- సీఎస్ మూడు దశల్లోని మొదటి దశ పరీక్ష ఇది. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ పరీక్ష ఏటా నాలుగు సార్లు(మే, జూలై, నవంబర్, జనవరి నెలల్లో) జరుగుతుంది. విద్యార్థులు ఏ నెలలో పరీక్ష రాయాలనుకుంటున్నారో.. ఆ పరీక్షకు ముందు నెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షను మొత్తం రెండు వందల మార్కులకు కంప్యూటర్ బేస్ట్ విధానంలో నిర్వహిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, వైవావోస్ విధానంలో పరీక్ష ఉంటుంది. బిజినెస్ కమ్యూనికేషన్, లీగల్ ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్, ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ సబ్జెక్ట్‌ల నుంచి మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 170 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రజెంటేషన్ ఆఫ్ కమ్యూనికేషన్ స్కిల్స్(వైవావోస్) పేరుతో 30 మార్కులకు ప్రత్యేకంగా మరో పరీక్ష ఉంటుంది. ఇలా మొత్తం 200 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే.. సీఎస్‌లోని రెండో దశ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌కు అర్హత లభిస్తుంది.

ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్:

- సీఎస్ ఫౌండేషన్ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.. సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత తొమ్మిది నెలలకు ఎగ్జిక్యూటివ్ పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది. సీఎస్ ఎగ్జిక్యూటివ్ రెండు మాడ్యూల్స్‌లో ఉంటుంది.
- మాడ్యూల్–1లో నాలుగు పేపర్లు,మాడ్యూల్–2లో నాలుగు పేపర్లు మొత్తం రెండు మాడ్యూల్స్ కలిపి ఎనిమిది పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 100 మార్కులు. విద్యార్థులు ప్రతి పేపర్‌లోనూ 40 శాతం మార్కులతో అన్ని పేపర్లు కలిపి సగటున 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఎస్ తుది దశగా పేర్కొనే ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌కు అర్హత లభిస్తుంది.

ప్రొఫెషనల్ ప్రోగ్రామ్:

- సీఎస్ కోర్సులో తుది దశ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. ఇందులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసుకోవడంతో పాటు నిర్దేశిత వ్యవధిలో అప్రెంటీస్‌షిప్ ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారికి సీఎస్ ప్రొఫెషనల్ కోర్సులో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుంది. మాడ్యూల్–1లో మూడు పేపర్లు, మాడ్యూల్–2లో మూడు పేపర్లు ఉంటాయి. మాడ్యూల్–3లో కూడా మూడు పేపర్లు ఉంటాయి. తొమ్మిదో పేపర్‌ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. విద్యార్థులు నిర్దేశిత అయిదు సబ్జెక్ట్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను ఎలక్టివ్ పేపర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. అలా ఎంచుకున్న సబ్జెక్ట్‌లోనే మూడో మాడ్యూల్‌లో తొమ్మిదో పేపర్‌గా పరీక్ష నిర్వహిస్తారు.
- మొత్తం మూడు మాడ్యూల్స్‌లో కలిపి 9 పేపర్లకు 900 మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది. ఒక్కో పేపర్‌లో 40 శాతం మార్కులతో అన్ని పేపర్లలో కలిపి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సీఎస్ సర్టిఫికెట్ చేతికందుతుంది.

కెరీర్ అవకాశాలు

కంపెనీ సెక్రటరీషిప్ కోర్సు పూర్తి చేసుకున్న వారు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కంపెనీ ప్రిన్సిపల్ సెక్రటరీ, కంపెనీ రిజిస్ట్రార్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్స్,ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్‌గా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

బీకాం వినూత్నంగా

సీఈసీ విద్యార్థులకు తక్షణమే గుర్తొచ్చే బీకాంలోనూ ఇప్పుడు వినూత్న సబ్జెక్ట్ కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిల్లో ముఖ్యమైంది.. బీకాం అనలిటిక్స్ కోర్సు. అదే విధంగా సీఈసీ విద్యార్థులు భవిష్యత్తులో మేనేజ్‌మెంట్ విభాగంలో రాణించేందుకు దోహదం చేసే బీబీఏ లేదా బీబీఎం కోర్సుల్లోనూ అడుగు పెట్టొచ్చు. ఎంకాంలోనూ..ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ వంటి వినూత్న స్పెషలైజేషన్లు పూర్తి చేసుకోవచ్చు. ఈ సర్టిఫికెట్లతో..కార్పొరేట్ రంగంలో ఆకర్షణీయ వేతనాలతో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

జూడాల సమ్మె వాయిదా

సాక్షి, హైదరాబాద్: జూనియర్ వైద్యుల (జూడా) సమ్మె వాయిదా పడింది. తమ సమస్యల పరిష్కారానికి బుధవారం నుంచి సమ్మె నిర్వహించాలని జూడా నేతలు నిర్ణయించిన నేపథ్యంలో వారితో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం సమావేశమయ్యారు. అనంతరం జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కౌశిక్ కుమార్ పింజర్ల ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్న్‌లు, పీజీలు, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లకు 15 శాతం స్టైఫండ్ పెంపుపై మంత్రి హామీ ఇచ్చారన్నారు. అందుకు సంబంధించిన ఫైల్ సీఎం కార్యాలయంలో ఉందన్నారని వెల్లడించారు. తమకు నిత్యం అండగా ఉంటున్నందుకు మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హామీ మేరకు సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించామని వెల్లడించారు.

విద్య, వైద్యంపై ఇంటింటి సర్వే

ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నివేదికల ఆధారంగా కార్యాచరణ చేపట్టాలని భావిస్తోంది. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మంగళవారం ఈ అంశంపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఆర్థిక, ప్రణాళిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్టారావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని వర్గాలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, కోవిడ్ తర్వాత ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. బోధన ఏమేర అర్థమవుతోంది? పాఠశాల విద్యార్థుల పురోగతి ఏ విధంగా ఉందనే అంశాలపై సమీక్షించారు. పోషకాహార లోపంతో ఉన్న వారి విద్యా ప్రమాణాలపై సమగ్ర వివరాలు అవసరమని భావించారు.

బడికి తాత్కాలిక వాచ్‌మన్లు

ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: 'మన ఊరు– మనబడి, మన బస్తీ–మన బడి'పథకం కింద తొలిదశలో పూర్తయిన పాఠశాలల్లో తాత్కాలికంగా వాచ్‌మన్లను ఏర్పాటు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శౌచాలయాలు, తాగునీటి ట్యాంకు, సోలార్ పీవీ సిస్టమ్, డైనింగ్ హాల్స్ నిర్వహణకు వాచ్‌మెన్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతీ ఒక్కరితో మర్యాదగా ప్రవర్తించండి

గౌరవం ఇవ్వకపోతే ఎంత సేవ చేసినా వృథానే: డీజీపీ అంజనీకుమార్




సాక్షి, హైదరాబాద్: పౌరుల ఆత్మగౌరవానికి పోలీసులు విలువనివ్వాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతీ ఒక్కరితో అక్కడి సిబ్బంది, అధికారులు మర్యాదతో మాట్లాడాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. ఎంత టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలున్నా ఒక వ్యక్తి ఆత్మగౌరవానికి విలువ ఇవ్వకపోతే అన్నీ వృథానే అని ఆయన అభిప్రాయపడ్డారు. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ వినియోగంపై మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. నేర పరిశోధన వేగవంతంగా జరిపేందుకు ఫోరెన్సిక్ సైన్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ పరిశోధనలోనూ ఈ ఫోరెన్సిక్ సైన్స్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి దేశంలోనే మరే రాష్ట్రంలో లేనంతటి ఆధునిక పరికరాలున్నాయని వెల్లడించారు. ఫోరెన్సిక్ లాబ్‌లో జనవరి 2022లో 7186 పరిశోధనా కేసులుండగా, 2023 ఏప్రిల్ నాటికి 2093 కు తగ్గాయని చెప్పారు. ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్, అడిషనల్ డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ.. నార్కోటిక్స్, మాదక ద్రవ్యాల గుర్తింపులో అత్యంత ఆధునిక ఎక్విప్మెంట్‌ను సమకూర్చుకున్నామని చెప్పారు. వీసీలో ఎఫ్ఎస్ఎల్ సైంటిస్టులు కె. అంజన, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



అడవి సోయగానికి అద్దం పట్టింది

చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన చిత్రం కాదు.. కెమెరా ఇంద్రజాలమిది. ఆదిలాబాద్‌లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో అటవీ ప్రాంతం మీదుగా కారులో ప్రయాణిస్తున్నప్పుడు ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. ఈ సందర్భంగా కారులోంచి తీసిన ఛాయాచిత్ర విన్యాసమిది. అద్దంపై వాననీటి బిందువులతో పాటు మనోహర ప్రకృతి సోయగం మదిని దోచుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఒక మిలియన్ యూరోలు.. 158 ఏళ్లు

ఒక మిలియన్ యూరోలు సంపాదించడానికి భారత్‌లోని సగటు జీతగాడికి ఎంత సమయం పడుతుంది? ఇంతకీ మిలియన్ యూరోలు అంటే ఎంతో చెప్పలేదు కదూ.. రూ. 9.09 కోట్లు.. ఈ లెక్కన భారతీయులకు 158 ఏళ్లు పడుతుందట! 30 ఏళ్లు సర్వీసు వేసుకున్నా.. ఐదు జీవితకాలాలు అన్నమాట. మన పరిస్థితి ఇలా ఉంటే.. పాకిస్తాన్ పరిస్థితి మరీ ఘోరం.. అక్కడైతే.. ఏకంగా 664 ఏళ్లు పడుతుందట. ప్రపంచంలో అత్యంత తక్కువగా స్విట్జర్లాండ్ వాసులకు ఇందు కోసం కేవలం 15 ఏళ్లే పడుతోంది. మన దేశవాసుల సగటు జీతం రూ.48 వేలు కాగా.. స్విట్జర్లాండ్‌లో అది రూ.5 లక్షలు. ఆయా దేశాల్లోని ఉద్యోగుల కనిష్ఠ వేతనం, గరిష్ఠ వేతనాన్ని పరిగణనలోకి తీసుకుని.. ఈ సగటు వేతనాన్ని నిర్ధారించారు.

మరి ఓసారి ఇందులో టాప్‌-5.. లీస్ట్‌-5 జాబితాన్ని చూసేద్దామా..

-సాక్షి సెంట్రల్ డెస్క్



హైదరాబాద్ శివార్లలో ఉన్న ఓ కార్పొరేట్ స్కూల్ కోవిడ్‌కు ముందు ఎల్‌కేజీకి రూ.78 వేలు తీసుకుంది. ఇప్పుడు ఏకంగా రూ. 1.50 లక్షలు అడుగుతోంది.

వరంగల్‌కు సమీపంలోని ఓ స్కూల్ యూకేజీకి 2020కి ముందు రూ. 35 వేలు తీసుకుంది. ఇప్పుడేమో రూ.98 వేలు అడుగుతోంది. కోవిడ్ వల్ల టీచర్లు దొరకడం లేదని, అదనపు జీతాలు ఇవ్వాల్సి వస్తోందని చెబుతోంది.

ఖమ్మంలోని ఓ ప్రైవేటు బడి వార్షిక ఫీజును ఏకంగా 40 శాతం పెంచింది. దీనికి తోడు కొత్తగా చేరేవారి నుంచి డొనేషన్లు వసూలు చేస్తోంది. కోవిడ్ తర్వాత పరిస్థితులు మారడమే దీనికి కారణమని చెబుతోంది.

ఎల్‌కేజీకి లక్షన్నర!

- ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల బాదుడు
- కోవిడ్ తర్వాత చాలాచోట్ల రెట్టింపు..
- సగం ముందే కట్టాలని డిమాండ్..
- ఆచరణకు నోచుకోని ఫీజుల నియంత్రణ
- పేదలకు పెనుభారమవుతున్న విద్య

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలలు ఈసారి ఫీజులు భారీగా పెంచినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్ని బడుల్లో ఏకంగా 50 శాతం వరకూ ఫీజులు పెంచారని వాపోతున్నారు. కోవిడ్ తర్వాత గత ఏడాది నుంచి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీన్ని అదనుగా చేసుకుని తల్లిదండ్రుల నుంచి అందినంతా దోచేస్తున్నాయి. అదీగాక, సగం ఫీజును ముందుగానే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫాం అంటూ అదనపు బాదుడు సరేసరి. ఇంకోవైపు డీజిల్ ధర విపరీతంగా పెరిగిందంటూ రవాణా చార్జీలూ 30 శాతం వరకూ పెంచారు. దీంతో పేదవాడికి ప్రైవేటు విద్య తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టినా అంతంతమాత్రంగానే చదువు సాగుతోందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్నారు.

నియంత్రణ ఏమైనట్టు?

ప్రైవేటు ఫీజుల దందాను నియంత్రించేందుకు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ సహా 15 రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తెచ్చాయి. తెలంగాణలో కూడా ఇదే బాట పట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత భావించింది. దాదాపు 11 వేల ప్రైవేటు బడులను నియంత్రణ పరిధిలోకి తేవాలని భావించింది. దీంతో ఫీజుల నియంత్రణ కోసం 2016లో ఆచార్య తిరుపతిరావు కమిటీని నియమించింది. ఈ కమిటీ 2017లో ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసింది. స్కూల్లో విద్యార్థిని చేర్చేటప్పుడు ఉన్న ఫీజు ఆ మరుసటి సంవత్సరమే ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నట్లు, కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకూ పెంచుతున్నట్లు కమిటీ దృష్టికొచ్చింది. స్కూలును బట్టి రూ.12 వేల నుంచి రూ. 4 లక్షల వరకూ వార్షిక ఫీజు వసూలు చేస్తున్నట్లు కమిటీ గుర్తించింది. ఇష్టానుసారం కాకుండా మౌలిక వసతుల ఆధారంగా ఫీజులు పెంచాలని కమిటీ సూచించినా అది కార్యాచరణకు నోచుకోలేదు.

ఆ విధానం కనుమరుగు...

రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షలకుపైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. ఫీజుల నియంత్రణను బడ్జెట్ స్కూళ్లు (వార్షిక ఫీజు రూ. 20 వేలలోపు ఉండేవి) స్వాగతించాయి.

స్కూల్ డెవలప్‌మెంట్ చార్జీలు, ఇతర ఖర్చులు కలిపి 15% ఏటా పెంచుకునేందుకు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవోలిచ్చారు. ఇక్కడే సమస్య వస్తోంది. పెద్ద స్కూళ్లు అవసరం లేని ఖర్చును అభివృద్ధిగా చూపిస్తున్నాయి. ఉదాహరణకు ఒక స్కూల్లో ప్రతీ గదిలో అత్యాధునిక సౌండ్ సిస్టం, టెక్నాలజీ అభివృద్ధి చేశారు. దీన్ని విద్యార్థుల కోసం ఖర్చు పెట్టినట్టు లెక్కల్లో చూపి 25 శాతం ఫీజు పెంచారు.



ఫీజుల పెంపును పరిశీలించేందుకు 2018లో తిరుపతిరావు కమిటీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. దాదాపు 4,500 స్కూళ్లు తమ ఖర్చులను ఆన్‌లైన్ ద్వారా చూపాయి. ఇవన్నీ 10 శాతం లోపు ఫీజులు పెంచేందుకు అర్హత పొందాయి. ఈ విధానం ఆ తర్వాత కనుమరుగైంది.

ప్రతీ స్కూలు 10 శాతం వరకు ఫీజు పెంచుకోవచ్చు. 10 శాతం పైగా ఫీజు పెంచే స్కూళ్లు విధిగా లెక్కలు చూపాలి. వీటిని ఫీజుల నియంత్రణ కమిటీ పరిశీలిస్తుంది. పాఠశాల యాజమాన్యం ఎక్కడ తప్పు చేసినా భారీ జరిమానాతోపాటు గుర్తింపు రద్దు చేయొచ్చని కమిటీ సిఫార్సు చేసింది.

ఫీజుల నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం గత ఏడాది ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినా ఫీజుల నియంత్రణ కార్యాచరణకు నోచుకోలేదు.

స్టాఫ్‌నర్స్ పోస్టులకూ ఆన్‌లైన్ పరీక్ష

హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌ల్లో సెంటర్లు

- రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించాలని వైద్య,ఆరోగ్య శాఖ నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా 5,204 పోస్టులకు 40,936 మంది దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖలో వివిధ విభాగాల్లోని స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఆన్‌లైన్ విధానం(సీబీటీ)లో నిర్వహించాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. పరీక్ష కోసం హైదరాబాద్‌తోపాటు, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్‌ల్లో సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒకే రోజు రెండు సెషన్లలో.. ఉదయం సగం మందికి, సాయంత్రం సగం మందికి పరీక్ష నిర్వహిస్తారు. వైద్య, ఆరోగ్యశాఖ పరీక్ష పేపర్‌ను తయారు చేయగా, హైదరాబాద్ జేఎన్‌టీయూ పరీక్షలు నిర్వహిస్తుంది. ఒకట్రెండు నెలల్లో పరీక్ష జరిగే అవకాశం ఉందని సమాచారం.

పేస్కేల్ పెరగడంతో భారీ డిమాండ్.

కాగా, స్టాఫ్‌నర్స్ పోస్టులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. 5,204 పోస్టులకు గాను ఇప్పటివరకు 40,936 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో స్టాఫ్‌నర్స్ పోస్టుకు ఎనిమిది మంది పోటీపడుతున్నారు. ఈ పోస్టులకు పేస్కేల్ రూ. 36,750 – రూ. 1,06,990 మధ్య ఉండటంతో డిమాండ్ పెరిగింది. ఇప్పటికే వేలాది మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. రాత పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. అనాటమీ, ఫిజియాలజీల్లో 14 అంశాలు, మైక్రోబయాలజీలో ఆరు అంశాలు పరీక్ష సిలబస్‌లో ఉంటాయి. ఈ మేరకు అభ్యర్థులు తయారు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.



స్టాఫ్‌నర్సు రాత పరీక్ష సిలబస్ ఇదీ..

ఫస్ట్ ఎయిడ్, సైకాలజీ, సోషియాలజీ; ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్; కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్;ఎన్విరాన్‌మెంటల్ హైజీన్; హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్;న్యూట్రిషన్, మెడికల్ సర్జికల్ నర్సింగ్; మెంటల్ హెల్త్ నర్సింగ్, చైల్డ్ హెల్త్ నర్సింగ్; మిడ్ వైఫరీ గైనకాలజికల్ నర్సింగ్; గైనకాలజియల్ నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్; నర్సింగ్ ఎడ్యుకేషన్;ఇంట్రడక్షన్ టు రీసెర్చ్; ప్రొఫెషనల్ ట్రెండ్స్ అండ్ అడ్జస్ట్‌మెంట్; నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వార్డ్ మేనేజ్‌మెంట్

రేపటితో ముగియనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్

- ఈ నెల 5వ తేదీలోగా ఫీజు చెల్లించాలి.. 29 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- జూన్ 4న అడ్వాన్స్‌డ్ పరీక్ష.. 18న ఫలితాల విడుదల
- ఐఐటీ గౌహతి షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌–2023కు రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 4వ తేదీన ముగియనుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు పరీక్ష ఫీజును ఈ నెల 5వ తేదీలోగా చెల్లించాలి. దీనికి సంబంధించిన సమాచార బులిటెన్‌ను ఐఐటీ గౌహతి విడుదల చేసింది. ఈ సంస్థ ఈ ఏడాది జూన్ 4వ తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించనుంది. గత నెలలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో 2.5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 16 వేల సీట్లు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ అడ్వాన్స్‌డ్ కాస్త కఠినంగానే ఉండే అవకాశముంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్‌–1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్‌–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. జూన్ 18న ఫైనల్ కీతోపాటే ఫలితాలు విడుదల చేస్తారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి 25 నుంచి 31 వరకు నిర్వహించారు, రెండో సెషన్ ఏప్రిల్ 6 నుంచి 15 వరకు జరిగింది. ఈ ఫలితాలను ఏప్రిల్ 29న విడుదల చేశారు. మెయిన్స్ ద్వారా అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది అర్హత సాధిస్తున్నా, పరీక్ష రాసేవాళ్లు మాత్రం 1.5 లక్షల మందే ఉంటున్నారు. ఈసారి మెయిన్స్‌కు ఎక్కువ అప్లికేషన్లు వచ్చాయి. కోవిడ్ తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ఎక్కువమంది దరఖాస్తు చేశారు. దీన్నిబట్టి అడ్వాన్స్‌డ్‌కు కూడా దరఖాస్తులు పెరిగే వీలుందని భావిస్తున్నారు.

'కళామందిర్'లో ఐటీ సోదాలు

- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కర్ణాటకలోని సంస్థల్లో తనిఖీలు
- వస్త్ర దుకాణాల పన్ను చెల్లింపులలో అవకతవకలపై ఆరా..
- పలు రికార్డులు స్వాధీనం!

సాక్షి, హైదరాబాద్: పన్ను చెల్లింపులలో అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సాయి సిల్క్స్ కళామందిర్ గ్రూప్ సంస్థల్లో ఐటీ అధికారులు మంగళవారం సోదాలు చేపట్టారు. ఏకకాలంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంతోపాటు కర్ణాటకలోని పలుప్రాంతాల్లో ఆదాయపన్ను శాఖ అధికారుల సోదాలు కొనసాగినట్టు సమాచారం. మొత్తం 20కిపైగా ప్రాంతాల్లో కొనసాగిన ఈ సోదాల్లో 50కిపైగా ఐటీ అధికారుల బృందాలు పాల్గొన్నట్టు తెలిసింది. వస్త్రాల కొనుగోళ్లకు సంబంధించి తప్పుడు బిల్లులు చూపడం, వాటి ద్వారా పెద్ద మొత్తం పన్నులను ఎగవేయడంపై ఐటీ అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ప్రధానంగా సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ గ్రూప్‌నకు చెందిన కళామందిర్, కాంచిపురం వర మహాలక్ష్మి, కేఎల్ఎం షాపింగ్‌మాల్ కార్యాలయాల్లో, సదరు కంపెనీల డైరెక్టర్లు, ఇతర కీలక వ్యక్తుల ఇళ్లలోనూ ఈ సోదాలు కొనసాగినట్టు తెలిసింది.

ఉదయం ఆరు గంటల నుంచే...: హైదరాబాద్‌లో గచ్చిబౌలి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, మాదాపూర్, కిస్మత్‌పురల్లోని కళామందిర్, కాంచిపురం వరమహాలక్ష్మి, కేఎల్ఎం షాపింగ్ మాల్‌లలో ఐటీ అధికారులు బృందాలు మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి వరకు సోదాలు నిర్వహించాయి. విజయవాడ, విశాఖపట్నంతోపాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లోనూ ఆ సంస్థలపై దాడులు చేసి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆయా కంపెనీల నుంచి వస్త్రాల కొనుగోలుకు సంబంధించిన రికార్డులు, తర్వాత షోరూంలలో విక్రయాల రికార్డులు, బిల్లుల జారీ, స్టాక్ నమోదు వివరాలను ఐటీ అధికారులు సేకరించినట్టు తెలిసింది.

ప్రశ్నపత్రం రాక ఆగిన పరీక్ష

- ప్రశ్నపత్రం ముద్రణలో అలసత్వం
- రాష్ట్రవ్యాప్తంగా ఎకనామిక్స్ పరీక్ష రద్దు
- అధికారుల నిర్వాకంతో ఓపెన్ ఇంటర్ అభ్యర్థుల ఆందోళన

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు మరువకముందే.. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలోనూ అధికారుల డొల్లతనం బయటపడింది. తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ఎకనామిక్స్ పరీక్షకు తెలుగు మీడియం ప్రశ్నపత్రాన్ని ముద్రించలేదు. దీంతో అందరికీ ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలే రాగా చివరకు పరీక్ష రద్దు చేయాల్సి వచ్చింది. ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఇంటర్‌మీడియట్, పదో తరగతి పరీక్షలు గతనెల 25న మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఇంటర్ విద్యార్థులకు మంగళవారం ఉదయం బయాలజీ/ఎకనామిక్స్, మధ్యాహ్నం అకౌంటెన్సీ పరీక్షలు జరగాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. తెలుగు మీడియం , ఇంగ్లిష్ మీడియం అని రాసిన ప్రశ్నపత్రాల బండిళ్లను అధికారులు విప్పగా.. అన్నీ ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలే ఉన్నాయి. దీనిపై ఆరా తీస్తే అసలు తెలుగు మీడియం ప్రశ్నపత్రాలే ముద్రించలేదని.. అది పరిశీలించకుండానే ముందుగానే సిద్ధమైన కవర్లలో పెట్టి పంపించారని సమాచారం. దీంతో విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించగా తెలుగు మీడియం ఎకనామిక్స్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసి ఈనెల 13వ తేదీన తిరిగి నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. దీంతో అంతసేపు వేచిఉన్న అభ్యర్థులు ఉసూరుమంటూ తిరిగి ఇళ్లకు బయల్దేరారు. అయితే, ఎకనామిక్స్ ఇంగ్లిష్ మీడియం పరీక్ష సహా మిగతా పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించారు.



Government of Telangana
Education Department
Telangana Open School Society, Hyderabad

PRESS NOTE

Telangana Open School Society, Hyderabad Intermediate Economics (Subject Code 318) Telugu Medium Examination scheduled on 02-05-2023 FN is hereby cancelled. The same will be conducted on 13-05-2023 FN at respective Examination Centers only.

All the Learners of Intermediate, Economics (Subject Code 318) Telugu Medium are requested to make a note of it.

DIRECTOR

ఎకనామిక్స్ పరీక్ష రద్దు చేస్తూ, ఈనెల 13కు వాయిదా వేస్తూ డైరెక్టర్ విడుదల చేసిన ప్రకటన

ఎంసెట్‌కు అదనంగా 29 కేంద్రాలు

ఏపీలోనూ కేంద్రాలు పెంచుతాం

- ఈసారి 50 వేలు అదనంగా దరఖాస్తులు
- అన్ని ప్రవేశ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు: ప్రొఫెసర్ లింబాద్రి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌కు ఈసారి 50 వేల దరఖాస్తులు పెరగడంతో అదనంగా 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఏపీలోనూ పరీక్ష కేంద్రాల పెంపు ఉంటుందని చెప్పారు. ప్రవేశ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ వైఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డితో కలిసి లింబాద్రి మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ''ఎంసెట్ సహా అన్ని రకాల ప్రవేశ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఎంసెట్‌కు ఇప్పటికే 2.5 లక్షలకు పైగా విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నెల 10 నుంచి 14 వరకు ఎంసెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 10, 11 తేదీల్లో అగ్రికల్చర్, 12, 13, 14 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహిస్తాం. ఈ ఏడాది 3.20 లక్షల దరఖాస్తులొచ్చాయి. అగ్రికల్చర్, మెడికల్‌కు 113, ఇంజనీరింగ్‌కు 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం'' అని వివరించారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం..

విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని.. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ప్రొఫెసర్ లింబాద్రి స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలన్నారు. లాసెట్‌ను ఒకే రోజు మూడు సెషన్లలో నిర్వహిస్తున్నామని, ఎడ్‌సెట్ సైతం ఒకే రోజు మూడు సెషన్లలో పూర్తిచేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఈసెట్ ఒకే పూటలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో–కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, ఎడ్‌సెడ్ కో కన్వీనర్ ప్రొఫెసర్ పారుపల్లి శంకర్ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు... ప్రతీ కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్

టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ లీకేజీల నేపథ్యంలో ఈ నెలలో జరగనున్న ప్రవేశ పరీక్షల నిర్వహణపై ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయి సిట్టింగ్ స్క్వాడ్‌ను (అబ్జర్వర్) నియమించాలని నిర్ణయించింది. ప్రతి పరీక్షాకేంద్రంలో ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించనుంది. వీరు పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాలపై గట్టి నిఘాను పెడతారు. ప్రతీ పరీక్షాకేంద్రం వద్ద నలుగురు పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఇక సెల్‌ఫోన్లను పూర్తిస్థాయిలో నిషేధించారు. పరీక్షాకేంద్రాలు నో సెల్‌ఫోన్ జోన్లుగా అమలుపరుస్తారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, పరీక్ష నిర్వహణ సిబ్బంది సహా అందరికీ ఈ నిబంధన వర్తించనుంది. ఒక్క అబ్జర్వర్‌కు మాత్రం పరీక్ష మొదలైన 15 నిమిషాల వరకే సెల్‌ఫోన్ వాడేందుకు అనుమతిస్తారు. అది కూడా పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారన్న సమాచారాన్ని చేరవేసేందుకు మాత్రమే. ఎంసెట్‌తో పాటు ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్, ఈసెట్, పీజీఈసెట్, పీఈసెట్‌లన్నింటికీ ఇదే నిబంధనలు వర్తిస్తాయి.

సెట్ల వారీగా దరఖాస్తుల సంఖ్య

ప్రవేశ పరీక్ష	2023	2022
ఎంసెట్	3,20,587	2,66,714
ఎడ్‌సెట్	29,390	38,091
ఈసెట్	21,586	24,095
లాసెట్	41,439	36,332
ఐసెట్	43,242	75,952
పీజీఈసెట్	13,636	14,612

'పార్టీలు బీఎల్‌ఏలను నియమించుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లోని 34,891 పోలింగ్ కేంద్రాలకు బూత్‌స్థాయి ఏజెంట్ల (బీఎల్‌ఏ)ను రాజకీయ పార్టీలు నియమించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కోరారు. కేవలం 1785 బూత్ స్థాయి ఏజెంట్లను మాత్రమే కలిగి ఉండటం సరిపోదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మంగళవారం ఆయన నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ప్రతినిధులు హాజరయ్యారు. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలపై పార్టీలు క్షేత్ర స్థాయిలో అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాలు/చిరునామా మార్పు, ఓటర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.